అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 27-8-2017
సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 239 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు + సోపతి వెల : 6.00

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 27-8-2017

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 239 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు + సోపతి వెల: 6.00

అమెరికా చేతిలో.. ఆధార్ గుట్టు

యూఎస్ నిఘా సంస్థలో సైబర్ దొంగతనాలకు ప్రత్యేక విభాగం

సీఐఏకూ, భారత్‌కూ సాంకేతికత సరఫరాదారుగా ఒకే సంస్థ : వికీలీక్స్

- ఆరోపణలు నిరాధారం: అధికార వర్గాలు



చెన్నై: ఆధార్ బయోమెట్రిక్ డేటాను అమెరికా నిఘా సంస్థ సీఐఏ తస్కరించినట్టు వికీలీక్స్ వెల్లడించింది. ఆధార్‌కార్డుల కోసం బయోమెట్రిక్ సాంకేతికతను సరఫరా చేసిన అమెరికా సంస్థ క్రాస్‌మ్యాచ్ టెక్నాలజీస్ ద్వారా సీఐఏ సైబర్ దొంగతనానికి పాల్పడినట్టు వికీలీక్స్ తెలిపింది. అయితే, వికీలీక్స్ ఆరోపణల్లో నిజం లేదని భారత అధికార వర్గాలు చెబుతున్నాయి. 12లక్షలమంది భారతీయుల ఆధార్ గుర్తింపు కార్డుల డేటాబేస్‌ను క్రాస్‌మ్యాచ్ వ్యాపార భాగస్వామియైన స్మార్ట్ ఐడెంటిటీ డెవిసెస్ ప్రయివేట్ లిమిటెడ్ నమోదు చేసినట్టు వికీలీక్స్ గుర్తు చేసింది. ఇప్పటికే ఆధార్ డేటాబేస్‌ను సీఐఏ తస్కరించినట్టు శుక్రవారం వికీలీక్స్ ట్వీట్ చేసింది. అయితే, ఆధార్ డేటాబేస్‌ను తస్కరించడం ఎవరికీ సాధ్యంకాదని, రహస్య(ఎన్‌క్రిప్టెడ్) రూపంలో ఆధార్ సర్వర్స్‌కు మాత్రమే అది సరఫరా అవుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. బయోమెట్రిక్ సాంకేతికత ఇచ్చిన క్రాస్‌మ్యాచ్‌కు ...9లో





విధ్వంసం..

డేరా చీఫ్ గుర్మీత్ దోషి



లైంగికదాడి కేసులో సీబీఐ కోర్టు సంచలన తీర్పు... చెలరేగిన హింస

- కార్యాలయాలకు, వాహనాలకు నిప్పు
- 37 మంది మృతి, 350 మందికి గాయాలు
- రేపు శిక్ష ఖరారు చేయనున్న సీబీఐ కోర్టు

2లో

మోడీ దేశానికి ప్రధాని బీజేపీకి కాదు

- రాజకీయ స్వార్థం కోసం నగరాన్ని తగులబెడుతారా?
- చిన్న అధికారిపై వేటు వేసి చేతులు దులుపుకుంటారా?
- ఆందోళనకారులకు తలొగ్గిన సీఎం ఖట్టర్
- కేంద్రం, హర్యానా ప్రభుత్వంపై హైకోర్టు ఆగ్రహం

హర్యానా సీఎం ఖట్టర్ రాజీనామాకు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో డిమాండ్

నల్లగొండలో డేరా బాబా ఆస్తులు

వెల్మినేడులో 55 ఎకరాలు.. అందులో 20 ఎకరాలు అసైన్డ్



సైనా నెహ్వాల్‌కు కాంస్యం

సింధుకు సైతం మెడల్ ఖాయం

ప్రపంచ చాంపియన్‌షిప్స్

వివరాలు ఆటలులో

చీటికిమాటికి రావొద్దు

నియోజకవర్గాల్లో ప్రజలతోనే ఉండండి

- సిట్టింగులందరికీ టికెట్లు ఇస్తాం
- గెలిపించుకునే బాధ్యత నాదే
- 2019లో అధికారం మనదే
- ప్రతిపక్షాలపై విశ్వాసం లేదు: టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు సీఎం కేసీఆర్ పిలుపు



మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'చీటికి మాటికి మీరు హైదరాబాద్‌కు రాకండి. వారిని వీరిని కలవాలంటూ ఇక్కడికి వచ్చి టైం వేస్ట్ చేసుకోకండి. ప్రజలకు అందుబాటులో ఉండండి. ఎవరూ అధైర్యపడాల్సిన పనీ లేదు. సిట్టింగులందరికీ టికెట్లు ఇస్తాం. మీ పని మీరు చేయండి. గెలిపించుకునే బాధ్యత నాదే. ప్రతిపక్షాలు గెలిచిన ఎస్సీ, ఎస్టీ స్థానాల్లో బలమైన అభ్యర్థులను నిలపాలి. ఎస్సీ, ఎస్టీ స్థానాలపై మరింత శ్రద్ధ పెట్టాలి. ప్రతిపక్షాలపై ప్రజల్లో విశ్వాసం లేదు. 2019లో అధికారం టీఆర్ఎస్‌దేనని సర్వేలు చెబుతున్నాయి. కాబట్టి ప్రజలకు ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండాలి. భూ సర్వే పూర్తయ్యే దాకా, రైతు సమాఖ్యలను ఏర్పాటు చేసేవరకు స్థానికంగానే ఉండాలి' అని ముఖ్యమంత్రి కేసీఆర్ టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. శనివారం తెలంగాణ భవన్‌లో టీఆర్ఎస్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ముఖ్యమంత్రి కేసీఆర్ సమావేశమయ్యారు. భూ సమగ్ర సర్వే, రైతు కమిటీలు ...9లో

మాట్లాడనియ్యలేదు

ఇదేం ప్రజాభిప్రాయ సేకరణ?

టీఆర్ఎస్‌వారే మాట్లాడారు

కాళేశ్వరం ప్రాజెక్టుపై భూనిర్వాసితులు

- వేములఘాట్ నిర్వాసితులను అడ్డుకున్న పోలీసులు
- పోలీస్‌స్టేషన్లకు 130 మంది తరలింపు
- పర్యావరణ అంశాలే మాట్లాడాలని మైకు బంద్ పెట్టిన వైనం
- సభను మధ్యంతరంగా ముగించిన సిద్దిపేట కలెక్టర్



బాధితులను, ప్రజా సంఘాల నేతలను స్టేషన్‌కు తరలింపు

నవతెలంగాణ - సిద్దిపేట టౌన్/రూరల్

'ముంపు గ్రామాలకు చెందిన నలుగురితోనే మాట్లాడిస్తారా? మొత్తం టీఆర్ఎస్ వాళ్లతోనే మాట్లాడిస్తరా? మాకు మాట్లాడే అవకాశం ఇవ్వరా..? రాత్రి పదిగంట లైనా అందరి అభిప్రాయాలనూ తీసుకుంటామని కలెక్టర్ చెబుతూనే...అర్థాంతరంగా కార్యక్రమాన్ని ముగించడమేంటీ? మా ఆవేదన వినరా? ఇదేం ప్రజాభిప్రాయ ...9లో

భారీ వర్షంతో పరేషాన్

లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం

కూకట్‌పల్లిలో ఇండ్లను కప్పేసిన నురగ

అపార్ట్‌మెంట్లు, ఇండ్లలోకి చేరిన నీరు

- వరద ధాటికి కొట్టుకుపోయిన ద్విచక్ర వాహనాలు
- హుస్సేన్‌సాగర్‌కు పోటెత్తిన వరద ప్రవాహం
- హైదరాబాద్‌లో 12.80 సెంటిమీటర్ల వర్షపాతం
- పలు జిల్లాల్లోనూ ఓ మోస్తారు వానలు..



రసాయన నురగను నీటితో తొలగిస్తున్న మహిళ

మరో మూడు రోజులు వర్షాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజుల పాటు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. శుక్రవారం రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడ్డాయని తెలిపింది. ఆదివారం రాష్ట్రంలో పలు చోట్ల భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని వివరించింది.

నవతెలంగాణ - సిటీబ్యూరో

ఏకధాటిగా కురిసిన వర్షం హైదరాబాద్‌ను ముంచెత్తింది. లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. ఇండ్లలోకి, అపార్ట్‌మెంట్ సెల్లార్లలోకి భారీగా వర్షపునీరు చేరింది. శుక్రవారం రాత్రి 8 గంటల నుంచి రెండు గంటల మధ్య 12.80 సెంటిమీటర్ల భారీ వర్షం కురిసింది. శనివారమూ పట్టణంలో పలుచోట్ల వర్షం పడింది. వెస్ట్‌జోన్‌లోని మాదాపూర్, బాలానగర్, మియాపూర్, కూకట్‌పల్లి, యూసుఫ్‌గూడ ప్రాంతాలతో కుండపోతగా వాన పడింది. యూసుఫ్‌గూడలో వరదదాటికి ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. మాదాపూర్‌లోని విఠల్‌రావ్‌నగర్‌లో ఉన్న ఓ అపార్ట్‌మెంట్ సెల్లార్లోకి భారీగా వరద నీరు చేరటంతో 30 కార్లు నీటిలో మునిగిపోయాయి. మియాపూర్‌లోని దీప్తిశ్రీనగర్‌లోని పలు అపార్ట్‌మెంట్ల వాసులు బయటకు రాలేని పరిస్థితి. జీహెచ్ఎంసీ రెస్క్యూ టీమ్ రంగంలోకి దిగి అపార్ట్‌మెంట్ల నుంచి నీటిని తోడే ప్రక్రియను ప్రారంభించింది.

భారీ వర్షానికి నగరంలోని పలు ప్రాంతాల్లో 65 చెట్లు కూలి రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. రోడ్లపై భారీగా వరద నీరు చేరడంతో ఎక్కడికక్కడే ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. మాదాపూర్‌లోని దీప్తిశ్రీనగర్, కళ్యాణినగర్, మదీనగూడ పూర్తిగా నీటమునగడంతో శనివారం మధ్యాహ్నం సమయంలోనూ వరద ప్రవాహం తగ్గలేదు. దీంతో అపార్ట్‌మెంట్ వాసులకు పాలు, ఆహారాన్ని ...9లో



పోలీసు కాంప్లెక్స్‌పై ఉగ్రదాడి

- ఇరువర్గాల మధ్య భీకర ఎదురుకాల్పులు
- నలుగురు జవాన్లు, నలుగురు పోలీసులు మృతి
- ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టిన బలగాలు



శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో పోలీసు లైన్స్‌పై ఉగ్రవాదులు దాడికి తెగబడ్డారు. ఈ క్రమంలో బలగాలకు, ఉగ్ర వాదులకు మధ్య హోరాహోరి ఎదురు కాల్పులు జరిగాయి. ఘటనలో నలుగురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు, నలుగురు పోలీసులు ప్రాణాలు కోల్పోగా మరో ఐదుగురు గాయపడ్డారు. ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. పుల్వామా డిస్ట్రిక్ట్ పోలీస్ లైన్స్(డీపీఎల్)లోకి శనివారం తెల్లవారుజామున 4.30 గంటలకు ...9లో

ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య

మానసికస్థితి సరిగాలేకనే..: సీపీ

నవతెలంగాణ-కరీంనగర్ టౌన్

కరీంనగర్ పోలీసు కమిషనరేట్‌లో ఏఆర్ కానిస్టేబుల్ తన తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం ఉదయం జరిగింది. మానసిక పరిస్థితి సరిగా లేకనే కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడని సీపీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బావుపేటకు చెందిన దూలం చంద్రయ్య(47) 1955బ్యాచ్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్. గతంలో హైదరాబాద్ విజిలెన్స్ విభాగంలో పని చేశాడు. నెల ఒకటిన హైదరాబాద్ ...9లో

సంపాదకీయం


నిజమైన జ్ఞానం

జీవితంలో, సమాజంలో పరివర్తన సహజం. ఒక దశ నుంచి మరో దశకు ప్రయాణించడం వాస్తవం. ఉన్న స్థితిలో ఉండిపోవడమన్నది జరగదు. ఇది చరిత్ర చెబుతున్న సత్యం. మానవ జీవన పరిణామక్రమం తెలియజెప్పిన రుజువర్తనం. దీనికి తగినట్టుగానే కాలక్రమాన మానవులు సౌకర్యవంతంగా జీవించడం అలవరుచుకున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లోని పురోగమన ఫలితాల్ని తమ జీవితాల్లోకి అనువర్తింపజేసుకుంటున్నారు. శరవేగంగా మారుతున్న సాంకేతిక ఫలాల్ని అంది పుచ్చుకుంటున్నారు. తీర్థయాత్రలకే పరిమితం కాలేదు, స్పేస్‌షిప్‌ల్లో అంతరిక్ష యాత్రలు చేస్తున్నారు. నిమిష నిమిషం విశ్వంలో నెలకొనే సరికొత్త పరిణామాల్ని క్షణాల్లో తెలుసుకుంటున్నారు.

> **నిత్యం అనేకానేక సమస్యలతో సతమతమయ్యే వారి సంఘటిత చైతన్యమే సకల పీడనల్నించి విముక్తికి సోపానం. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని భ్రమల్నించి బయటపడే మార్గం. ఈ ఎరుకనే నిజమైన జ్ఞానం. ఇదే మనిషి వర్తమానానికీ, భవిష్యత్తుకు సిసలైన బాసట.**

వైజ్ఞానిక రంగం అందించిన సమస్త సాధనాల్ని నిత్యజీవితంలో వాడుకుంటున్నారు. పొద్దున లేచినప్పట్నించి రాత్రి పడుకునే వరకు కంప్యూటర్, ఇంటర్నెట్, మొబైల్, సోషల్‌మీడియా వంటి సాధనాల్ని ఉపయోగిస్తున్నారు. విద్యుత్ ఉపకరణాలు వాడకుండా క్షణం గడవదు. వైద్యరంగంలోని వినూత్న ఆవిష్కరణలతో జీవితకాలాన్ని పెంచుకుంటున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లోని సరికొత్త ఆవిష్కరణల ఫలాలు మనుషుల జీవితాల్లో పెనుమార్పులు తీసుకొచ్చాయి. వాటన్నిటి వినియోగ దారులుగా మరింత మెరుగైన జీవితాన్ని అనుభవించడం సాధారణమైపోయింది.

ఈ క్రమాన తెలియని శక్తులేవో నడిపిస్తే నడిచిన కాలాన్ని దాటుకుని చాలా ముందుకు వచ్చాం. వైజ్ఞానిక రంగ ఫలితాల్ని మన జీవనశైలిలో అంతర్భాగం చేసుకున్నాం. కానీ ఆలోచనల్లో మాత్రం శతాబ్దాల వెనకనే వుండిపోవటం వైచిత్రి. విజ్ఞాన ఫలితాల్ని అనుభవిస్తూనే ఆ విజ్ఞానానికి మూలమైన కార్యకారణ సంబంధమనే సూత్రాన్ని అంగీకరించలేకపోవడం ఓ బలహీనత. ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు, బస్సులు, కార్లు, రైళ్ళు, విమానాలు, కంప్యూటర్లు, మొబైల్స్ ఉపయోగించుకోడం పట్ల ఎలాంటి అభ్యంతరం లేదు. ఇవన్నీ మానవుని జ్ఞానార్జన ఫలితమే తప్ప, విధి ఫలితం కాదని గుర్తించ నిరాకరించడం ఒక విరోధాభాస.



శాస్త్ర ప్రయోజనాల్ని పొందుతూనే శాస్త్రీయ వివేచననీ, దృష్టినీ సంతరింపజేసుకోలేకపోవడం విషాదం. ఇక్కడే మానవుని జీవన విధానానికీ, శాస్త్రీయ దృక్పథానికీ నడుమ వైరుధ్యం స్పష్టంగా కనిపిస్తుంది. సోషల్ మీడియాలో వినాయకుని విగ్రహాలు, స్తోత్రపాఠాలు చూస్తుంటే మానవ బుద్ధి వికాసం ఏమైందనే ప్రశ్న కలుగుతుంది. నేరం చేసిన ఓ బాబాని దోషిగా తేలిస్తే నగరాలకు నగరాలు పెను విధ్వంసంలో కొట్టుకుపోతుంటే మనిషికి 'జ్ఞానోదయం' అయ్యేదెప్పుడనే నిలువెత్తు ప్రశ్న తచ్చాడుతుంది. మానవ స్వభావంలోని ద్వంద్వాలు తేటతెల్లమవుతున్నాయి. ఇదేనా మనం సాధించిన జ్ఞానం? ఇదేనా మనిషి సాధించిన వైజ్ఞానిక పరిణితి?

"మానవుడి జ్ఞానం తన అభివృద్ధి క్రమంలో సరళరేఖలా ప్రయాణించదు. కాగా అది నిరంతరం ఒక వక్రరేఖను అనుసరిస్తుంటుంది" అని లెనిన్ ఓ సందర్భంలో హెచ్చరించారు. అందుకని దీనిని మార్చుకునే క్రమంలో మనం చైతన్యవంతంగా ఉండకపోతే ఊబిలో కూరుకుపోయే ప్రమాదముందని కూడా చెప్పారాయన. అదే మూఢత్వపు ఊబి. సంప్రదాయాలు, సంస్కృతులు, ఆచారాల పేరిట మతం మనుషుల్ని జ్ఞానపరిధిలోకి వెళ్ళనివ్వదు. శతాబ్దాలుగా వస్తున్న ఆచారాలే శిరోధార్యంగా చెబుతుంది. అందుకని ఎలాంటి ప్రశ్నలు వేయకుండా మతం కల్పించిన నమ్మకాల వ్యవస్థలో మనుషులు తప్పిపోతున్నారు. సైన్స్ అందించిన సర్వసౌఖ్యాలు అనుభవిస్తూనే 'శివుని ఆజ్ఞ లేనిదే చీమయినా కుట్టదు' అనే మూఢభావనలో కొట్టుకుపోతున్నారు. మరీ ముఖ్యంగా ఈ సంకుచితత్వంలో సామాన్యుల్ని సమిధల్ని చేస్తున్నారు. సంప్రదాయానికీ, సైన్స్‌కీ ముడిపెట్టి నోళ్ళు మూయించ జూస్తున్నారు. ప్రతి ఆచారానికీ శాస్త్రీయ ప్రాతిపదికలేవో చెప్పబోతున్నారు. కానీ ప్రశ్నల మీద ప్రశ్నలు సంధించినప్పుడు సమాధానం చెప్పలేక మౌనం వహిస్తున్నారు.

జ్ఞానానికీ, అజ్ఞానానికీ నడుమ అంతరాల్ని అర్థం చేసుకున్న వారు ఆచారాల పేరుతో చేసే దబాయింపుల్ని బలంగా ఎదుర్కొంటారు. విజ్ఞానశాస్త్ర ఫలితాల్ని అనుభవించడమే కాదు, ఆ జ్ఞానానికి బాసటగా నిలబడటం శాస్త్రీయతకు బలం. ఇదే నిజమైన జ్ఞానం. సైన్స్ చదవడమే కాదు, శాస్త్రీయ వివేచన పెంపొందేలా జీవితాన్ని మలుచుకోవాలి. సైన్స్ ఆవిష్కరణలతో ఎప్పటికప్పుడు సమాజం మారుతోంది. అదే రీతిన సైన్స్ అందించే దృక్పథంతో మానవమేధ వికసించాలి. ప్రశ్నించే తత్వానికి దన్ను పెరగాలి. ఈ క్రమమే సమాజంలో మూఢత్వపు చీకట్లు తొలగి జ్ఞానకాంతులు విస్తరించడానికి తోడ్పడుతుంది.

భౌతిక ప్రపంచంలోని సమస్త కార్యకలాపాలకు మానవుడే కర్త. ఏ ఒక్కరో ఎవరి జీవితాన్నీ మార్చలేరు, ఏ దివ్యశక్తులో ఎవరికీ కొత్త బతుకును ప్రసాదించలేవనే భావనని జనాల్లో ప్రోది చేయాలి. అప్పుడే కనిపించని దేవుళ్ళనించీ, కనికట్టు చేసే బాబాల్నించి ఈ దేశాన్ని, ప్రజల్ని కాపాడుకోగలం. నిత్యం అనేకానేక సమస్యలతో సతమతమయ్యే వారి సంఘటిత చైతన్యమే సకల పీడనల్నించి విముక్తికి సోపానం. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని భ్రమల్నించి బయటపడే మార్గం. ఈ ఎరుకనే నిజమైన జ్ఞానం. ఇదే మనిషి వర్తమానానికీ, భవిష్యత్తుకు సిసలైన బాసట.

ప్రత్యామ్నాయ విధానాలే ప్రాతిపదిక



ఎస్. వీరయ్య

రాష్ట్రంలో ఎన్నికల వేడి పుంజుకుంటున్నది. కేంద్ర, రాష్ట్ర పాలకుల అడుగులు అందరి ఆలోచనలను అటువైపే తిప్పుతున్నాయి. వరంగల్‌లో జరిగిన టీఆర్ఎస్ ఆవిర్భావ సభ నాటికే వారసత్వ సమస్యను కొలిక్కి తేవాలనుకున్న రాష్ట్ర అధినేత ప్రయత్నాలు ఫలించలేదు. పావులెన్ని కదిపినా అవి కదలలేదు. తర్వాత నేరెళ్ళ వంటి పరిణామాలు వెనువెంటనే అలాంటి ప్రయత్నాలకు అవకాశాలను కూడా మృగ్యం చేసాయి. అందువల్ల వారసత్వ సమస్యను ఎన్నికల తర్వాత వాయిదా వేసినట్టు కనిపిస్తున్నది. రాష్ట్ర శాసనసభ స్థానాల పెంపుదల మీద కూడా ఆశలు సన్నగిల్లడంతో 'ఆపరేషన్ ఆకర్ష్' వికటించే ప్రమాదం ముంచుకొస్తున్నది. వారసత్వ సమస్య సద్దుమణగడానికి అదికూడా ఒక కారణం కావచ్చు.

> **రాష్ట్ర పరిస్థితికి ఇది సంధికాలం. అధికార పార్టీ స్థానం నిలుపుకునే ప్రయత్నంలో కులాల కుంపటి రాజేస్తున్నది. అసంతృప్తిని సొమ్ము జేసుకుని మళ్ళీ అధికారంలోకి రావాలని కాంగ్రెసు ఆరాట పడుతున్నది. అడ్డదారిలోనైనా అడుగు పెట్టాలని బీజేపీ ఎత్తులు వేస్తున్నది. ప్రత్యామ్నాయం కోసం ప్రజలను సమీకరించే ప్రయత్నంలో వామపక్షాలూ, సామాజిక శక్తులూ ప్రయత్నిస్తున్నాయి. రాజుకుంటున్న ఎన్నికల వేడిలో ఎలాంటి మార్పులు వస్తాయన్నదే అందరినీ వేధిస్తున్న ప్రశ్న. పరిష్కరించవల్సింది ప్రజా ఉద్యమమే!**

పదవుల్లో ఉన్న మంత్రులూ, శాసనసభ్యులు కూడా సంతృప్తిగా ఏమీలేరు. ముఖ్యమంత్రి ఏకపక్ష వైఖరితో ఎవరికీ విలువలేకుండా పోయిందన్న ఆవేదన పెరుగుతున్నది. జనం ఆశలూ, అసంతృప్తుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. పరిణామాలను పసిగట్టిన అధినేత ఎన్నికలపైన ఈ ప్రభావాలను అధిగమించే ఎత్తుగడల మీద కేంద్రీకరించారు.

ఎన్నికలవైపే...

ఆరు మాసాలు ఆగితే బీజేపీ తన తడాఖా చూపిస్తుందంటున్న ఆ పార్టీ నేతలు స్పీడు పెంచారు. అమిత్ షా ఎత్తుగడల నిజస్వరూపం చూసేందుకు వేచి ఉండండంటున్నారు. కాంగ్రెసు సహజంగానే ఎన్నికల వేడికనుగుణంగా కదలిక పెంచింది. వీరి అంతర్గత కుమ్ములాటలమీద కేంద్రం నుండి బీజేపీ సంధిస్తున్న బాణాల ప్రభావం కొంత కనిపిస్తున్నది. ఒక గ్రూపు కేంద్రం మీదా, రాష్ట్రం మీదా బాణాలు సంధిస్తుండగా మరో గ్రూపు కేవలం రాష్ట్ర ప్రభుత్వం మీదనే విమర్శలు గుప్పిస్తున్నది. దీని ఆంతర్యం ఏమిటన్న చర్చ నడుస్తున్నది. మరోవైపు టీడీపీ నేతల స్పీడు తగ్గింది. కేంద్రం పాలన పట్ల, బీజేపీ నాయకత్వం పట్ల నిశ్శబ్దం పాటిస్తున్నారు. బీజేపీ నేతలు మాత్రం రాష్ట్రంలో వివిధ పార్టీల నేతలు తమ పార్టీలో దస్తీలు వేసి ఉంచారని బహిరంగంగానే చెబుతున్నారు.

కులాల కుంపటి

రెండు రోజుల క్రితం జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సందర్భంగా మిషన్ భగీరథ జీవన్మరణ సమస్యగా చెప్పటంతోనే ముఖ్యమంత్రి మనోగతాన్ని అంచనా వేయవచ్చు. అన్ని కులాలను బుజ్జగించే ప్రయత్నంలో ముఖ్యమంత్రి బిజీగా ఉన్నారు. అన్ని కులాల వారున్న కార్మికరంగంలో కనీస వేతనాలు పెంచే పనికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. అన్ని కులాలవారూ ఉన్న రైతుల పంటకు గిట్టుబాటు ధర గానీ, పరపతి సౌకర్యంగానీ, నిర్వాసితుల గోడుగానీ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ గానీ పట్టదు. అన్ని కులాలవారినీ మనుషులుగా చూడాలన్న సోయికూడా ఈ పాలకులకు లేదు. కుల దురహంకార హత్యల పరంపర సాగుతున్నప్పటికీ కనీస స్పందన లేదు. అన్ని కులాల వారికీ అవసరమైన ధర్నాచౌక్ గిట్టదు. ఇవన్నీ శ్రామికుల ప్రయోజనాలకూ, ప్రజాస్వామ్య హక్కులకూ సంబంధించిన విషయాలు. డబుల్ బెడ్రూం ఇండ్లు, దళితులకు మూడెకరాల భూమి కూడా ఊరించినంతగా అమలు లేదు. పారిశ్రామికవేత్తలు, పెత్తందారుల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తూ ఓట్ల వేటలో కులాల కుంపటి రాజేస్తున్నారు. వృత్తులకు ప్రోత్సాహం పేరుతో బీసీ కుల సంఘాలను చేరదీసిన పాలకులు ఇప్పుడు అగ్ర వర్ణాలను బుజ్జగిస్తున్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ఎరవేసిన నేతలు ఇప్పుడు రెడ్డి, కమ్మ కులాలను కాకా పట్టేందుకు ముమ్మర ప్రయత్నాలలో ఉన్నారు. రాజ్యాంగం నిర్దేశించిన శాస్త్రీయ విలువలకు భిన్నంగా మూఢ విశ్వాసాలను ప్రోత్సహిస్తున్న విషయం తెలిసిందే.

బీజేపీ ఎత్తుగడలు

శాసనసభ స్థానాల పెంపుదల ప్రయత్నాలను రాష్ట్ర బీజేపీ నేతలు అడ్డుకోవటంలో దాదాపు జయప్రదమైనట్టే. మోడీని కలిసిన అనంతరం ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. శాసనసభ స్థానాల సంఖ్య పెంచకపోవటం వల్ల, ఇతర పార్టీల నుండి టీఆర్ఎస్‌లో చేరిన నేతలు తమ భవిష్యత్తు గురించి సందిగ్ధంలో పడ్డారు. సర్వేల సందర్భంగా సుమారు 30-40 మంది టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఓడిపోయే అవకాశమున్నట్టు వార్తలు వెలువడ్డాయి. వారు కూడా ప్రత్యామ్నాయం చూసుకునే ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ వాతావరణం బీజేపీకి అనుకూలిస్తుందన్న అంచనాతో ఆపార్టీ నేతలు పావులు కదుపుతున్నారు. అధ్యక్షుడు అమిత్ షా అధికారపార్టీలోనే చిచ్చుపెట్టగల సమర్థుడు అన్న అమితమైన విశ్వాసంతో స్థానిక బీజేపీ నేతలు ఎదురు చూస్తున్నారు. మరోవైపు మతపరమైన విభజన ద్వారా హిందూ ఓటు బ్యాంకును సృష్టించుకునే ప్రయత్నాలను సంఘ పరివారం ముందుకు తెస్తున్నది. హైదరాబాద్‌లో జరిగిన భజరంగదళ్ సమావేశంలో తొగాడియా రెచ్చగొట్టే ప్రసంగం గమనించవల్సిన విషయం. హిందూ, ముస్లిం వివాదాన్ని తెరమీదకు తెచ్చే ప్రయత్నమే ఇది.

ప్రత్యామ్నాయం కోసం...

వామపక్షాలు, సామాజిక శక్తులు, మేధావుల ఆధ్వర్యంలోని టీమాస్ ఫోరం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందుంచింది. పోరాటవేదికగా ప్రజలకు చేరువయ్యే

సమాలోచన

ప్రయత్నం చేస్తున్నది. ఆర్థిక, సామాజిక సమస్యలను ఎజెండా మీదకు తెస్తున్నది. జిల్లా స్థాయి సదస్సులలో అనేక సంస్థలు ఉత్సాహంగా పాల్గొనటం విశేషం. గద్దర్, విమలక్క వంటి నేతలు కూడా భాగస్వాములు కావటం, మేధావులు ప్రత్యక్షంగా పాల్గొనటం ప్రత్యేకత. వర్గ సంఘాలు, సామాజిక సంస్థలు కలిసి నడవటం మరో



ప్రత్యేకత. అయితే... సదస్సుల దశ దాటి ఉద్యమబాట పట్టాలి. ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యంతో జరిగే పోరాటాలే కీలకం. ఇప్పుడు జరుగుతున్న ప్రయత్నాలన్నీ ప్రత్యక్ష ప్రజా ఉద్యమానికి దారితీస్తే రాజకీయ రంగం మీద కూడా ప్రభావం చూపగలవు.

ధర్నాచౌక్ పరిరక్షణ కోసం...

ధర్నాచౌక్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళన మరో ముఖ్యమైన అంశం. అది వామపక్షాలూ, కోదండరామ్ తదితర మేధావులు, సంస్థల ఆధ్వర్యంలో సాగుతున్న మేరకు మంచి ప్రభావమే చూపుతున్నది. కానీ రాష్ట్రంలో ఎన్నికల వేడి రాజుకుంటున్న నేపథ్యంలో, దీనిని కూడా తమ ఎన్నికల ప్రయోజనం కోసం వాడుకునేందుకు కాంగ్రెసు ప్రయత్నిస్తున్నట్టున్నది. ఢిల్లీలో జంతర్ మంతర్ ధర్నాలో కాంగ్రెసు కూడా మద్దతుపేరుతో చేరటం ద్వారా ధర్నాచౌక్ పరిరక్షణోద్యమం దిశమారే ప్రమాదం ఉన్నది. వామపక్షాలు, ఇతర మేధావులు అప్రమత్తంగా ఉండగలిగినప్పుడే లక్ష్యం నెరవేరుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. అధికారంలో ఉన్నప్పుడు నియంతృత్వ విధానాలకు పెట్టింది పేరు కాంగ్రెసు. ఇప్పుడు కాంగ్రెసు సరసన చేరి ప్రజాస్వామ్యం కోసం పోరాటం అంటే ప్రజల విశ్వాసం పొందజాలరు. మరోవైపు బీజేపీ కూడా ఎన్నికల దృష్టితోనే ఎత్తుగడలు వేస్తున్నది. ఇలాంటి సమయంలో పొలిటికల్ జేఏసీ నేత కోదండరామ్ కూడా కాంగ్రెసు, బీజేపీలను కలుపుకోడానికి కూడా అభ్యంతరం లేదంటున్నారు. కానీ కేంద్రంలో మోడీ నిరంకుశ పాలన, మతపరమైన విభజన ప్రయత్నాలు చూస్తూనే, టీఆర్ఎస్ పాలనకు వ్యతిరేకంగా బీజేపీతో చేతులు కలిపేందుకు ప్రాతిపదిక లేదు. కాంగ్రెసు, బీజేపీలతో ఏమాత్రం సన్నిహితంగా వ్యవహరించినా జనం అంగీకరించజాలరు. ప్రత్యామ్నాయ విధానాల కోసం సాగే పోరాటానికి తోడ్పడదు. కాంగ్రెసు పార్టీ అవకాశవాద ధోరణులకు పెట్టింది పేరు. ఒకవైపు బీజేపీ పాలిత రాష్ట్రాలలో వందేమాతర గీతాన్ని ముస్లింలకు వ్యతిరేకంగా ప్రయోగించేందుకు బీజేపీ ప్రభుత్వాలు ప్రయత్నించాయి. మన దగ్గర కొందరు కాంగ్రెసు నాయకులు ఈ సందర్భంగా లౌకిక విధానాలను సమర్థిస్తే హిందూ ఓటర్లకు దూరమవుతామన్న ధోరణి ప్రదర్శించారు. తలాఖ్ సమస్య మీద సుప్రీం తీర్పు సందర్భంగా మరికొందరు నాయకులు ముస్లిం ఓటర్లు దూరమవుతారన్న భయం ప్రదర్శించారు.

ప్రజా ఉద్యమమే...

తెలంగాణలో రాజకీయ వాతావరణం మూలమలుపులో ఉన్నది. ఏవైపు తిరుగుతుందో వేచిచూడాలి. సరైన దిశలో మార్పురావాలంటే వామపక్షాలూ, సామాజిక శక్తులు, ప్రజాతంత్ర వాదుల ఐక్యత కీలకపాత్ర పోషిస్తుంది. కాంగ్రెసుతో ఎన్నికల పొత్తుకు ప్రయత్నిస్తారేమోనన్న అనుమానాలు కొందరు మేధావులు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి అనుమానాలకు తావులేదని స్పష్టం చేయాలి. సీపీఐ(ఎం) నాయకత్వం ఈ విషయం స్పష్టంగానే ప్రకటించింది. మరికొన్ని వామపక్షాలు ఆర్థిక విషయాలలో ఐక్యపోరాటాలకు సిద్ధపడినప్పటికీ రాజకీయ ఐక్యత విషయంలో పరిమితులు విధించుకున్నాయి. పునరాలోచించవల్సిన సంధికాలమిది. నిర్దిష్ట పరిస్థితుల్లో నిర్దిష్ట నిర్ణయాలు తీసుకోవటంలో వెనుకబడితే పర్యవసానాలు నష్టదాయకంగా ఉంటాయి. ఏమైనా... ఇలాంటి అనేక విషయాలలో స్పష్టత రావాలన్నా.. చర్చోపచర్చలకన్నా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు తీవ్రతరం చేయటమే మార్గం. రాజకీయ రంగంలో వామపక్షాల ఐక్యపోరాటాలు పెరగాలి. టీమాస్ ఫోరం ఆధ్వర్యంలో గానీ, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గానీ ఐక్యపోరాటాల వేగం పెంచాలి. విస్తృత క్యాంపెయిన్ ద్వారా ప్రజలకు చేరువకావాలి. అప్పుడే ప్రజల నాడి అర్థమవుతుంది. అసంతృప్తి ఉద్యమరూపం తీసుకుం టుంది. ప్రజలతో మమేకం కావాలి. ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించాలి. ప్రజలు ఎలాంటి పోరాటాలకు సిద్ధపడితే అలాంటి పోరాటాలకు పిలుపునివ్వాలి. ■

అచ్ఛే దిన్ నై...



టి. స్కైలాబ్ బాబు

తిరోగమన శక్తులే నేడు అధికారంలో ఉన్నాయి. మూడేండ్ల మోడీ పాలనలో దళితులు, మైనార్టీలకు రక్షణలేదు. ఈ మూడేండ్ల కాలంలో దళిత మైనార్టీలపై దాడులూ దౌర్జన్యాలూ పెరిగాయి. మోడీ పాలన అంతా నాగ్‌పూర్ కేంద్రంగా ఆర్ఎస్ఎస్ స్పీచ్ వస్తేనే నరేంద్ర మోడీ అనే బుగ్గ వెలుగుతుంది. ఆర్ఎస్ఎస్ ఎజెండానే మోడీ ఎజెండాగా ఉంది. ఆర్ఎస్ఎస్ సమానత్వాన్ని లౌకికతత్వాన్ని, ప్రజా స్వామ్యాన్నీ అంగీకరించదు. మత ఉన్మాదం నెత్తికెక్కి దళిత, మైనార్టీలపై హింస ప్రయోగిస్తున్నారు. గోరక్షక దళాల ముసుగుల్లో ఆర్ఎస్ఎస్ రాజ్యాంగేతర శక్తి చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని దళితులు, మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని ఈ దాడులు చేస్తోంది. బీజేపీ పాలిత 19 రాష్ట్రాల్లో దళితులూ మైనార్టీలూ తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు.

ప్రజాస్వామ్య దేశంలో తినే తిండిపై ఏ ప్రభుత్వం ఇంతటి ఆంక్షలు పెట్టలేదు. ఆవులను రక్షించాలనే ఎజెండా ముందుకు తెచ్చి గోమాంసం సమస్యను ముందుకు తెచ్చి ఓటుబ్యాంకును సమీకరించుకోవాలని కుట్ర పన్నుతోంది. ఉత్తరఖాండ్ వంటి బీజేపీ పాలిత రాష్ట్రంలో ప్రభుత్వం గోరక్షక దళాలకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇస్తోంది. అధికారిక హత్యలకు ఉసిగొల్పుతోంది. దళితులను చంపొద్దు... నన్ను కాల్చండని...! ప్రసంగించిన మోడీ ఎందుకు ఈ గోగుండాలు చేసే హత్యలను నివారించడంలేదు. గోరక్షక దళాలు, ప్రధాని మోడీ ఇరువురు ఆర్ఎస్ఎస్ పుత్రులే. పశు వధ నిషేదచట్టంపై స్వంత పార్టీలోనే వ్యతిరేకత ఎదురైంది. మేఘాలయ రాష్ట్రంలో 500 మంది బీజేపీ క్రియాశీలక నేతలు ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఉత్తర ప్రదేశ్‌లో బీజేపీ పూర్తి మెజారిటీతో అధికారం చేపట్టిన తర్వాత దళితులు, ముస్లింలపై రోజుకు పదుల సంఖ్యలో హింస జరుగుతోంది. సహరాన్‌పూర్ జిల్లా శబ్దర్‌పూర్‌లో రాజ్‌పుట్‌లు, దళితులకు చెందిన 25 ఇండ్లను తగులబెట్టారు. కోతులతో, ఆవులతో నగ్నమునులతో సహజీవనం చేసే ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు మానవుల ప్రాణాల విలువ ఏమి తెలుస్తుంది. ఘోరక్‌పూర్‌లో 89మంది పసి పిల్లలు ఆక్సిజన్ అందక మరణించారు. గుజరాత్ రాష్ట్రంలో అగ్రకులస్తుల వ్యవసాయ బావుల్లో దళిత మహిళలు నీళ్ళు పట్టుకొని తాగారనే పేరుతో వారి వలువలూడదీసి నడిబొడ్డున చావబాదారు. బీహార్‌లో అగ్రకుల అమ్మాయిని ప్రేమించాడని నడిరోడ్డుపై ఓ దళిత యువకుడిని కిరాతకంగా హింసించి చంపారు. కర్నాటక రాష్ట్రం చికమగులూర్‌లో దళిత కుటుంబంపై అగ్రకులానికి చెందిన కొంతమంది దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. యూపీలో ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రికాగానే మాంసవిక్రయాలను నిషేదించారు. దీనితో 25లక్షల మంది ఉపాధి కోల్పోయారు. దళితులు, మైనార్టీలు, పేదలు పౌష్టికాహారానికి దూరమయ్యారు. హిందూ యువ వాహిని పేరిట నానా బీభత్సం

> **ఆర్ఎస్ఎస్‌లో పూర్తి కాలం కార్యకర్తగా పనిచేసిన మోడీ అజ్ఞానం, మూఢ విశ్వాసాలు, ఛాందస భావాలను సురక్షితంగా కాపాడినాడు. ఛాందసభావాలు తప్ప ప్రజాస్వామ్యం, లౌకికతత్వం సామ్యవాదం అంటే గిట్టదు. అందుకే తన ఎజెండాతో భారతదేశాన్ని ఒక ఉన్మాద దేశంగా మార్చాలని అనుకున్నాడు. ప్రజలు నిత్యం కుల, మత ఘర్షణలో ఉండగలిగితేనే మోడీ పాలన సజావుగా సాగుతుంది.**

సృష్టిస్తున్నారు. మాట్లాడే హక్కును తినే హక్కును కూడా కేంద్ర ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. జేఎన్‌యూలో కన్నయ్య కుమార్‌పై రాజద్రోహం కేసు నమోదు చేసింది. మానసిక వేధింపులతో రోహిత్ వేములను బలి తీసుకుంది. దేశవ్యాపిత నిరసనలతో కేంద్రమంత్రులను ఆ ఉచ్చు నుండి బయట పడేయడానికి బీజేపీ రూపన్‌వాలా కమిటీతో రోహిత్ వేముల వ్యక్తిగత కారణాల వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పించింది.

గుంటూరు జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండే మొదట్లో రోహిత్ దళితుడనే సర్టిఫికెట్ ఇచ్చి, ఆ తర్వాత ఆయనే రోహిత్ దళితుడు కాదని మళ్ళీ చెప్పడం అంటే ఒకేవ్యక్తి తల్లిగర్భంనుండి రెండుసార్లు జన్మిస్తాడని చెప్పినట్టుగా ఉంది. రంగారెడ్డి జిల్లాలో విద్యాసంస్థల్లోకి జ్ఞాన సరస్వతి విగ్రహాలను తెచ్చి మతోన్మాద భావాలు నూరిపోస్తోంది. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతినీ, శాస్త్రీయ విద్య స్థానంలో చాంధస విద్యను, దేశంలోని పౌరులుగా ఉన్న ముస్లింలను పాకిస్థాన్ ఏజెంట్లుగా, ఐఎస్ఐ ఉగ్రవాదులుగా బీఫ్ తినొద్దనే పేరిట బీఫ్ తినని మెజార్టీ ప్రజలను ఓటర్లుగా మార్చుకోవటం వంటి కుట్రలూ కుతంత్రాలూ కొనసాగిస్తోంది.

రెండు నెలల్లో రామమందిరం నిర్మించి తీరుతామని, ఇందుకు పార్లమెంట్‌లో చట్టం చేయాలని వీహెచ్‌పీ నేత ప్రవీణ్ తొగాడియా ప్రకటించారు. ఈ పేరుతో మరోసారి మతకొట్లాటలు సృష్టించి 2019లో మరోసారి గెలుపొందాలనే దుర్మార్గపు ఆలోచన తప్ప మరేమీలేదు. కాషాయ సంస్థలన్నీ ఏదోరకంగా దేశంలో అల్లర్లుసృష్టించాలని భావిస్తున్నాయి. దీనివల్ల దేశంలో అశాంతి నెలకొనే ప్రమాదం ముంచుకొస్తోంది. దళితులూ ఆదివాసీ నిరుద్యోగులను సమీకరించి వారికి నెలజీతం ఇస్తూ అల్లర్లకు ఉసిగొల్పుతున్నారు. ఆర్ఎస్ఎస్ నడిపిస్తున్న సంస్థ షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ పరిరక్షణ సమితి పేరుతో పాస్టర్లను దళిత వాడల్లోకి రానివ్వొద్దంటూ ప్రచారం సాగిస్తున్నారు. పాస్టర్లను చంపుతామంటూ బెదిరిస్తున్నారు. వనవాసి కళ్యాణ్ ఆశ్రమ్, ఏకలవ్య ఫౌండేషన్, ఆదివాసి మంచ్, గిరిజన మోర్చా పేరిట ఆదివాసీలను చీల్చే కుట్రలు చేస్తున్నారు.

మోడీ పాలనలో దళితులకు కొత్తగా ఒరిగిందేమీలేక పోగా రాజ్యాంగం కల్పించిన హక్కులు కాలరాయబడినాయి. దాడులూ దౌర్జన్యాలూ, హత్యలూ పెరిగాయి. అచ్ఛేదిన్ అని చెప్పి దళితులు సచ్చే దిన్‌గా మార్చారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని నిటి అయోగ్‌తో ముడిపెట్టి బడ్జెట్‌లో కోతలు పెట్టారు. ప్రతీ నాలుగు గంటలకు ఒక దళిత మహిళ లైంగిక దాడికి గురవుతున్నది. దళితులకు రక్షణ కల్పించాలంటే మనుస్మృతి పాలనకు చరమగీతం పాడాలి. ప్రజా స్వామ్యవాదులు, లౌకిక శక్తులు, గో గుండాలపై తిరుగుబాటు చేయాలి. ఆర్ఎస్ఎస్ అరాచకాలకు కళ్ళెం వేయాలి. మతసామరస్యాన్ని కాపాడాలి. ఇదీ నేటి యువత ముందున్న సవాల్.

సెల్: 9177549646

సెక్రెటేరియట్‌ల ఎల్కలు



తెలిదేవర భానుమూర్తి

నారదుడు కొప్పేసుకుండు. తంబూరు దీస్కుండు. ఒకపారి టింగ్ టింగ్ మన్నడు. చిర్తలు దీస్కుండు. ఒకపారి గవ్విటిని కొట్టి జూస్కుండు. గీపారి యాడికి బోవాలె. యాడికిబోతె బాగుంటదని జెరసేపు గాయిన సోంచాయించిండు. యాడికో ఎందుకు ఎప్పటిలెక్కనే యాద్గిరి గుట్టకు బోతె బాగుంటదని గాయిన అనుకున్నడు. అనుకోని చిర్తలు గొట్టుకుంట నారాయన, నారాయన అన్కుంట గాయిన మొగులు మీదికెల్లి ఎల్లిండు. నారదుడు యాద్గిరి గుట్ట దిక్కు రాబట్టిండు. నడ్మల గాయినకు నర్కం దిక్కు బోతున్న దున్నపోతు గల్సింది.

"యాడికి బోతున్నవు నారదా?" అని దున్నపోతు అడిగింది.

"యాద్గిరి గుట్టకు బోతున్న" అని నారదుడు జెప్పిండు.

"గుట్టకు ఎందుకు బోతున్నవు" అని దున్నపోతు అడిగింది.

"నర్సిమ్మసామితోని ముచ్చటబెట్టెతందుకు" అని నారదుడు అన్నడు.

"గాయినతోని ముచ్చటబెడ్తె ఏమొస్తది?" అని దున్నపోతు అడిగింది.

"నర్సిమ్మసామితోని ముచ్చటబెడ్తె తెలంగానలనే గాకుంట గీ దేసంల ఏమైతున్నదో ఎర్కైతది" అని నారదుడు అన్నడు.

"తెలంగానలనే గాకుంట గీ దేసంల ఏమైతున్నదో నేను జెప్తగద" అని దున్నపోతు అన్నది.

"దేసంల ఏమైతున్నదో నీకెట్ల ఎర్క?" అని నారదుడు అడిగిండు.


"రొండు నెలల సంది నేను గీ దేసంలనే దిర్గుతున్న" అని దున్నపోతు జెప్పింది.

"రొండు నెలల సంది నువ్వు గీ దేసంల ఎందుకున్నవు" అని నారదుడు అడిగిండు.

"మా దున్నపోతులు ఎలచ్చన్లు బెట్టినయి. ఎలచ్చన్ల గెల్సినోల్లు సర్కార్ ఏర్పాటుజేసింద్రు. గిదంత నేనే దగ్గరుండి జేపిచ్చిన" అని దున్నపోతు అన్నది.

"తెలంగానల ఏమైతున్నదో జెరజెప్పు" అని నారదుడు అన్నడు.

"పట్నంల ఉన్న సెక్రెటేరియట్ల ఎల్కలు జమయినయి. గాడ ఎల్కల రాజ్జెం నడ్వబట్టింది" అని దున్నపోతు అన్నది.



"వాస్తు బాగలేదని ముక్యమంత్రి సెక్రెటేరియట్‌కు వొస్తలేడు గదా" అని నారదుడు అన్నడు.

"ముక్యమంత్రికి సెక్రెటేరియట్ వాస్తు బాగలేదు. గని ఎల్కలకు బాగున్నది. ఇగ దాంతోని పిల్లజెల్లతోని గవి సుకంగ ఉన్నయి" అని దున్నపోతు అన్నది.

"ఎల్కలను ఎల్లగొట్టెతందుకు ఏం జెయ్యలేదా?" అని నారదుడు అడిగిండు.

"ఎల్కలను తినెతందుకు పిల్లులను బెంచుదామనుకున్నరు" అని దున్నపోతు అన్నది.

"పిల్లులను బెంచింద్రా?" అని నారదుడు అడిగిండు.

"కొందరు మంత్రులు పిల్లులను బెంచుదామన్నరు. ఇంకొంతమంది మంత్రులు పిల్లులను బెంచొద్దని అన్నరు" అని దున్నపోతు అన్నది.

"ఇంతకు పిల్లులను బెంచింద్రా లేదా." అని నారదుడు అడిగిండు.

"పిల్లులను బెంచాల్నా వొద్దా అనే దాని మీద ఒక కమిటి ఏసింద్రు. గా కమిటి మీటింగ్ల మీద మీటింగ్లు బెట్టి పిల్లులను బెంచాలని జెప్పింది" అని దున్నపోతు జెప్పింది.

"పిల్లులకు పాలు గావాలె గదా. పాలకోసం ఏం జేసింద్రు." అని నారదుడు అడిగిండు.

"పాలకోసం ఆవులను ఇద్దామనుకున్నరు" అని దున్నపోతు అన్నది.

"ఆవులను ఇచ్చింద్రా?" అని నారదుడు అడిగిండు.

"ఇచ్చింద్రు. ఒక్కొక్క పిల్లికి ఒక్కొక్క ఆవు లెక్కన ఇచ్చింద్రు." అని దున్నపోతు అన్నది.

"ఆవు పాలను పిల్లులకు బోసింద్రా?" అని నారదుడు అడిగిండు.

"ముందుగాల పిల్లులకు ఆవుపాలు బోయొద్దనుకున్నరు" అని దున్నపోతు ఇకేమొజెప్పబోతుంటె

"పిల్లులకు బోయకుంట ఏం జేద్దామనుకున్నరు?" అని నారదుడు అడిగిండు.

"పాలను అమ్ముకుందామనుకున్నరు. అమ్ముకుంటె మస్తు పైసలు వొస్తయిగదా" అని దున్నపోతు అన్నది.

"పిల్లులకు పాలు బొయ్యకుంట ఉంటె అందరికి ఎర్కైతది గదా" అని నారదుడు అడిగిండు.

"పిల్లులకు ఉడుకు పాలు బోద్దామనుకున్నరు" అని దున్నపోతు అన్నది.

"ఉడుకు పాలు బోస్తె పిల్లులు యాడికెల్లి దాగుతయి" అని నారదుడు అడిగిండు.

"పిల్లులు ఉడుకుపాలు దాగయి. ఒగాల్ల దాగితె గవ్విటి మూతి గాలుతది. అందరు జూసెతందుకు పాలు బోస్తరు. ఏమన్నంటె మేము పాలు బోస్తున్నం. గని పిల్లులే పాలు దాగుతలేవు అని జెప్తరు" అని దున్నపోతు అన్నది.

"నిజంగనే పిల్లులకు ఉడుకు పాలు బోసింద్రా?" అని నారదుడు అడిగిండు.

"పొయ్యలేదు" అని దున్నపోతు అన్నది.

"మల్లేం జేసింద్రు?" అని నారదుడు అడిగిండు.

"పిల్లులకు ఉడుకుపాలు బోద్దామనుకుంటుండంగ వినాయకచవ్తి వొచ్చింది" అని దున్నపోతు అన్నది.

"వినాయక చవ్తి వొస్తె ఏంది?" అని నారదుడు అడిగిండు.

"వినాయక చవ్తి వొచ్చెతల్కె గన్పతి, ఎల్క మీద బూలోకం వొచ్చిండు" అని దున్నపోతు అన్నది.

"గన్పతి బూలోకం వొస్తేంది?" అని నారదుడు అన్నడు.

"గన్పతితోని వొచ్చిన ఎల్క సెక్రెటేరియట్ బోయింది. గాదాన్కి ఎల్కల సంగతి ఎర్కైంది. పిల్లులకు ఉడ్కుపాలు బోసినా బొయ్యకున్నా గవ్వి ఎల్కలను తినొద్దని జెప్పింది. గాదాని మాట మీద పిల్లులు ఎల్కలను తినలేదు. గవ్విటికి ఎవ్వరు ఉడ్కుపాలు బొయ్యలేదు. ఇగ ఎల్కలు సెక్రెటేరియట్‌ల ఒక్క పైలు గూడ పెండింగ్ల లేకుంట జేసినయి. మల్ల గలుస్త" అన్కుంట దున్నపోతు నర్కం దిక్కు బోయింది. నారాయన, నారాయన అన్కుంట నారదుడు వైకుంటం బోయిండు.

తోక... పొద్దుమీకింది. ఎప్పటిలెక్కనే చౌరస్తల ఉన్న పాన్‌డబ్బ కాడ్కి బోయిన. గాడ పాన్లు దినుకుంట మా దోస్తులు ముచ్చటబెడ్తున్నరు.

"ఒకని ఇంట్ల ఉన్న కోడి గులాబిరంగు గుడ్లు బెట్టిందట" అని సత్నారి అన్నడు.

"గది కాంగ్రెస్ కెల్లి టిఆర్ఎస్లకు దుంకినోడి కోడి అయివుంటది" అని యాద్గిరి అన్నడు.

సెల్: 9959150491



అలౌకిక సీరియల్‌తో నట జీవితాన్ని ప్రారంభించిన ఆమె పదహారు సంవత్సరాలుగా తెలుగు టీవీరంగంలో రాణిస్తూ..దటీజ్ నవీన అంటూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. పన్నెండు నెలల కిందట ప్రారంభించిన యూట్యూబ్ చానల్ ద్వారా బుల్లి తెరపై తమ నటనతో ఆకట్టుకునే ఎంతో మంది కళాకారుల జీవితాలను ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు తన నటనలో నూతనత్వం సంతరించుకుంటూ పేరును సార్థకం చేసుకుంటున్నారు. బుల్లితెరపై భారీ స్థాయిలో నిర్మిస్తున్న స్వర్ణఖడ్గం సీరియల్ లో బిజీగా ఉన్నారు. నటిగా, యాంకర్‌గా, నిర్మాతగా బహుముఖాభినయం చేస్తున్న ఆమె మానవి తో పంచుకున్న ముచ్చట్లు....



ప్రేక్షకులను బట్టే ప్రోగ్రామ్స్

డాక్టర్ కాబోయి యాక్టర్ అయ్యారు అన్న మాట ఎక్కువగా వినిపిస్తుంది. నిజంగా నా జీవితంలో కూడా అంతే. నేను డాక్టర్‌ను కావాలనుకున్నాను. అనుకోకుండా నటనారంగం వైపు వచ్చాను. నేను పుట్టింది పెరిగింది హైదరాబాద్‌లోనే. నారాయణగూడ లోని శాంతినికేతన్ స్కూలులో పదవతరగతి వరకు చదివాను. ఇంటర్ రత్న జూనియర్ కాలేజీలో పూర్తి చేశాను.

ఫొటోలు పంపాం ..

మా ఇంటి పక్కన ఉండే బాలు అంకుల్ సినిమాలో పనిచేసేవారు. సినిమాల్లో ట్రై చేయవచ్చు కదా అన్నారు. సరే చూద్దామని నా ఫొటోలను మీడియా హౌజ్‌లకు పంపించాం. పదవతరగతి సెలవుల్లో కొన్ని ఆడిషన్స్‌కు కూడా వెళ్లాను.

అక్కడ ఏదైనా యాక్ట్ చేయమని చెప్పేవారు. ఎలాంటి ట్రైనింగ్ తీసుకోలేదు కాబట్టి నాకు నటన వచ్చేది కాదు. ఇంటర్‌లో జాయిన్ అయ్యాను. నా ఫొటోలు ఒక మీడియా హౌజ్ నుంచి మరో మీడియా హౌజ్‌కు చేరాయి. ఈ టీవి నిర్మిస్తున్న అలౌకిక సీరియల్‌లో టైటిల్ రోల్‌లో నటించే అవకాశం వచ్చింది. అలౌకికతో నా ప్రపంచం మారిపోయింది. డాక్టర్ కావాలనుకున్న నేను యాక్టర్‌గా మారిపోయాను. అమ్మ రమాదేవి ఎక్కువగా నన్ను ప్రోత్సహించారు. అలౌకికా, అగ్నిగుండం, చంద్రముఖి, మల్లీశ్వరి, త్రిశూలం, కలవరి కోడలు వంటి సీరియల్స్‌లో నటించాను.

యాంకర్‌గా..

టీవీ సీరియల్స్‌లో నటిస్తున్న సమయంలోనే జీ టీవీలో క్రియేటివ్ డైరెక్టర్ నుంచి కాల్ వచ్చింది. ప్రముఖ నటి రాశి గారు చేసే తారలు దిగి వచ్చిన వేళకు యాంకర్‌గా చేసే అవకాశం వచ్చింది. దాదాపు మూడు సంవత్సరాల పాటు గేమ్ షోలు , లైవ్ షోలలో యాంకరింగ్ చేశాను. ఆ తర్వాత మా టీవీలోనూ రెండు సంవత్సరాలు యాంకరింగ్ చేశాను. నేను యాంకరింగ్ చేసిన 'తారలు దిగివచ్చిన వేళ ' కార్యక్రమం లో తెలుగు, తమిళ చిత్రపరిశ్రమకు చెందిన వందలాది మంది నటీనటులను ఇంటర్వ్యూ చేసే అవకాశం లభించింది. స్టార్ మహిళ, ఆధునిక మహాలక్ష్మి మొదలైన షోలు మంచి గుర్తింపు తీసుకువచ్చాయి.

డైరెక్టర్.. లైఫ్ పార్టనర్..

నా నటన చూసి ప్రముఖ దర్శకులు రాఘవేంద్రరావుగారు తాను డైరెక్ట్ చేసిన మినీమువీలో అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత జీ టీవి రూపొందించిన మెగా సీరియల్ త్రిశూలం లో నటించే అవకాశం వచ్చింది. ఈ సీరియల్‌కు డైరెక్టర్ రాఘవేంద్రరావు గారి శిష్యుడు సత్యనారాయణగారు. ఈ సీరియల్ ప్రారంభమైన కొద్ది రోజుల తర్వాత డైరెక్టర్ సత్యనారాయణ స్నేహం పెరిగింది.. ప్రేమగా మారింది. సీరియల్ క్లైమాక్స్‌కు రాకముందే మా ప్రేమ పెళ్లిగా మారింది. మా పెళ్లి అయిన సంవత్సరం తర్వాత ఆ సీరియల్ ముగిసింది.

రాఘవేంద్రరావుగారే పెళ్లి పెద్దగా..

ముందుగా మా ప్రేమ విషయం రాఘవేంద్రరావుగారితో చెప్పాం. అయితే మా ప్రేమను ఇంట్లో వారు ఒప్పుకోలేదు. అప్పుడు రాఘవేంద్రరావుగారే మా ఇంటికి వచ్చి.. మా ఇంట్లో వారిని ఒప్పించారు. తానే దగ్గరుండి మా పెళ్లి చేశారు. ఇప్పుడు మాకు ఇద్దరు అబ్బాయిలు. ఫ్యామిలీ అంతా హ్యాపీగా ఉన్నాం.

నెగటివ్ క్యారెక్టర్స్..

యాక్టింగ్ అనగానే చాలా మంది తమ క్యారెక్టరైజేషన్ గురించి ఆలోచిస్తారు. పాజిటివ్‌గా ఉండాలను కుంటారు. కానీ నేను అలా అనుకోను. ప్రేక్షకులు చాలా మెచ్యూర్డ్ అయ్యారు. నేను చాలా నెగటివ్ క్యారెక్టర్స్ చేశాను. కథ డిమాండ్ చేసినట్టే క్యారెక్టరైజేషన్ ఉంటుంది. నెగిటీవ్ రోల్స్ చేసినా.. ప్రేక్షకులు బాగా చేశారు అంటున్నారు తప్ప ఎందుకు అలాంటి రోల్స్ చేశారు అనడం లేదు.

తెలుగువారు ఎక్కువగా రావడం లేదు..

సీరియల్స్‌లోనూ ఇతర భాష నటులే కనిపిస్తున్నారు.. తెలుగు వారు లేరా అన్న విమర్శలు వినిపిస్తుంటాయి. అయితే తెలుగువారు సినిమారంగాన్ని ఒక కళగా చూడటం లేదు. ఆడపిల్లలను పంపించడానికి భయ పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర భాషల వారు వస్తున్నారు. తెలుగు అమ్మాయిలు వస్తున్నారు. షాట్ టైమ్‌లో ఉండి వెళ్లిపోతున్నారు. ఎంతో మందికి ఉపాధిని, గుర్తింపును అందిస్తున్న నటనారంగాన్ని కూడా సాఫ్ట్‌వేర్ రంగంగా భావించి రావాలి.

యుట్యూబ్ చానల్‌లో సినిమాకు ఇచ్చినంత ప్రయారిటీ టీవికి ఇవ్వడం లేదు. అందుకే టీవీ సీరియల్స్‌లో నటించే నటులను, వారి జీవితాలను ప్రేక్షకులకు చెప్పాలనుకున్నాం. ఎక్కువ మందికి అందుబాటులో ఉన్న యూట్యూబ్ వేదికగా చానల్ ఏర్పాటుచేశాం. వచ్చేనెలతో మా చానల్ ప్రారంభించి సంవత్సరం అవుతుంది. పాత నటీనటుల ఇంటర్వ్యూలకు మంచి స్పందన వస్తున్నది. నటనను నమ్ముకుని ఫీల్డ్‌లోకి వచ్చిన వారు బిగ్ స్క్రీన్‌లో పని చేసినా.. టీవీలలో పనిచేసినా వారి ప్రతిభను గుర్తించినపుడే నటనకు ఆదరణ లభిస్తుంది. ఇదే ఆలోచన ఈ చిరు ప్రయత్నానికి నాంది అయ్యింది. యాంకర్‌గా పనిచేసిన అనుభవం ఈ చానల్ నిర్వహణకు బాగా ఉపయోగపడింది అనుకుంటాను. పాజిటివ్ కన్నా నెగటీవ్‌కే ..



అమ్మ సహకారంతోనే..

యాంకర్‌గా, నటిగా రాణిస్తున్నాను అంటే అందుకు కారణం మా అమ్మ. ఆమె నాకే కాదు మా పిల్లలకు కూడా అమ్మగా మారారు. వారి చదువు, ఆటలతో సహా అంతా బాధ్యత ఆమే తీసుకుంటున్నారు. అందుకే నేను ఇంటి గురించి మర్చిపోయి పనిచేయగలుగుతున్నాను.



పాజిటివ్‌గా ఉండే కార్యక్రమాలకు ఎక్కువగా రేటింగ్ రావడం లేదు. పాడుతా తీయగా లాంటి కార్యక్రమాలకు రేటింగ్ మూడు, నాలుగు ఉంటే జబర్ధస్‌లాంటి ప్రోగ్రామ్‌కు రేటింగ్ ఎక్కువ. టీవీ పరిశ్రమ మనుగడ సాగించడానికి ఇలాంటి కార్యక్రమాలు తీస్తున్నారు తప్ప.. ఇలాంటి కార్యక్రమాలు తీయాలన్న ఉద్దేశ్యం ప్రొడక్షన్‌వారికి ఉండదు. ప్రేక్షకులను బట్టే ప్రోగ్రామ్స్ ఉంటాయి.

90శాతం కొత్తవారితో..

టీవీరంగంలో భారీ బడ్జెట్‌లో వస్తున్న స్వర్ణఖడ్గం సీరియల్‌లో నటిస్తున్నాను. మా ఆయన ఈ సీరియల్‌కు కథ, స్క్రీన్ ప్లే, డైరక్షన్. ఈ సీరియల్‌లో 90శాతం కొత్తవారే. ఇతర ఏ భాషలోనూ ఇంత భారీ బడ్జెట్‌తో సీరియల్ రాలేదు. తెలుగు సినీమాలో బహుబలి మాదిరిగా టీవీ సీరియల్స్‌లో స్వర్ణఖడ్గం భారీ బడ్జెట్‌లో వస్తున్న సీరియల్.

వి. యశోద

మహిళల హక్కులు పరిరక్షించేలా..



రమ్యకుమారి,
హైకోర్టు అడ్వకేట్

భారతదేశ అత్యున్నత న్యాయస్థానం తలాక్ విధానంపై ఇచ్చిన తీర్పు ముస్లీం మహిళల హక్కులను కాపాడేలా ఉంది. నిజానికి ముస్లీం వివాహచట్టం ప్రకారం నిఖా అనేది ఒక లీగల్ కాంట్రాక్ట్. కాంట్రాక్ట్‌కు వర్తించే నియమనిబంధనలు అన్నీ వర్తిస్తాయి. మగవారు మెహర్ చెల్లించి నిఖా చేసుకుంటారు. ప్రస్తుతం ముస్లీంలు రెండు విధానాల ద్వారా విడాకులు తీసుకుంటున్నారు. ఒకటి ఎక్స్‌ట్రా జ్యూడిషియల్ విధానం. రెండు జ్యూడిషియల్ విధానం.

ఎక్స్‌ట్రా జ్యూడిషియల్ విధానం ద్వారా వివాహబంధాన్ని మూడు పద్ధతుల ద్వారా రద్దు చేసుకోవచ్చు.

1. తలాక్.. భర్త తలాక్ పద్ధతిలో విడాకులు కోరవచ్చు. అయితే ముందుగా ఖాజీకి విడాకులు కావలన్న విషయం చెప్పాలి. ఆ తర్వాత కుటుంబపెద్దలకు తాను ఎందుకు విడాకులు కోరుతున్నాడో తెలియజేయాలి. అతడు చెప్పే కారణం సహేతుకంగా అనిపించాలి. భార్య, బిడ్డల జీవనానికి కావల్సిన ... ఇవ్వాలి. ఇదంతా ఒకేసారి జరగదు. కొన్ని దఫాలుగా జరుగుతుంది. మూడు పర్యాయాలు తలాక్ చెప్పాలి.

2. ఖులానామా. భార్యభర్తలు తమ ఇద్దరి అంగీకారంతో విడాకులు తీసుకోవడం.

3. తలాక్-ఐ-తఖ్‌వాత్ ముస్లీం మహిళలు విడాకులు ఇచ్చే పద్ధతి.

వీటిలో తలాక్ పద్ధతి అనేక విమర్శలకు కారణం అయ్యింది.

ముస్లీం పెద్దలు తమది 1400సంవత్సరాల నుంచి వస్తున్న సంప్రదాయమని చెబుతున్నారు. ఆల్ ఇండియా ముస్లీం పర్సనల్ లా బోర్డు ఇది మా పద్ధతి అంటున్నారు. కొన్ని సంవత్సరాల కిందట తలాక్ ఇవ్వడం అంటే అవమానంగా ఫీల్ అయ్యేవారు. తలాక్ ఇచ్చేవారిని సమాజం చిన్నచూపు చూసేది. అయితే ప్రస్తుతం ముస్లీం పర్సనల్ లా ను గౌరవించకుండా మగవారు తమ ఇష్టం వచ్చినట్టు తలాక్ చెప్పి తమ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నారు. పొరుగున ఉన్న ముస్లీం దేశాలలో ముస్లీం ఫ్యామిలీ లా లో అనేక మార్పులు చేశారు. పాకిస్తాన్‌లో 1961లో ముస్లీం ఫ్యామిలీ లా ప్రకారం ఒక కౌన్సిల్‌ను ఏర్పాటుచేశారు. విడాకులు కోరేవారు ఈ కౌన్సిల్‌కు దరఖాస్తు చేసుకోవాలి. 30రోజుల్లో దానిపై సమాధానం వస్తుంది. విడాకులు కోరేవారికి కొన్ని దఫాలు కౌన్సిలింగ్ ఇస్తారు. వారు చెప్పే కారణం సరైనది ఉంటేనే.. కొన్ని షరతులు విధించి విడాకులు మంజూరు చేస్తారు. పాకిస్తాన్‌తో పాటు మొరాకో, ఇండోనేషియా, ఇరాన్ వంటి దేశాల్లో 2004లో తమ చట్టాలలో మార్పులు తీసుకువచ్చి మహిళల హక్కులను కాపాడుతున్నారు.

మిగతా దేశాల్లో వచ్చిన మార్పులకు అనుగుణంగా మనదేశంలోని ముస్లీం మహిళల హక్కులను కాపాడేందుకు కొత్త చట్టం తీసుకురావల్సిన అవసరం ఉంది.

బరువు తగ్గించే డిటాక్సీ లు...



డిటాక్సీ లు శరీరాన్ని శుభ్రపరచటమే కాకుండా, బరువును కూడా తగ్గిస్తాయి. ఆహారం విషయంలో నియమాలు పాటించటం సులభమే కానీ, ఎలా ఉండాలి, ఏం తినాలో తెలుసుకుందాం !

పండ్లు : తగిన మోతాదులో పండ్లు తినాలి. శరీరాన్ని శుభ్రపరచటంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. శరీర బరువు తగ్గించుకోటానికి తగినంత మోతాదులో పండ్లను ఖాళీ కడుపుతో తింటే సరిపోతుంది.

సలాడ్స్: భోజన సమయంలో సలాడ్స్ తీసుకోవాలి. ఇవి అధిక మొత్తంలో ఎంజైమ్ లను కలిగి ఉంటాయి. ఆహారం జీర్ణం అవటానికి సహాయపడతాయి. అంతే కాకుండా, ఇవి విటమిన్, మినరల్, క్లోరోఫిల్, ఫైటో రసాయనాలను కలిగి ఉంటాయి.

హైడ్రేట్: బరువు తగ్గించడంలో నీటి పాత్ర కూడా కీలకం. ప్రతిరోజు వ్యాయామం చేసే సమయంలో శరీరం అధికంగా నీటిని కోల్పోతుంది. కాబట్టి నీటిని ఎక్కువగా తాగాలి.

కిచెన్ గార్డెన్ కోసం...

మీకు మొక్కలంటే ఇష్టముంటే.. ఆర్గానిక్ గార్డెనింగ్ మీద నమ్మకం ఉంటే ఇది మీకు బాగా ఉపయోగపడుతుంది. సొంత కిచెన్ గార్డెన్ చేయడానికి ప్రణాళికలను తయారు చేయాలి. చిన్న స్థలంలో కూడా ఒక కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయవచ్చు. ఇష్టమైన కూరగాయలను పెంచుకోవచ్చు. మీ కిచెన్ గార్డెన్ అలంకరణ కొరకు కొన్ని చిట్కాలు ఉన్నాయి.

చిన్న ప్రణాళిక అవసరం:

మొక్కను ఎక్కడ నాటాలో ముందస్తు ప్లాన్ అవసరం. మీరు కూడా మీ కిచెన్ గార్డెన్ కోసం కొంత సమయంను కేటాయించాలి. మీకు స్థలం కొద్దిగ మాత్రమే ఉంటే అప్పుడు కంటైనర్ గార్డెన్స్ ఉత్తమ ఎంపిక. ఇది ఆర్గానిక్ గార్డెనింగ్ చిట్కాలలో ఒకటి.

చిన్నది అందంగా ఉంటుంది:

మీకు గార్డెనింగ్ చేయటం కొత్త అయితే ముందు కొద్ది మొక్కలతో ప్రారంభించవచ్చు. చిన్న గార్డెన్ అందంగా ఉంటుంది. మొక్కలు పెంచాలనే ఆలోచన వచ్చినప్పుడు సరైన మొక్కలను సేకరించుకోవాలి. మొక్కల ఎంపిక సరిగా లేకపోతే ప్రయోజనం ఉండదు.



ఉత్పాదక మొక్కలు:

మీరు మీ కిచెన్ గార్డెన్ కోసం మొక్కలను ఎంచుకున్నప్పుడు ఉత్పాదక మొక్కలను ఎంచుకోవాలి. మొక్కలును ఎంచుకొనేటప్పుడు కాలానుగుణ మొక్కలు ఎంచుకోవటం అనేది కిచెన్ గార్డెన్ చిట్కాలలో ఒకటి. మీ తోటకు సరిపోయే మొక్కలను నాటాలి.

ఇతరులతో చర్చ:

మీ స్నేహితులకు ఒక కిచెన్ గార్డెన్ ఏర్పాటులో అనుభవం ఉంటే వారితో మాట్లాడి అవసరమైన కిచెన్ గార్డెన్ చిట్కాలను తెలుసుకోండి. అలాగే దీనికి సంబంధించిన పుస్తకాలు ఇప్పుడు అన్ని పుస్తకాల షాపుల్లో అందుబాటులో ఉంటున్నాయి. వాటిని చదవండి. మీ అందమైన కిచెన్ గార్డెన్ ఏర్పాటులో ఇవి మీకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఇట్లచేద్దాం

మొటిమలతో బాధ పడుతున్న వారు రోజుకు ఆరేడు సార్లు ముఖం చల్లని నీటితో కడగాలి. అలాగే జాజికాయ, గంధం, మిరియాలు మెత్తగా నూరి మొటిమలకు రాసినా, పెరుగు సెనగపిండి వెనిగర్ కలిపి రాసిన మొటిమలు తగ్గిపోతాయి.

దాడులను తిప్పికొట్టాలి...!

సెల్ఫ్ డిఫెన్స్

మగవారి ఇష్టప్రకారమే మహిళలు నడుచుకోవాలన్న పురుషాధిక్యత మన సమాజంలో కనిపిస్తున్నది. ప్రేమిస్తున్నాను అనగానే సంతోషంగా తల ఊపాలి అని ఆశిస్తారు. నాకిష్టం లేదు అని తల అడ్డంగా ఊపితే..వారి ఆశ నిరాశగా మారి అఘాయిత్యాలకు పాల్పడేవారిని చూస్తున్నాం. తన ఇష్టాలను, అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పే హక్కు మహిళలకు ఉంది. దాడులకు భయపడి ఇష్టాలను మార్చుకోవద్దు. దాడులకు పాల్పడేవారికి తగిన బుద్ధి చెప్పి తమ హక్కులను పరిరక్షించుకోవాలి. మరి హక్కులను కాపాడుకోవాలంటే దాడులను తిప్పికొట్టే టెక్నిక్స్ నేర్చుకోవాలి. కత్తితో దాడి చేసే వ్యక్తిని ఎలా ఎదుర్కోవాలో ఇంతకు ముందు చూశాం. మరో విధమైన టెక్నిక్‌ను ఈ వారం తెలుసుకుందాం.



1

ప్రేమించలేదనో.. తన మాట వినలేదనో మహిళలపై దాడులు చేస్తూ.. హత్యాయత్నం చేసే సంఘటనలు వార్తల్లో చదువుతున్నాం. మహిళపై కత్తిలో దాడి చేయడానికి వచ్చాడు ఒక వ్యక్తి.



2

ఎదురుగా కత్తితో కనిపించిన వ్యక్తిని చూడగానే ముందుగా గట్టిగా అరిచేప్రయత్నం చేస్తూ.. గజగజ వణికిపోతారు. కానీ, సెల్ఫ్‌డిఫెన్స్ టెక్నిక్స్ తెలిసిన వారు ఎలాంటి దాడులనైనా చాకచక్యంతో తిప్పికొట్టగలుగుతారు. తన గొంతులో కత్తి దింపడానికి ప్రయత్నించిన వ్యక్తిని చూసి వెంటనే తనను తాను రక్షించుకునే ప్రయత్నం చేయాలి. రెండు చేతులతో ఆ వ్యక్తిని ఎక్స్ లాక్ చేయాలి.

కత్తి శరీరానికి తగలకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే.. రెండుచేతులతో కత్తి పట్టుకున్న వ్యక్తి చేతిని గట్టిగా పట్టుకోవాలి. ఆ వ్యక్తి తప్పించుకునే అవకాశం ఇవ్వకుండా గట్టిగా పట్టుకోవాలి. కత్తి పట్టుకున్న చేతిని అలాగే వెనకను వడి తిప్పుతూ..వంచాలి. బాధతో ఆ వ్యక్తి అల్లాడిపోతాడు. తన చేయిని విడిపించుకునే ప్రయత్నం చేస్తూ.. కిందికి వంగుతాడు.



3

బాధతో గిజగిజలాడుతున్న ఆ వ్యక్తి చేతిని వదల కుండా అలాగే వీపు వైపు వంచుతూ.. నడివీపులో పిడికిలితో పంచ్ ఇవ్వాలి. అంతే! చేతిలోని కత్తిని వదిలేసి కిందపడిపోతాడు.



4

పిప్పళ్ల వెంకటేశ్

మహిళలను ప్రేమించడానికి ముందు వారిని గౌరవించడం, అభిప్రాయాలకు విలువనివ్వడం నేర్చుకోవాలి. బెదిరింపులతో, దాడులతో భయభ్రాంతులను చేయడం మానుకునేలా అకాతాయిల దాడులను తిప్పికొట్టాలి.



ఎన్. లక్ష్మీ రవి,
ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్,
రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్,
గాంధీనగర్, హైదరాబాద్.
9490239170, 9949039049

అంతర్జాతీయం

మయన్మార్‌లో మారణకాండ

- బంగ్లా సరిహద్దులో తీవ్రవాదుల దాడి
- 70 మంది మృతి.. వందల మందికి గాయాలు

నెపిటా: మయన్మార్‌లో మరోసారి రక్తపుటేరులు పారాయి. బంగ్లాదేశ్ సరిహద్దులోని రాఖిని రాష్ట్రంలో శుక్రవారం తెల్లవారుజామున తీవ్రవాదులు జరిపిన భీకర దాడుల్లో సుమారు 70 మంది ప్రాణాలు కోల్పోగా, వందలమంది గాయపడ్డారు. అప్రమత్తమైన ప్రభుత్వం రాష్ట్రమంతటా ఎమర్జెన్సీని ప్రకటించింది. క్షతగాత్రులకు సమీపంలోని ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. కాగా, దాడికి పాల్పడింది 'ఆర్కాన్ రోహింగ్యా సాల్వేషన్ ఆర్మీ' (ఏఆర్ఎస్ఏ) గ్రూపుకు చెందిన తీవ్రవాదులేనని మయన్మార్ ఆర్మీ అధికారులు తెలిపారు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట సమయంలో బంగ్లా సరిహద్దులోని మంగ్‌టావ్ పోలీస్ స్టేషన్‌ను తీవ్రవాదులు పేల్చేశారని, అదే సమయంలో రాఖినిలో కొన్ని పోలీస్ స్టేషన్లు, ఆర్మీ క్యాంపులపైనా దాడులు జరిగాయని, మొత్తం 200 మంది తీవ్రవాదులు ఈ దాడుల్లో పాల్గొని ఉండొచ్చని భావిస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఇరువైపులా ప్రాణనష్టం జరిగిందని, కొందరు సాధారణ పౌరులు కూడా చనిపోయారని ఆర్మీ వర్గాలు చెప్పాయి. బంగ్లాదేశ్ సరిహద్దును ఆనుకుని ఉండే రాఖిని రాష్ట్రంలోకి రోహింగ్యా ముస్లింల వలసలు ఎక్కువ. దీంతో స్థానిక ప్రజలకు, వలసదారులకు మధ్య ఘర్షణలు జరిగేవి. ఒక దశలో రంగంలోకి దిగిన సైన్యం.. రోహింగ్యాలను తిరిగి బంగ్లాదేశ్‌లోకి వెళ్లగొట్టేయత్నం చేసింది. ఈ క్రమంలోనే ప్రారంభమైన హింసాయుత పోరాటం.. దశాబ్ధాలుగా కొనసాగుతున్నది.

బ్రస్సెల్స్‌లో కత్తిదాడి

బ్రస్సెల్స్ : బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో గుర్తుతెలియని దుండగుడు ఒకడు కత్తితో భద్రతా బలగా లపైకి దాడికి దిగాడు. నగరం నడిబొడ్డగా భావించే బోల్‌వార్డ్ ఎమిలీ జాక్వమైన్ అనే ప్రాంతంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. దాడి చేసిన వ్యక్తిని భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. అతడిపైకి కాల్పులు జరిపాయి. తీవ్రంగా గాయపడిన దుండగుడు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. ఒక సైనికుడు స్వల్పంగా గాయపడ్డాడు. దుండగుడు సొమాలియా జాతీయుడని వార్తలు వెలువడ్డాయి. గత ఏడాది ఇదే ప్రాంతంలో ఉగ్రదాడి జరిగి, 30 మంది చనిపోయారు. ప్రాథమిక సమాచారం మేరకు దీనిని ఉగ్రదాడిగానే భావిస్తున్నామని ప్రభు త్వ ఉన్నతాధికారులు ప్రకటించారు.

అమెరికా కుట్రల్ని అడ్డుకుంటాం

వెనిజులాపై ఆంక్షల్ని ఖండించిన మదురో

కారకాస్/వాషింగ్టన్ : వెనిజులాపై ఆర్థిక, వాణిజ్య ఆంక్షలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ఆదేశాలు జారీ చేయడాన్ని ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో ఖండించారు. ఇప్పుడిప్పుడే ఆర్థిక సంక్షోభం నుంచి తేరుకుంటున్న వెనిజులాను ఆర్థికంగా దెబ్బతీయాలనే అమెరికా కుట్రల్ని ప్రజా మద్దతుతో అడ్డుకుని తీరుతామన్నారు. అమెరికా ప్రకటన అనంతరం ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో శనివారం నుంచి రెండ్రోజుల పాటు సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్నట్టు మదురో ప్రకటించారు. తాజా ఆంక్షలు ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత దిగజారుస్తాయని ఆయన పేర్కొన్నారు. మదురో నియంతృత్వం పాలన అనే సాకుతో వెనిజులాకు కొత్తగారుణ సాయాన్ని నిలిపేస్తున్నట్లు అమెరికా శుక్రవారం ప్రకటించింది. దీనిపై స్పందించిన మదురో మీడియాతో మాట్లాడుతూ వెనిజులాపట్ల అమెరికా ప్రవర్తిసున్న తీరుపై ఇదివరకే హెచ్చరించినట్లు తెలిపారు. చరిత్రలో ఇరు దేశాల మధ్య ఇంత బలహీన సంబంధాలు ఇరు దేశాల మధ్య ఎప్పుడూ నెలకొనలేదని మూడు రోజుల క్రితమే ఆయన విమర్శించిన సంగతి తెలిసిందే. అయితే ఆ కుట్రల్ని సాగనీయబోమని, భవిష్యత్తులో వెనిజులా మరింత బలంగా, స్వేచ్ఛగా, స్వతంత్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

ఐరాస సూచన పాలస్తీనా విజయం

ఐక్యరాజ్యసమితి : ఇజ్రాయెల్, పాలస్తీనా వివాదం పరిష్కారానికి ఐక్యరాజ్యసమితి కీలక సూచన చేసింది. పాలస్తీనా భూభాగాన్ని ఇకపై ఇజ్రాయెల్ ఆక్రమించకుండా అడ్డుకట్ట వేసేందుకుగాను ఇరు దేశాలు మధ్య చర్చలు నిర్వహించి సమస్య పరిష్కారానికి మార్గం సుగమం చేయాలని ఐరాస సహ కార్యదర్శి మిరోస్లావ్ జెంకా..భద్రతా మండలికి సూచించారు. దీనిపై పాలస్తీనా హర్షం వ్యక్తం చేసింది.

ట్రాన్స్‌జెండర్ల నియామకాలపై ట్రంప్ నిషేధం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా హయాంలో తీసుకున్న నిర్ణయానికి స్వస్తి పలుకుతూ.. అమెరికా మిలటరీలో ట్రాన్స్‌జెండర్ల నియామకం చేపట్టొద్దని పేర్కొన్నారు. ఈ మేరకు ట్రాన్స్‌జెండర్ల రిక్రూట్‌మెంట్‌పై నిషేధం విధిస్తూ.. సంబంధిత మెమొరాండంపై ట్రంప్ సంతకం చేశారు.

పడిపోతున్న ట్రంప్ ఇమేజ్ !

- అధ్యక్షుడిగా ట్రంప్ పట్ల ఆమోదంతో ఉన్నవారు కేవలం 34 శాతం
- 'గల్లప్' పోల్ సర్వే వెల్లడి

వాషింగ్టన్ : రోజులు గడుస్తున్న కొలదీ...అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఇమేజ్ పడిపోవటమేగానీ, పెరగటం లేదు. అధ్యక్షుడిగా ట్రంప్‌ను కేవలం 34 శాతం అమెరికన్లు మాత్రమే సానుకూల దృక్పథంతో చూస్తున్నారు. గత అధ్యక్షుడు బరాక్ ఒబామాకు ఎప్పుడూ కూడా పోల్ సర్వేల్లో 40 శాతం కన్నా తక్కువ రేటింగ్ రాలేదు. 'గల్లప్' పోల్ సర్వేలో ట్రంప్‌నకు కేవలం 34 శాతం మాత్రమే రేటింగ్ దక్కింది. ఆయన విధానాలు, పాలన జన ఆమోదాన్ని పొందలేకపోతున్నాయని, గత అధ్యక్షుల తొలి ఏడాది పాలనతో పోల్చితే ట్రంప్‌కు దక్కిన జనామోదం చాలా చాలా తక్కువగా ఉందని 'గల్లప్' అనే సంస్థ తాజాగా తన పోల్ సర్వే ఫలితాల్లో పేర్కొన్నది. కనీసం 40 శాతం ప్రజలు కూడా ట్రంప్ పట్ల మొగ్గుచూపటం లేదని ఈ పోల్ సర్వే తెలియజేసింది. ఇలా 40 శాతం కన్నా తక్కువగా రేటింగ్ (వివిధ పోల్ సర్వేల్లో) గత అమెరికా అధ్యక్షులెవ్వరూ పొందలేదని, తొలి ఏడాది కాలంలోనే తక్కువ రేటింగ్ పొందిన తొలి అధ్యక్షుడు ట్రంపే అవుతాడని 'గల్లప్' అభిప్రాయపడింది.

వెనిస్ మేయర్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు

వెనిస్: 'అల్లాహ్ అక్బర్ అని ఎవరన్నా వారిని వెంటనే కాల్చిపారేయండి' అంటూ వెనిస్ మేయర్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపు తున్నాయి. నీటి మీద తేలియాడే నగరంగా వెనిస్‌కు పేరుంది. ఇటీవల బార్సిలోనాలో ఉగ్రవా దులు మారణహోమం సృష్టించి 13 మంది ప్రాణా లను బలిగొన్న నేపథ్యంలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెనిస్ మేయర్ లూగీ బ్రుగ్నారో పై వ్యాఖ్యలు చేశారు.


బ్యాగు మోసిన డిప్యూటీ ఏజీపై వేటు



లైంగికదాడి కేసులో దోషి అయిన రామ్‌రహీమ్ బ్యాగును మోసిన డిప్యూటీ అడ్వకేట్ జనరల్ గుర్‌దాస్ సింగ్‌పై వేటు పడింది. దోషిగా నిర్ధారించిన రామ్‌రహీమ్ కోర్టుకు వస్తుండగా... డిప్యూటీ అడ్వకేట్ జనరల్ పరుగున వెళ్లి ఆయన బ్యాగు పట్టుకున్నారు. కోర్టులోకి దోషితో పాటు ఆ బ్యాగును మోసుకుంటూ.. లోనికి ప్రవేశించారు. దీన్ని న్యాయస్థానం సీరియస్‌గా తీసుకున్నది. వెనువెంటనే గుర్‌దాస్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించింది.

డేరా చీఫ్ గుర్మీత్ దోషే





పంచకుల : హర్యానా, పంజాబ్‌లో డేరా సచ్చా సౌదా కార్యకర్తలు వీరంగం సృష్టించారు. లైంగికదాడుల కేసులో తమ ఆధ్యాత్మిక గురువు, డేరా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్‌ను కోర్టు దోషిగా తేలిన మరుక్షణమే హింస చెలరేగింది. పంచకులకు వేలాదిగా చేరుకున్న గుర్మీత్ అనుచరులు హింసాత్మక ఘటనలకు తెగబడ్డారు. పంచకులలో ప్రభుత్వ కార్యాలయాలు, పోలీసు, మీడియా వాహనాలు, రైల్వేస్టేషన్లకు నిప్పు పెట్టారు. హర్యానాలోని పలు జిల్లాల్లో భద్రతా బలగాలపై డేరా కార్యకర్తలు రాళ్లు రువ్వారు. ఈ అల్లర్లలో 37 మందికి పైగా చనిపోగా, 350 మంది గాయపడ్డారు.

ఏమిటీ కేసు?

మూడో తంతు డేరా చీఫ్‌గా 1990లో బాధ్యతలు చేపట్టిన గుర్మీత్ అరాచకాలు అన్నీ ఇన్నీ కాదు. నచ్చిన మహిళనల్లా లోబర్చుకునేవాడు. పైగా విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరింపులు.. గుర్మీత్ దురాగతాలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేసిన ఓ జర్నలిస్టును చంపినట్టు కూడా ఆరోపణలున్నాయి. కాగా గుర్మీత్ తమపై లైంగికదాడికి పాల్పడ్డాడంటూ ఇద్దరు మహిళలు 2002లో అప్పటి ప్రధాని వాజ్‌పేయి, పంజాబ్, హర్యానా హైకోర్టుకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) విచారణ చేపట్టింది. ఈ కేసు వాదనలు ఇటీవలే ముగిశాయి.

200 కార్ల కాన్వాయ్‌తో న్యాయస్థానానికి..

కేసులో గుర్మీత్‌ను దోషిగా తేలుస్తూ పంచకులలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం తీర్పు వెలువరించింది. కాగా తీర్పు నేపథ్యంలో కోర్టుకు హాజరయ్యేందుకు గుర్మీత్ 200వాహనాల కాన్వాయ్‌లో సిర్సా నుంచి పంచకులలోని సీబీఐ కోర్టుకు చేరుకున్నారు. తీర్పు వెలువరించిన అనంతరమే ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో గుర్మీత్‌ను రోహ్‌తక్‌కు తరలించి, సనోరియా జైలులో ఉంచారు. కాగా గుర్మీత్‌కు సీబీఐ కోర్టు జడ్జి జగదీప్ సింగ్ సోమవారం శిక్ష ఖరారు చేయనున్నారు.

పంచకులకు తరలించం, జైలులోనే న్యాయస్థానం!: డీజీపీ

గుర్మీత్‌ను దోషిగా తేలుస్తూ తీర్పు వెలువడిన వెంటనే పంచకుల అట్టుడికింది. కార్యకర్తలు చేసిన విధ్వంసంతో నగరమంతా రణరంగాన్ని తలపించింది. ఈ హింసాకాండలో భారీగా ప్రాణనష్టమే కాక, ప్రభుత్వానికి కోట్లాది రూపాయల నష్టం వాటిల్లింది. గుర్మీత్ సమక్షంలోనే న్యాయస్థానం శిక్ష ఖరారు చేయాల్సి ఉన్నది. ఈ క్రమంలో ఆయనను సోమవారం మళ్లీ పంచకులకు తరలిస్తే పరిస్థితి చేయి దాటిపోతుందని పోలీసులు ఉన్నతాధికారులు ముందుగానే గ్రహించారు. గుర్మీత్‌ను సోమవారం పంచకులకు తరలించబోమని హర్యానా డీజీపీ బిఎస్ సంధూ వెల్లడించారు. అయితే వీడియో కాన్ఫరెన్స్ వ్యవస్థ ద్వారా గుర్మీత్‌కు న్యాయస్థానం శిక్ష ఖరారు చేసే అవకాశముందని తెలిపారు. లేదంటే జైలులోనే కోర్టు సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం సీబీఐ జడ్జి జగదీప్‌సింగ్‌నే శిక్ష ఖరారు చేసేందుకు రోహ్‌తక్‌కు తీసుకెళ్లాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

డేరా ప్రధాన కార్యాలయంలోకి ప్రవేశించం: బలగాలు

హర్యానా వ్యాప్తంగా డేరా సచ్చా సౌదా కేంద్రాలనుఖాళీ చేయించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో సిర్సా జిల్లాలోని డేరా ప్రధానకేంద్రాన్ని బలగాలు శనివారం దిగ్బంధించాయి. అయితే ప్రధాన కార్యాలయంలోకి ప్రవేశించే ఉద్దేశం తమకు లేదని. మేజర్ జనరల్ రాజ్‌పాల్ పునియా స్పష్టం చేశారు. డేరా మేనేజ్‌మెంటుతో మాట్లాడి కేంద్రాన్ని ఖాళీ చేయాలని కోరతామన్నారు. కార్యాలయంలో గుర్మీత్ అనుచరులు దాదాపు లక్ష మంది ఉన్నట్టు సమాచారం. శాంతియుతంగా బయటకు రావాలని వారందరిని, మేనేజ్‌మెంటును కోరినట్టు పునియా వివరించారు. కురుక్షేత్రతో పాటు పలు జిల్లాలోని డేరా కేంద్రాలను బలగాలు ఖాళీ చేయించాయి. ఈ క్రమంలో భారీగా లాఠీలు, పెద్దఎత్తున ఆయుధ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నాయి.

హైకోర్టుకెళ్తాం: డేరా సచ్చా సౌదా

లైంగికదాడి కేసులో గుర్మీత్‌ను దోషిగా తేలుస్తూ సీబీఐ న్యాయస్థానం వెల్లడించిన తీర్పును వ్యతిరేకిస్తూ హర్యానా, పంజాబ్ హైకోర్టును ఆశ్రయిస్తామని డేరా సచ్చా సౌదా వెల్లడించింది. గుర్మీత్‌ను దోషిగా తేల్చడం అన్యాయమని అభిప్రాయపడింది. కార్యకర్తలు సంయమనం పాటించాలని పిలుపునిచ్చింది. మరోవైపు.. గుర్మీత్‌పై ఉన్న కేసుల పరంగా ఆయనకు ఏడేండ్లకు తగ్గకుండా శిక్షపడే అవకాశాలున్నాయి.

రాజ్‌నాథ్‌సింగ్ అత్యున్నతస్థాయి భేటీ

కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అత్యున్నతస్థాయి సమావేశం నిర్వహిం చారు. శనివారం ఢిల్లీలోని రాజ్‌నాథ్ సింగ్ నివాసంలో జరిగిన ఈ సమావేశానికి జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్, హోంశాఖ కార్యదర్శి రాజీవ్‌మెహర్షి, ఇంటలి జెన్స్‌బ్యూరో చీఫ్ రాజీవ్‌జైన్, పారామిలటరీ ఉన్నతాధికా రులు, హర్యానా డీజీపీ తదితరులు హాజర య్యారు.

ఖైదీ నెంబరు.1997

జైలులో ఉన్న గుర్మీత్‌కు ఖైదీనెంబరు 1997ను కేటాయించారు. అయితే జైలులో అతనిని అధికారులు ప్రత్యేకంగా ట్రీట్ చేస్తున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. జైలు గదిలో ఏసీసదుపాయంతో పాటు మినరల్ వాటర్ అందిస్తున్నట్టు సమాచారం. అంతేకాక అతనికి ఓఅసిస్టెంటును కూడా ఏర్పాటు చేసినట్టు తెలుస్తున్నది. అయితే.. ఈ వార్తలను హర్యానా ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ డిఎస్ దేశీ కొట్టిపారేశారు. గుర్మీత్‌ను ఓ సాధారణ ఖైదీగానే చూస్తున్నట్టు, భోజనం కూడా అందరు ఖైదీలకు అందిచేదే అతనికీ ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. గుర్మీత్‌కు ఇంతకు ముందు ఉన్న జెడ్ ప్లస్ భద్రతను కూడా తొలగించినట్టు దేశీ చెప్పారు.

కోట్లల్లో ఆస్తులు..

గుర్మీత్‌కు ఆస్తులు కోట్లలోనే ఉన్నాయి. పాఠశాలలు, ఆస్పత్రులు, ఇతర కంపెనీలు, ఉత్పత్తైన వస్తువులు అన్నీ ఒకే బ్రాండ్‌తో మార్కెట్లోకి విడుదలవుతాయి. ఆబ్రాండే ఎమ్ఎస్ జీ(మెసెంజర్ ఆఫ్ గాడ్). వేరే ఏ కంపెనీలో తయారైన వస్తువైన గుర్మీత్ ద్వారా మార్కెట్లోకి వెళ్లాలంటే బ్రాండ్ పేరు ఎమ్ఎస్‌జీ అని పేరు మార్చాల్సిందే. హర్యానాలోని పలు ప్రాంతాల్లో గుర్మీత్‌కు అనేక కంపెనీలు ఉన్నాయి. హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో విద్యా సంస్థలు కూడా ఉన్నాయి. వీటికి సంబంధించిన కార్య కలాపాలన్నీ సిర్సాలోని డేరా హెడ్‌క్వార్టర్స్ కేంద్రంగానే జరుగుతున్నాయి.

హర్యానా సీఎం రాజీనామా చేయాలి : సీపీఐ(ఎం) డిమాండ్

న్యూఢిల్లీ : హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్‌ను పదవి నుంచి వెంటనే తొలగించాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. శాంతిభద్రతలను కాపాడటంలో విఫలమైన ఆ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారం నుంచి వైదొలగాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. గుర్మీత్ రామ్‌రహీంసింగ్‌ను దోషిగా తేలుస్తూ సీబీఐ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో జరిగిన హింసాకాండను పొలిట్‌బ్యూరో గుర్తు చేసింది. శుక్రవారం తీర్పు రాగా, అంతకు కొన్నిరోజుల ముందే పంచకులలోని సీబీఐ కోర్టు పరిసరాల్లోకి గుర్మీత్ అనుచరులు పెద్దసంఖ్యలో చేరుకున్నా రని, హింస చెలరేగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది. తీర్పు వెల్లడికి కొన్నిరోజుల ముందు గుర్మీత్‌ను ఆశీర్వాదం కోసం బీజేపీ ఎమ్మెల్యేతో కలిసి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కలిసినట్టు వార్తలు వచ్చాయని పొలిట్‌బ్యూరో తెలిపింది. ఆ రాష్ట్రంలోని అమాయక ప్రజల ప్రాణాలను, ఆస్తులను కాపాడటంలో బీజేపీ ప్రభుత్వం విఫలం కావడం ఇది మూడోసారని పొలిట్‌బ్యూరో గుర్తు చేసింది. వివాదాస్పద రాంపాల్ కేసు సమయంలో, జాట్ ఆందోళన సందర్భంగా, ఇప్పుడు మరోసారి ఆ రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని పొలిట్ బ్యూరో తెలిపింది. ప్రభుత్వాన్ని కొనసాగించేందుకు బీజేపీ అర్హత కోల్పోయిందని పొలిట్‌బ్యూరో తెలిపింది.

ప్రభుత్వాల వైఫల్యం వల్లే : ఐద్వా

గుర్మీత్‌పై తీర్పు అనంతరం హర్యానాలో అల్లర్లను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అఖిలభారత ప్రజాస్వామిక మహిళా సంస్థ(ఐద్వా) విమర్శించింది. బెదిరింపులకు భయపడకుండా న్యాయం కోసం పోరాడిన ఇద్దరు మహిళలను ఐద్వా అభినందించింది. బాధిత మహిళలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని ఐద్వా డిమాండ్ చేసింది. ఎన్నికల్లో లబ్ధి కోసం పలు రాజకీయ పార్టీలు గుర్మీత్‌ను కాపాడేందుకు యత్నించడం వల్లే బాధిత మహిళలకు న్యాయం జరగడంలో ఆలస్యమైందని ఐద్వా స్పష్టం చేసింది. ప్రధాని మోడీ సైతం డేరా చీఫ్‌ను పొగిడారని ఐద్వా గుర్తు చేసింది. పలువురు దొంగ బాబాలను రాజకీయ పార్టీలు ప్రోత్సహిస్తున్నాయని ఐద్వా దుయ్యబట్టింది.

సాక్షి మహరాజ్ వ్యాఖ్యలు క్రూరమైనవి : విజయన్

బీజేపీ ఎంపీ సాక్షి మహరాజ్‌పై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మండిపడ్డారు. అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తిని వెనకేసుకు రావడం మహిళల పట్ల క్రూరత్వానికి నిదర్శనమని విజయన్ దుయ్యబట్టారు. మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ నేరస్తుడిది గొప్పఆత్మ అంటూ సాక్షి మహరాజ్ కొనియాడారని విజయన్ గుర్తు చేశారు. దీంతో, సంఘ్‌పరివార్ అమానుషత్వం వెల్లడైందని విజయన్ అన్నారు. ఈ సందర్భంగా జామామసీద్ షాహీ ఇమామ్‌ను ఉద్దేశిస్తూ సాక్షి మహరాజ్ చేసిన వ్యాఖ్యలు మతోన్మాదాన్ని రెచ్చగొట్టేలా ఉన్నాయని విజయన్ అన్నారు. సాక్షి వ్యాఖ్యలపై ప్రధాని మోడీసహా బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు మౌనంగా ఉండటంతో వారు కూడా ఆయనను సమర్థిస్తున్నట్టుగా భావించాల్సి ఉంటుందని విజయన్ అన్నారు.

మోడీ దేశానికి ప్రధాని.. బీజేపీకి కాదు

చండీగఢ్: 'నరేంద్ర మోడీ.. మీరు దేశం మొత్తానికి ప్రధానమంత్రి.. ఒక్క బీజేపీకే కాదు. దేశంలో హర్యానా భాగం కాదా? పంజాబ్, హర్యానాలను కేంద్రం ఎందుకు మారు పిల్లలుగా భావిస్తున్నది' అంటూ పంజాబ్, హర్యానా హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. డేరా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్‌ను శుక్రవారం సీబీఐ కోర్టు దోషిగా తేల్చిన అనంతరం హింసాత్మక ఘటనలు తలెత్తిన సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఆందోళనకారులకు సీఎం మనోహర్‌లాల్ ప్రభుత్వం లొంగిపోయి, హింసను ప్రోత్సహించిందని మండిపడింది. రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం పంచకుల నగరాన్ని తగులబడేలా చేస్తున్నారా? అని నిలదీసింది. శాంతి, భద్రతలను కాపాడాల్సిన ప్రభుత్వ యంత్రాంగం నిస్సహాయంగా వ్యవహరించిందని విమర్శించింది. వేలాది మంది గుర్మీత్ అనుచరులు వారం రోజులుగా పంచుకులకు చేరుకుంటున్నా.. వారిని ఎందుకు నిలువరించలేదని కట్టర్‌ను ప్రశ్నించింది. డేరా కార్యకర్తలను సీఎం ప్రత్యేకంగా రక్షణ కల్పిస్తూ వారిని వెనకేసుకొస్తున్నారని వెల్లడించింది. దీని ఫలితంగా ఇప్పటికే 30 మందికి పైగా చనిపోయారని, కోట్లాది రూపాయల ఆస్తి నష్టం సంభవించిందని తెలిపింది. 'పంచకులతో పాటు హర్యానాలోని పలు ప్రాంతాలు రణరంగంగా మారితే.. దీనంతటికీ బాధ్యుడిని చేస్తూ డీసీపీపై సస్పెన్షన్ వేటు వేశారు అంటే మొత్తం ఘటనలన్నింటికీ ఆయన ఒక్కరే బాధ్యుడా? ఆయనను బలి పశువును చేసి, మీరు చేతులు దులుపుకున్నారు' అని నిలదీసింది. రాష్ట్రంలోని పరిస్థితిపై, డేరా కేంద్రాలను ఖాళీ చేయించే విషయమై కోర్టుకు సమగ్ర నివేదికను సమర్పించాలని కట్టర్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాక పంజాబ్, హర్యానాల్లో ఉన్న డేరా ఆస్తుల వివరాలన్నింటిని ధర్మాసనం ముందు ఉంచాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆస్తులను కోర్టు తదుపరి ఉత్తర్వులిచ్చేవరకు వేరొకరికి అప్పగించరాదని తెలిపింది. తదుపరి విచారణను హైకోర్టు ధర్మాసనం మంగళవారానికి వాయిదా వేసింది.

బాబా గూట్లో బీజేపీ, కాంగ్రెస్



న్యూఢిల్లీ : సిర్సా కేంద్రంగా హర్యానాలో ప్రబలమైన శక్తిగా ఇటు ప్రజల్లో బలపడి రాజకీయ పార్టీలకు కొండంత అండగా ఉంటూ వచ్చిన డేరా సచ్చా సౌదా సంస్థ సామాన్య ప్రజానీకంలో ఆదరాభిమానాలు సంతరించుకుంది. నిజానికి ఇది 1948లో ఏర్పాటైన షా మస్తానా బెలూచిస్తానీ అనుబంధ సంస్థ. దీనికి సిక్కులలోను, ముస్లింలలోనూ, క్రైస్తవులలోనూ, హిందు దళిత, బలహీనవర్గాలలో విపరీతమైన ఆదరణ ఉంది. ప్రజాబలం కారణంగానే హర్యా.నా, పంజాబ్, రాజస్తాన్ రాష్ట్రాలలో ఎన్నికల సమయంలో ఏ పార్టీ విజయావకాశాలనైనా ప్రభావితం చేయగల స్థితికి డేరా సచ్చా సౌదా ఎదిగింది. ఈ కారణంగానే గతంలో ప్రముఖ రాజకీయపార్టీలు అది బీజేపీ అయినా, కాంగ్రెస్ అయినా మరో పార్టీ అయినా మద్దతు కోసం ఆయన ముందు మోకరిల్లారనటంలో అనుమానం లేదు. ఒకపక్క తాను రాజకీయాలకు అతీతం అంటూనే 2007లో డేరా సచ్చా సౌదా సంస్థ నేత ౧గుర్మీత్ రాం రహీం రాజకీయ విభాగాన్ని ఏర్పాటుచేశారు.

2014 ఎన్నికల సమయం వరకూ నిజానికి గుర్మీత్ పేరు అంతగా ప్రచారంలో లేదు. లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ గుర్మీత్ మద్దతు కోరింది. అందుకు స్వయంగా అప్పటి ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోడీ నుంచి గుర్మీత్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. అదే విధంగా మోడీ ప్రధాని బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రారంభించిన క్లీన్ ఇండియా ప్రోగ్రామ్‌కు గుర్మీత్ మద్దతు ప్రకటించి, అందుకు మోడీ నుంచి ప్రశంసలు అందుకున్నారు. హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో కలిసి ఆ సమయంలో గుర్మీత్ స్వయంగా చీపురుపట్టి రోడ్లను శుభ్రం చేసిన ఫొటోలు మీడియా దృష్టిలో పడ్డాయి. హర్యానాలో గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్ర బీజేపీ నేత కైలాశ్ విజయవర్గీయ తన పార్టీ అభ్యర్థులు 44 మందిని స్వయంగా గుర్మీత్ ఆశ్రమానికి తీసుకెళ్లి ఆయన ఆశీస్సులు కోరిన విషయం, ఆ తర్వాత ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడం అందరికీ తెలిసిందే. అయితే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం గుర్మీత్ ప్రచారం బీజేపీకి ఏ మాత్రం ఉపయోగపడలేదు.

ఇక కాంగ్రెస్ విషయం చూస్తే గుర్మీత్‌కు నలుగురు పిల్లలు. వారిలో కుమారుడైన జస్మీత్‌కు ప్రముఖ కాంగ్రెస్ నేత హర్మీందర్ సింగ్ కుమార్తెతో వివాహం అయింది. 2007 ఎన్నికల్లో గుర్మీత్ కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. అప్పటికి అధికారంలో ఉన్న శిరోమణి అకాలీదళ్ తన అనుయాయులను వేధిస్తున్నదే ఆగ్రహంతో కాంగ్రెస్‌కు అండగా నిలిచారు. అయితే అప్పుడు కాంగ్రెస్‌కు ఆయన మద్దతు ఉపయోగపడలేదు. ఎన్నికల్లో ఓటమిపాలైంది. 2012 ఎన్నికల్లో ఆయన ఏ పార్టీకి మద్దతు ఇవ్వలేదు. పంజాబ్ ఎన్నికల సమయంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండు ఆయన మద్దతు కోసం ప్రయత్నించాయి. ఆయన బీజేపీకి మద్దతు ఇచ్చినా ఆ పార్టీకి ఓటమి తప్పలేదు.

బీజేపీ మంత్రులు పెద్ద మొత్తంలో నిధులు అందించేవారు. 2014 అసెంబ్లీ ఎన్నికల నుంచిఆయన మద్దతు బీజేపీకి లాభించకపోయినా దాదాపు గత ఆగస్టు నుంచి ఇప్పటివరకూ కోటి రూపాయలకు పైనా వారు గుర్మీత్‌కు సమర్పించినట్టు సమాచారం. కేవలం రెండు వారాల క్రితం హర్యానా విద్యా శాఖ మంత్రి రాం విలాస్ శర్మ గుర్మీత్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఏడాది క్రితం మరో ప్రముఖ మంత్రి అనిల్ విజ్ రూ. 50 లక్షలు స్పోర్ట్స్ వ్యాప్తి పేరుతో డేరా సంస్థకు సమర్పించారు. మరో మంత్రి రూ. 11 లక్షలను తన విచక్షణ ఆధారంగా అందజేశాడు. నిజానికి ఇవాళ కోర్టు కేసులో దోషిగా నిలబడే వరకు గుర్మీత్‌కు అందించిన జెడ్ క్యాటగిరీ భద్రత ఇదివరకటి కాంగ్రెస్ సర్కారు మంజూరు చేసిందే.

నల్లగొండలో డేరా బాబా ఆస్తులు

వెల్మినేడులో 55 ఎకరాల భూమి

- 20ఎకరాల అసైన్డ్ భూముల ఆక్రమణ
- ఆశ్రమంలో అసాంఘిక కార్యక్రమాలు
- గుర్మీత్ బాబా అరెస్టుతో కదిలిన అధికారులు
- భూముల్ని పంచాయతీకివ్వాలని స్థానికుల డిమాండ్



నవతెలంగాణ-నల్లగొండ ప్రతినిధి

ఐదు రాష్ట్రాల్లో అల్లర్లు చెలరేగడానికి కారణమై న గుర్మీత్ రామ్‌రహీమ్ బాబా అక్రమాస్తుల పుట్ట పగులుతోంది. దేశ వ్యాప్తంగా డేరా బాబా సచ్చ సౌద సంస్థ పేరిట ఉన్న ఆస్తులు వెలుగులోకి వస్తున్నాయి. హర్యానా, పంజాబ్ కేంద్రంగా నడుస్తున్న డేరా సంస్థ కు నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని వెల్మినే డులో విలువైన భూములున్నాయి. పదేండ్ల కింద డేరా సంస్థ 65వ జాతీయ రహదారి వెంట భూము ల్ని సేకరించింది. అందులో పట్టా భూమితో పాటు అసైన్డ్ భూమి కూడా ఉంది. ఆశ్రమం పేరిట కట్టిన బౌండరీలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్న ట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.

డేరా బాబాగా పేరుగాంచిన గుర్మీత్ సింగ్ రామ్ రహీమ్ లైంగిక దాడి కేసులో దోషిగా సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు చెప్పిన విషయం విదితమే. ఆయనకు చెందిన డేరా సచ్చ సౌద సంస్థ నల్లగొండ జిల్లాలోని చిట్యాల మండలం వెల్మినేడులో 2006 నుంచి 2009 వరకు 55ఎకరాల భూములను కొని ఆశ్రమం నెలకొల్పింది. 55ఎకరాల చుట్టూ ఎత్తైన ప్రహరీ నిర్మించారు. ఆశ్రమంలోకి గుర్మీత్‌కు చెందిన డేరా సభ్యులకు తప్ప ఇతరులెవరికీ అనుమతి ఉండదు. ఆశ్రమానికి చెందిన 55ఎకరాల్లో ప్రభుత్వానికి చెంది న అసైన్డ్ భూమి 20ఎకరాల వరకు ఉన్నట్టు ఫిర్యాదులున్నాయి. సర్వే నెంబర్లు 100, 101, 102, 103, 104, 105, 107, 108, 109, 111, 113, 116, 118, 119, 120, 121లో ఉన్న భూముల్ని కొనుగోలు చేశారు. డేరా సంస్థ భూముల్లో అసైన్డ్ భూములున్నాయని స్థానికులు రెవెన్యూ అధికారులకు గతంలోనే ఫిర్యాదు చేశారు. అయితే, దీనిని రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. హైదరాబాద్-విజయ వాడ 65వ జాతీయ రహదారి వెంట ఉన్న భూముల విలువ విలువ వంద కోట్ల వరకు ఉంటుంది. అందు లో అసైన్డ్ భూమి విలువే రూ.40 కోట్ల వరకూ ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

గుర్మీత్ అరెస్టుతో కదిలిన అధికారులు

గుర్మీత్ సింగ్ బాబాను అరెస్టు చేసిన తర్వాత కానీ.. రెవెన్యూ అధికారుల్లో చలనం రాలేదు. చిట్యా ల తహసీల్దార్ విశాలాక్షి రెవెన్యూ సిబ్బందితో కలిసి శనివారం డేరా ఆశ్రమ భూముల్ని పరిశీలించారు. ఆ సంస్థకున్న భూములు, వాటి సర్వే నెంబర్ల ఆధారం గా సర్వే చేశారు. అందులో 9.20 ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నట్టు గుర్తించారు. ఆ భూమి చుట్టూ డేరా సంస్థ నిర్మించిన ప్రహరీని తొలగిస్తామని తహసీల్దార్ తెలిపారు.

పేదలకు పంచాలని స్థానికుల డిమాండ్

అక్రమంగా కబ్జా చేసిన భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని స్థానిక ఎంపీ టీసీ ఆరూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన భూముల్ని కూడా వారికే ఇప్పించాలని కోరారు. భూ పంపిణీ పథకం కింద దళితులకు పంపిణీ చేయాలని, లేదంటే డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణానికి కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. డేరా సంస్థ ఆశ్రమంలో నిత్యం అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్టు ఆరోపిస్తున్నారు.

గుర్మీత్ బాబా దేవాలయం

చిట్యాల పట్టణంలో హైదరాబాద్ రోడ్డుకు కుడి వైపున ఉన్న సిక్కుల కాలనీలో గుర్మీత్ సింగ్ బాబా దేవాలయం కూడా ఉంది. అక్కడ పదుల సంఖ్యలో భక్తులుండే వారు. నిత్యం డేరా సంస్థ కార్యక్రమాలు చేసేవారు. కొంత కాలంగా గుడి వద్ద కార్యక్రమాలు తగ్గాయి. ఒకరిద్దరు మాత్రమే అక్కడ ఉంటున్నారు.

ఎవరా న్యాయమూర్తి?

హర్యానా : గుర్మీత్ రామ్ రహీత్ సింగ్ దోషిగా తేల్చిన న్యాయమూర్తి ఇప్పుడు చర్చనీయాంశమయ్యారు. ఆయనే జడ్జి జగ్దీప్‌సింగ్. శుక్రవారం పంచకుల సీబీఐ కోర్టులో తీర్పుకు ముందు అంతా నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. అందరిలోనూ ఒకటే ఉత్కంఠ... తీర్పు ఎలా ఉంటుంది? ఇద్దరు సాధ్వీలపై జరిగిన అత్యాచారం కేసులో గుర్మీత్‌ను జస్టిస్ జగ్దీప్ సింగ్ దోషిగా తేల్చారు. శిక్షా కాలాన్ని 28న ఖరారు చేయనున్నట్టు తెలిపారు. వెంటనే పోలీసులు గుర్మీత్‌ను తమ అదుపులోకి తీసుకొని హెలికాప్టర్ ద్వారా రోహ్‌తక్‌కు తరలించారు.

ఆరాధించే వ్యక్తిపై ఆరోపణలా?

- సాక్షి మహారాజ్ వివాదాస్పద వ్యాఖ్య



న్యూఢిల్లీ : రేపిస్టుగా నిరూపించ బడిన డేరా సచ్ఛా సౌధా సారధి గుర్మీత్ రాంరహీం సింగ్ విషయంలో వివాదాస్పద ఎంపీ సాక్షి మహారాజ్ సంచలనం కలిగించే వ్యాఖ్యలు చేశాడు. ఆయనను కోర్టు అపరాధిగా ప్రకటించిన వెంటనే ఆయన స్పందిస్తూ కోట్లాది మందికి ఆరాధ్యుడైన వ్యక్తి దోషి ఎలా అవుతాడు. అలాంటి వ్యక్తిపై ఆరోపణలు చేసిన మహిళ చెప్పేది సత్యమేనని ఎలా విశ్వసించడం అంటూ సాక్షి మహారాజ్ వ్యాఖ్యానించారు.

కోర్టు తీర్పు రాగాన్ ఆయన మద్దతు దారులు సృష్టించిన విధ్వంసం గురించి ప్రశ్నించగా, ఇదే ప్రశ్న జుమా మసీదు షాహీ ఇమామ్‌ను అడగగలరా ? ఆయనపై కూడా చాలా ఆరోపణలు ఉన్నాయి కదా అని ఎదురు ప్రశ్నిస్తూ, గుర్మీత్ సాధారణ వ్యక్తి అయినందుననే ఆయనను వేధిస్తున్నారని సాక్షి మహారాజ్ ఆరోపించారు. సాక్షి మహారాజ్ వాదనను ఆయన పార్టీలోని చాలా మంది సమర్థించేందుకు సంసిద్ధంగా లేరు.

బీసీలు బహుజన పాలకులు

- 'బహుజన' పుస్తకావిష్కరణలో ప్రొఫెసర్ కంచ ఐలయ్య


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కంచ ఐలయ్య

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

బీసీలంటే బానిసలు కాదని, బహుజన పాలకులని ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. శుక్రవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'బహుజన' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి కంచ ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలందరూ ఏకమై బహుజన రాజ్యాన్ని స్థాపించనున్నట్టు ప్రకటించారు. బీసీ మండల్ పుట్టిన రోజున ఇలాంటి పుస్తకావిష్కరణ జరగడం సముచితమని అన్నారు. బ్రాహ్మణ వాదానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్కృత శ్లోకాలను దునుమాడిన కత్తి పద్మారావుకంటే బలంగా కదిరె కృష్ణ పోరాడుతున్నాడని కొనియాడారు. బ్రాహ్మణులకు ధార్మిక శక్తినిచ్చావు, క్షత్రియులకు రాజ్యాధికారమిచ్చావు, వైశ్యులకు వైశ్వర్యాన్నిచ్చావు, శూద్రులకు ఏమిచ్చావని ప్రశ్నించిన వ్యక్తి కదిరెకృష్ణ అని చెప్పారు. భౌగోళిక తెలంగాణ కాదని, సామాజిక తెలంగాణ కోసం నడుం కట్టిన వాడు కదిరె కృష్ణ అని చెప్పారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన భూపతి వెంకటేశ్వర్లు కదిరె కృష్ణ గురించి కవిత రూపంలో చదివి వినిపించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కాకిమాధవరావు, బీసీ మండల్ ఫొటోకు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రొఫెసర్ సింహాద్రి, ప్రొఫెసర్లు ప్రజ్ఞ, బాలబోయిన సుద ర్శన్, డా. నాగార్జున తదితరులు ప్రసంగించారు. అంతకు ముందు సత్యశో ధ,మహేందర్, రమేష్, జగన్‌లు తమ పాటలతో పాల్గొన్నవారిని ఉత్సాహపరిచారు.

అక్టోబర్ నుంచి సంచలన ఉద్యమాలు

సీఎంది తోలు మందం సర్కారు

- టీమాస్ ఆవిర్భావ సభలో వక్తలు


అభివాదం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ– ఖమ్మం ప్రతినిధి

అక్టోబర్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా టీమాస్ ఆధ్వర్యంలో సంచలన ఉద్యమాలకు శ్రీకారం చుట్టబోతున్నామని, అన్ని సామాజిక సంఘాలు సమరశీలతను ప్రదర్శించి సామాజిక తెలంగాణ ఏర్పాటుకు కలిసి రావాలని టీమాస్ ఆవిర్భావ సభలో పలువురు వక్తలు పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీమాస్ ఆవిర్భావ సభ కొత్తగూడెం క్లబ్‌లో శనివారం జరిగింది. మచ్చా వెంకటేశ్వర్లు, వాసం రామకృష్ణదొర, చందర్‌నాయక్, జెబి శౌరి, అడపాల కస్తూరి అధ్యక్షతన జరిగిన సభలో స్టీరింగ్ కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడారు. ప్రజలు కనీసం నిరసన తెలిపేందుకు కూడా హక్కు లేకుండా కేసీఆర్ సర్కారు నిరంకుశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజల సమస్యలు పట్టని విధంగా సర్కారుకు తోలుమందమైందని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వానికి చురుకు రావాలంటే చిన్నచిన్న సూదులు సరిపోవని, అందుకు టీమాస్ అనే గడ్డపారే సరైన ఆయుధమని అన్నారు. భౌగోళిక తెలంగాణ సాధించామే తప్ప సామాజిక తెలంగాణ రాలేదన్నారు. అందుకే రాష్ట్రంలోని ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక సమానత్వం కోసం టీమాస్ ఆవిర్భవించిందన్నారు. ఆరు నెలల కిందట ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పిన కేసీఆర్ ఇంతవరకూ ఎందుకు ఆ పని చేయలేకపోయారని ప్రశ్నించారు. కుల సంఘాలను ప్రోత్సహిస్తూ గొర్రెలు, చేపపిల్లలు, బర్రెలు ఇస్తామని మాయమాటలు చెప్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా స్త్రీల హక్కులకు భంగం వాటిల్లుతోందనీ, హక్కులు, సాధికారితకు టీమాస్ పోరాడుతుందన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం గిరిజనులను, ఆదివాసులను అడవుల నుంచి తరిమేసే కుట్ర చేస్తోందన్నారు. ఇప్పటికే ఉన్న రిజర్వేషన్లు చాలక గిరిజనులు ఉద్యమిస్తుంటే, కొత్త కులాలను తెచ్చి ఎస్టీల్లో కలపడమంటే కులాల మధ్య చిచ్చు పెట్టడమేనని అన్నారు. గిరిజనులపై జరుగుతున్న దాడులపై అసెంబ్లీలో 12 మంది గిరిజన ఎమ్మెల్యేలున్నప్పటికీ తాను తప్ప ఏ ఒక్కరూ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన దాఖలాలు లేవన్నారు. గిరిజనుల కోసం ఇప్పటి వరకూ స్పెషల్ డీఎస్సీ నిర్వహించలేదన్నారు. మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ.. సమానత్వం కోసం ఇన్ని వందల సంఘాలు ఏకం కావడం ఇదే తొలిసారన్నారు. దేశంలో సీఎం ఆఫీసుకు రాని ఒకే ఒక్క ముఖ్యమంత్రి కేసీఆరే విమర్శించారు. టీమాస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. 281 సంఘాల ఐక్యవేదికగా టీమాస్ ఏర్పాటైందన్నారు. సమ సమాజం కోసం కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాల్సిందేనన్నారు. ప్రజా గాయకుడు గద్దర్ మాట్లాడుతూ.. ఈ వేదిక మీద అందరూ ఒక్కటయ్యారని, ఎన్నికల్లోనూ కలిసే ఉండాలని సూచించారు.

దళితులపై దాడులు పెరిగాయి


- టీమాస్ ఫోరం స్టీరింగ్ కమిటీ మెంబర్ పగడాల లక్ష్మయ్య

నవతెలంగాణ–వెల్గటూర్

రాష్ట్రంలో దళితులపై దాడులు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని టీమాస్ ఫోరం స్టీరింగ్ కమిటీ మెంబర్ పగడాల లక్ష్మయ్య వాపోయారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం ఎండపెల్లిలో పై అధికారి వేధింపులతో యువ ఇంజినీర్ శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. బాధిత కుటుంబాన్ని పగడాల లక్ష్మయ్య, ప్రజాసంఘాల జిల్లా కన్వీనర్ భూతం సారంగపాణితో కలిసి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ మొన్న మంథనిలో మధుకర్ హత్య, నేరెళ్లలో దళితులపై దాడి, భువనగిరి జిల్లాలో కులదురంహకార హత్య వంటి పాశవిక దాడులపై తక్షణమే టీఆర్ఎస్ సర్కారు చర్యలు తీసుకుంటే నేడు శ్రీకాంత్‌పై వివక్షాపూరిత దాడి జరిగేది కాదన్నారు. శ్రీకాంత్ మృతికి కారణమైన వీరారెడ్డిని వెంటనే విధుల నుంచి తప్పించి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, అరెస్టు చేసి జైలులో పెట్టాలని డిమాండ్ చేశారు. శ్రీకాంత్ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాసంఘాల జిల్లా కన్వీనర్ భూతం సారంగపాణి మాట్లాడుతూ... రెండు రోజుల్లో వీరారెడ్డిని అరెస్టు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా ఎస్పీ అనంతశర్మకు వినతిపత్రం అందజేశారు. వారివెంట ప్రజాసంఘాల నాయకులు రాంలక్ష్మణ్, నాయిని శారద, జనం కోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు చందు, ఉమ, కొమురయ్య, కిరణ్, శ్రీను ఉన్నారు.

అసిస్టెంట్ సోలిసిటర్ జనరల్‌గా కె లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో– హైదరాబాద్



తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టులో కేంద్రానికి సంబంధించిన కేసులను వాదించేందుగాను రాష్ట్రానికి చెందిన కె లక్ష్మణ్‌ను కేంద్ర న్యాయ శాఖ అసిస్టెంట్‌గా సోలిసిటర్ జనరల్‌గా నియమించింది. ఆయన ఈ పదవిలో మూడేండ్ల పాటు కొనసాగుతారు.

రాష్ట్రంలో కొత్త హోమియోపతి ఆస్పత్రి



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

అధునాతన హంగులతో రాష్ట్రంలో హోమియోపతి కొత్త ఆస్పత్రి ఏర్పాటు కానున్నదని ఢిల్లీలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి వేణుగోపాల చారి తెలిపారు. కరీంనగర్ లేదా వరంగల్‌లో ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు పంపిస్తే అంగీకరించారని చెప్పారు. హోమియోపతి వైద్యంలో మారుతున్న వైద్య విధానాలు, అత్యాధునిక చికిత్సలపై అవగాహన కల్పించేందుకు హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో హోమియోపతి సదస్సు హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈనెల 26, 27తేదీల్లో జరిగే తొలిరోజు సదస్సులో ఆయన మాట్లాడుతూ.. అన్ని జిల్లాల్లోనూ 10–12 పడకల హోమియో ఆస్పత్రులు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాద నలు పంపించామ న్నారు. ప్రస్తుతం ఉన్న హోమియో పతి ఆస్పత్రులు, వైద్య కళాశాలల్లో ఖాళీల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని, వైద్యుల సమస్య తీరితే ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందిం చవచ్చునని స్పష్టం చేశారు. అంతకుముందు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం రాష్ట్ర ఉపకులపతి డాక్టర్ బీ.కరుణాకర్ రెడ్డి సదస్సును ప్రారంభించి ప్రసంగించారు. హోమియోపతి వైద్యంపై ప్రజల్లో అవగాహన పెరగాల్సి అవసరం ఉందని అన్నారు. ఇలాంటి సదస్సుల ద్వారా యువ హోమియోపతి వైద్యులకు ఎంతో విజ్ఞానం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో న్యూఢిల్లీ సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ హోమియోపతి అధ్యక్షుడు డాక్టర్ రాంజీసింగ్‌జీ, న్యూఢిల్లీ సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి డైరెక్టర్ జనరల్ రాజ్ కే.మంచాందా జీ, రాష్ట్ర ఆయుష్ కమిషనర్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి, కేంద్ర ఆయుష్ విభాగం అసిస్టెంట్ అడ్వైజర్ డాక్టర్ చింతా శ్రీనివాసరావు, రిసెప్షన్ కమిటీ చైర్మెన్ డాక్టర్ ఎస్.వేణుగోపాలచారి, అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ రామేశ్వర్‌రావు, డాక్టర్లు శివశంకర్, పీ.సంపత్‌రావు, డాక్టర్ కే.గోపాలకృష్ణ, కే.గోపాలకృష్ణ, జీ.దుర్గాప్రసాదరావు, కే.శ్రీనివాసగుప్తా, వేణుగోపాల్ చారి పాల్గొన్నారు.

అనంతగిరిలో ఆయుష్ ఆస్పత్రి

రాష్ట్రంలో మరో ఆయుష్ ఆస్పత్రి ఏర్పాటు కానుంది. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లో 50 పడకలతో దీన్ని నెలకొల్పేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రాజేశ్వర్ తివారీ శనివారం ఉత్తర్వులు జారీచేశారు.

అన్యాక్రాంత భూములను స్వాధీనం చేసుకోవాలి

- దళితులకు మూడెకరాలు ఇవ్వాల్సిందే: ఉభయ వ్యవసాయ కార్మిక రైతు సంఘాల డిమాండ్
- వచ్చే నెల 19న రాష్ట్ర భూసదస్సు


మాట్లాడుతున్న వెంకట్, చిత్రంలో నర్సింహా, నాగయ్య, వెంకటరాములు, ప్రసాద్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో సాగుభూమి, ఇండ్లస్థలాలు వస్తాయని ఆశించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర పేదలందరికీ నిరాశే మిగిలిందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ఉపాధ్యక్షులు బి. వెంకట్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(అమృత ఎస్టేట్స్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహ్మా, తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు మూడెకాల భూమి ఇస్తామని చెప్పి అభివృద్ధి పేరుతో వీరి భూములనే గుంజుకుంటున్నారని విమర్శించారు. పేదలకు పంచిన భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షణ కోసం తెచ్చిన 1977 అసైన్డ్‌మెంటు చట్టాన్ని కూడా అమలు చేయడం లేదని అన్నారు. ప్రభుత్వ, సీలింగ్ భూములు పలుకుబడి కలిగిన పెద్దలంతా కబ్జాలు చేస్తుంటే, ప్రభుత్వ చర్యలు సైతం వారికే ఉపయోగపడేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో ఉన్న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(జవహర్‌నగర్) రాష్ట్ర కార్యదర్శి జి.నాగయ్య, రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(అమృత ఎస్టేట్స్) రాష్ట్ర అధ్యక్షులు టి.వెంకట్రాములు, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూతం వీరయ్య, రాష్ట్ర కార్యదర్శి అచ్యుత రామారావుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. అన్యాక్రాంతమైన భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. తిరిగి పేదలకు అప్పగించాలని సూచించారు. ప్రతి పేద కుటుంబానికి మూడెకరాల భూమిని ఇవ్వాలని కోరారు. భూసీలింగ్ చట్టాన్ని సవరించి ధనవంతుల వద్ద ఉన్న భూములను పేదలకు పంచాలని అన్నారు. అన్ని రకాల భూ సమస్యలను పరిష్కరించి భూమిలేని పేదలకు ఇవ్వాలని, భూరక్షణ చర్యలను తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 21.36 లక్షల ఎకరాల భూమిని గత 60 ఏండ్లుగా పంచినట్టు సర్కారు లెక్కలు చెబుతున్నాయని వివరించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ప్రభుత్వ సీలింగ్ భూములు పంచిన దాఖలాల్లేవన్నారు. దళితులు, గిరిజనులకు మూడెకరాలు ఇస్తామని చెప్పి, మూడేండ్లు గడిచినా 10 వేల ఎకరాలకు మించి ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం భూమి కొని ఇవ్వాలంటే దశాబ్దాలైనా సాధ్యం కాదన్నారు. కోనేరు రంగారావు సిఫారసుల మేరకు తెలంగాణ రాష్ట్రంలోని భూదాన, సీలింగ్, అసైన్డ్ భూములు సుమారు 25 లక్షల ఎకరాల వరకు ఉందన్నారు. ఈ భూములు అత్యధికంగా సంపన్నులు, భూస్వాములే కబ్జా చేశారని తెలిపారు. కేవలం హైదరాబాద్ చుట్టుపక్కలే వేలాది ఎకరాల భూములను మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, భూస్వాములు స్వాధీనపరచుకొని విమర్శించారు. మియాపూర్, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, నార్నే ఎస్టేట్స్‌లాంటి వేలాది ఎకరాల భూకుంభకోణాలు బయటపడ్డాయన్నారు. అన్యాక్రాంత భూములను వెలికి తీసి ఒక్కపైసా ఖర్చు లేకుండా దళిత, గిరిజన, బీసీలు, ఎంబీసీలు, భూమి లేని ఇతర పేద కుటుంబాలకు మూడెకరాల భూమిని ఇచ్చే అవకాశం ఉందన్నారు. సమగ్ర విచారణ చేసి ఈ భూములను వెలికితీయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పేదలే ఆ భూములను ఆక్రమించుకుంటారని హెచ్చరించారు. ఆయా సమస్యలను చర్చించి కార్యాచరణను రూపొందించడానికి సెప్టెంబరు 19న రాష్ట్ర భూదస్సును నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఈ సదస్సును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

'సర్వీసు నిబంధనల కేసు పరిష్కరించాలి'

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనలపై హైకోర్టులో ఉన్న కేసును పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్‌ను శనివారం యూఎస్‌పీసీ ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించింది. అనంతరం ఎ నర్సిరెడ్డి, చావ రవి, పి మాణిక్‌రెడ్డి (టీఎస్‌యూటీఎఫ్), బి కొండల్‌రెడ్డి, బి మనోహర్‌రాజు (టీపీటీఎఫ్), ఎంఎన్ కిష్టప్ప (డీటీఎఫ్), యు పోచయ్య (ఎస్‌టీఎఫ్), కె భిక్షపతి, డి సైదులు (టీఎస్‌పీటీఏ) సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశారు.

1న సీపీఎస్ ఉద్యోగుల ఉద్యమానికి మద్దతు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం (సీపీఎస్) రద్దు కోసం వచ్చేనెల 1న ఉద్యోగుల సామూహిక సెలవుకు తెలంగాణ ప్రభుత్వ కాలేజీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు జి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

అడ్వకేట్స్ చట్ట సవరణ బిల్లు-17ను ఉపసంహరించాలి



రేపు హైకోర్టు ఎదుట నిరసన : ఐలూ రాష్ట్ర అధ్యక్షులు జి. విద్యాసాగర్

- న్యాయవాద వృత్తిని దెబ్బతీసేలా ఉంది: కె.పార్థసారథి

నవతెలంగాణ–సిటీబ్యూరో

అడ్వకేట్స్ చట్ట సవరణ బిల్లు–17ను ఉపసంహరించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జి. విద్యాసాగర్ అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్–ఐలూ ఆధ్వర్యంలో 'ప్రతిపాదిత న్యాయవాదుల చట్ట సవరణ బిల్లు–2017ను ఉపసంహరించాలి' అనే డిమాండ్‌పై విలేకరుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లును వ్యతిరేకిస్తూ ఈ నెల 28న హైకోర్టు ఎదుట భోజన విరామ సయమంలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేయనున్నామని, దీనిలో లాయర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. లా కమిషన్ ఇచ్చిన 266వ రిపోర్ట్ ప్రకారం అడ్వకేట్స్ చట్టం–1961కి సవరణలు ప్రతిపాదిస్తూ, న్యాయవాదుల చట్టం (సవరణ) బిల్లు–17ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ బిల్లు న్యాయవాదుల హక్కులను కాలరాయడమే కాకుండా, బార్ కౌన్సిల్ ఉనికినీ. అస్థిత్వాన్ని, స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా ఉందని వాపోయారు. బిల్లులో కేవలం న్యాయవాద వృత్తిని కించపర్చడమే కాకుండా బార్ కౌన్సిల్ నిర్వహణలో అనవసర జోక్యానికి తావిచ్చే అంశాలను చేర్చారని ఆందోళన వ్యక్తం చేశారు. వృత్తిపర తప్పిదాలకు వ్యక్తిగతంగా భావించి కక్షిదారులు తమకు న్యాయం జరుగలేదని భావించిన సందర్భంలో సంబంధిత న్యాయవాది నుంచి కాంపెన్‌సేషన్ క్లెయిమ్ చేసే హక్కును కక్షిదారులకు కల్పించారని తెలిపారు. దీంతో ఫైన్ రూ.3 నుంచి రూ.5 లక్షలు ఇచ్చే విధంగా చట్టంలో సవరణలు తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐలూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. పార్థసారథి మాట్లాడుతూ ప్రజలు, న్యాయవాదుల భద్రతకు భంగం కలిగించే విధంగా చట్ట సవరణ బిల్లు ఉందని అన్నారు. మల్టీ నేషనల్ కంపెనీలకు ఉపయోగపడే అంశాలను బిల్లులో చేర్చి న్యాయవాద వృత్తిని దెబ్బతీసే విధంగా కుట్రలు చేస్తున్నారని అన్నారు. అడ్వకేట్స్ కోర్టుల్లో ధర్నాలు, బాయ్‌కాట్స్, నిరసనలు తెలిపే హక్కును కూడా ఈ బిల్లు పూర్తిగా కాలరాస్తుందన్నారు. ఇది ఆర్టికల్ 19(1)ఏ రాజ్యాంగ హక్కుకు విరుద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఐలూ హైకోర్టు కన్వీనర్ ఎన్.మాధవరావు, ఐలూ రాష్ట్ర కార్యదర్శి ఆర్. నారాయణరెడ్డి, ఐలూ రాష్ట్ర కోశాధికారి శివకుమార్ గౌడ్, ఐలూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, ఎల్ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిరాజ్, ఎం. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై వచ్చేనెల 15 నుంచి ఆందోళనలు..

సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

మోడీ పాలనలో దేశవ్యాప్తంగా పెచ్చరిల్లుతున్న అవినీతిపై సెప్టెంబరు 15 నుంచి నెల రోజులపాటు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి చెప్పారు. ఈనెల 22, 23 తేదీల్లో జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ఈ మేరకు నిర్ణయించామని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డితో కలిసి సురవరం విలేకరుల సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పనామా పేపర్లు, అందులోని అంశాలపై వివరణిస్తూ ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వివిధ కార్పొరేట్ కంపెనీలకు సంబంధించిన దాదాపు రూ.81 వేల కోట్లను రద్దు చేసిన కేంద్రం.. ఇదే సమయంలో బ్యాంకింగ్ సేవల చార్జీలను ఇబ్బడి ముబ్బడిగా పెంచిందని చెప్పారు. ఇదే సమయంలో దేశంలో రోజురోజుకూ అసహనం పెరిగిపోతున్నదని చెప్పారు. మాజీ రాష్ట్రపతి హమీద్ అన్సారీ చేసిన వ్యాఖ్యలపై కూడా బీజేపీ రాద్ధాంతం సృష్టించిందని తెలిపారు. ఆయన చేసిన వ్యాఖ్యల్లో తప్పేముందని అన్నారు. దేశంలో నిజంగా అసహనం లేదా..? అని ప్రశ్నించారు. ఇటీవల పంజాబ్, హర్యానాలో చెలరేగిన హింసపై సురవరం ఈ సందర్భంగా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ విఫలమయ్యారని విమర్శించారు. అందువల్ల ఆయన తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల శాసనసభా స్థానానికి జరిగిన ఉప ఎన్నిక అత్యంత జుగుప్సాకరమని చెప్పారు.

31 జిల్లాలకు కనెక్టివిటీ రోడ్లు: తుమ్మల

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

రహదారుల అభివృద్ధి కార్యక్రమాలపై ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాల యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ముఖ్యకారదర్శి సునీల్ శర్మ, రవీందర్‌రావు, ఇ–ఎన్–సి కన్సల్టెంట్ సంస్థ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. నూతనంగా ఏర్పడిన 31 జిల్లాల్లో రోడ్ల అభివృద్ధిలో భాగంగా ఆయా జిల్లాల ముఖ్యపట్టణాలకు కనెక్టివిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర రోడ్లుభవనాల శాఖ ఆధ్వర్యంలో అసోసియేట్స్ అనే కన్సల్టింగ్ సంస్థ ద్వారా అధ్యయనం చేయించిందన్నారు.

కోటి మొక్కల సింగరేణి

నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో


హరితహారంలో భాగంగా కోటి మొక్కలు నాటాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్న సింగరేణి కాలరీస్ ఆ దిశగా పురోగతిని సాధిస్తున్నట్టు ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ఆగస్టు 24వ తేదీ నాటికి 95 లక్షల మొక్కల్ని నాటామని, మరో నాలుగైదు రోజుల్లో లక్ష్యాన్ని చేరుకుంటామని తెలిపారు. సింగరేణి ప్రాంతం విస్తరించిన 6 జిల్లాల్లోని 11 ఏరియాల్లో ఈ మొక్కలు నాటే కార్యక్రమం ఉధృతంగా జరుగుతున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణీయులు, వారి కుటుంబసభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు భాగస్వాములవుతున్నట్టు వివరించారు.

నేటి నుంచి ఉద్యాన మహోత్సవం

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఈనెల 31 వరకు నెక్లెస్‌రోడ్, పీపుల్స్‌ప్లాజాలో ఉద్యాన మహోత్సవం నిర్వహిస్తున్నట్టు వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి. పార్థసారథి చెప్పారు. శనివారం నాంపల్లిలోని హార్టికల్చర్ ఇనిస్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉద్యాన శాఖ కమిషనర్ ఎల్. వెంకట్రామ్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ ఆదాయం వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఈ ప్రదర్శనలో 114 స్టాళ్లను ఏర్పాటు చేశామని, ఉదయం 10 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శనలో పాల్గొనవచ్చుని చెప్పారు.

నవచిత్రం



రొమేనియాలో స్పైడర్

మహేష్, ఎ.ఆర్.మురుగదాస్ కాంబినేషన్‌లో ఠాగూర్ మధు సమర్పణలో ఎన్.వి.ఆర్. సినిమా ఎల్‌ఎల్‌పి, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ఎన్.వి.ప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'స్పైడర్'. రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్. ఈ చిత్రానికి సంబంధించి బ్యాలెన్స్ పాట చిత్రీకరణ రొమేనియాలో జరుగుతోంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, 'ఒక పాట మినహా చిత్రీకరణ మొత్తం పూర్తి చేసుకున్న ఈ చిత్రంలోని బ్యాలెన్స్ పాట షూటింగ్ రొమేనియాలో ఈ నెల 25న ప్రారంభమైంది. ఈ నెల 31 వరకు చిత్రీకరణ జరపటంతో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని దసరా కానుకగా సెప్టెంబర్ 27న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు. ఎస్.జె.సూర్య విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హేరిస్ జయరాజ్, సినిమాటోగ్రఫీ: సంతోష్ శివన్ ఎఎస్‌సి.ఐఎస్‌సి, ఎడిటింగ్: శ్రీకర్‌ప్రసాద్.



ఎన్టీఆర్ కుశ ఫస్ట్‌లుక్

ఎన్టీఆర్ త్రిపాత్రాభినయం చేస్తున్న చిత్రం 'జై లవకుశ'. జై, లవ, కుశ అనే మూడు పాత్రల్లో ఎన్టీఆర్ కనిపించబోతున్నారు. ఇప్పటికే విడుదలైన జై పాత్ర ఫస్ట్‌లుక్, టీజర్, లవ కుమార్ పాత్ర ఫస్ట్‌లుక్ మంచి ఆదరణ పొందాయి. ఇటీవల చిత్ర యూనిట్ రిలీజ్ చేసిన లవకుమార్ టీజర్ ఓ వైపు వైరల్ అవుతుండగానే, తాజాగా విడుదలైన కుశ పాత్ర ఫస్ట్‌లుక్ అభిమానులను ఖుషి చేసింది. వినాయక చవితి సందర్భంగా శుక్రవారం విడుదలైన కుశ పాత్ర సైతం విపరీతంగా ఆకట్టుకుంటోంది. కుశ పాత్ర తీరుతెన్నులను ప్రతిబింబించేలా ఈ లుక్ ఉందని చిత్ర వర్గాలు అంటున్నాయి. బాబీ (కె.ఎస్.రవీంద్ర) దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై కళ్యాణ్‌రామ్ నిర్మిస్తున్న విషయం విదితమే. ఇందులో ఎన్టీఆర్ సరసన రాశీఖన్నా, నివేదా థామస్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 21న ప్రేక్షకుల ముందుకు రానుంది.



యాక్షన్ సీక్వెన్స్‌లో..

అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయెల్ జంటగా వక్కంతం వంశీ దర్శకత్వంలో కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీష శ్రీధర్ నిర్మిస్తున్న చిత్రం 'నా పేరు సూర్య – నా ఇల్లు ఇండియా'. బన్నీవాసు సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రం గురించి నిర్మాత శిరీషా శ్రీధర్ మాట్లాడుతూ, 'స్టయిలీష్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న ఈ భారీ చిత్రం ప్రస్తుతం ఆర్‌ఎఫ్‌సీలో చిత్రీకరణ జరుపుకుంటోంది. ఫైట్ మాస్టర్స్ రామ్–లక్ష్మణ్ ఆధ్వర్యంలో యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. వక్కంతం వంశీని ఈచిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం చేయడం ఆనందంగా ఉంది. హీరోయిన్‌గా నటిస్తున్న అను ఇమ్మాన్యుయెల్ నటన, గ్లామర్, అర్జున్, శరత్ కుమార్ పాత్రలు అందరినీ ఆకట్టుకుంటాయి. అలాగే బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్ – శేఖర్ ఈ చిత్రానికి అద్భుతమైన బాణీలను సమకూరుస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు.

రివేంజ్ డ్రామాతో శరభ


జయప్రద, చిరంజీవి, ఆకాష్

ఆకాష్, మిస్తీ చక్రవర్తి హీరో,హీరోయిన్లుగా ఎన్.నరసింహారావు దర్శకత్వంలో ఏకెఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై అశ్వని కుమార్ సహదేవ్ నిర్మించిన చిత్రం 'శరభ'. ఈ చిత్ర ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను శనివారం చిరంజీవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఈ చిత్రానికి సంబంధించి కొన్ని క్లిప్పింగ్స్ చూసినప్పుడు ఇదొక సోషియో ఫాంటసీ చిత్రమని అర్థమైంది. దేవుడు, దెయ్యం, మనుషుల మధ్య జరిగే కథ. ఈ చిత్రాన్ని నేను చేసిన సినిమాలతో పోల్చుకున్నప్పుడు 'జగదేక వీరుడు అతిలోక సుందరి' చిత్రం గుర్తుకు వచ్చింది. ఇందులో జయప్రద తన నటనను సరికొత్తగా ఆవిష్కరించింది. ముఖ్యంగా గర్భం ధరించి పిల్లవాడిని కనే సమయంలో దెయ్యం ఆ బిడ్డను చంపేందుకు ఆమెలోకి ఆవహిస్తుంది. తనే తన బిడ్డను చంపే సమయంలో ఓ తల్లిగా ఆమె పడే స్రగుల్ ఒళ్లు గగుర్పొడిచేలా అనిపించింది. అలాగే క్లైమాక్స్‌లో ఆకాష్‌ను నరసింహస్వామి ఆవహించినప్పుడు అద్భుతంగా నటించాడు. దర్శకుడు నరసింహారావు సినిమాను ఆషామాషీగా కాకుండా బాగా తీర్చిదిద్దాడని అర్థమవుతుంది. మిస్తీ చాలా బాగా కనిపించింది. సినిమాటోగ్రఫీ, గ్రాఫిక్స్ అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద సెన్సేషనల్ హిట్ కావాలని కోరుకుంటున్నా' అని అన్నారు.
'తెలుగులో మంచి పాత్రలు చేయాలని చాలా రోజులుగా వెయిట్ చేస్తున్నాను. ఆ టైమ్‌లో ఈ చిత్ర కథతో నరసింహారావు నన్ను కలిశారు. నా రోల్ చాలా ప్రాధాన్యత కలిగి ఉండటంతో ఇది సరైన సినిమా అనిపించింది. ఇందులో నా నటనను ప్రదర్శించడానికి మంచి స్కోప్ ఉంది. నా స్నేహితుడు, నా కథానాయకుడు, అభిమానించే వ్యక్తి, లివింగ్ లెజెండ్ అయిన చిరంజీవి ఈ చిత్ర ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేయడం ఆనందంగా ఉంది. ఆయన మాపై చూపించే ప్రేమ, అభిమానమే మా చిత్రానికి గొప్ప స్ట్రెంగ్త్. ఆయనది గోల్డెన్ హ్యాండ్. ఆయన ఆవిష్కరించిన ఈ చిత్రం పెద్ద విజయం సాధిస్తుందని నమ్ముతున్నాం. ఉత్తమ సాంకేతిక విలువలతో కూడిన సోషియో ఫాంటసీ చిత్రమిది. అండర్ కరెంట్‌గా మంచి ఎమోషన్స్ ఉంటాయి. హీరోగా ఎంట్రీ ఇస్తున్న ఆకాష్‌కిది మంచి సినిమా అవుతుంది' అని జయప్రద తెలిపారు.
దర్శకుడు ఎన్.నరసింహారావు చెబుతూ, 'ఈ చిత్ర పోస్టర్‌ను చిరంజీవి విడుదల చేయడమే నా ఫస్ట్ సక్సెస్‌గా భావిస్తున్నా. పక్కా కమర్షియల్ అంశాలున్న సోషియో ఫాంటసీ చిత్రమిది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని అక్టోబర్‌లో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని చెప్పారు. 'అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే చిత్రమిది. బడ్జెట్ విషయంలో రాజీపడకుండా నిర్మించాం. ప్రేక్షకులనే కాదు, విమర్శకులను సైతం మెప్పించే చిత్రమవుతుంది' అని మరో నిర్మాత సురేష్ కపాడియా తెలిపారు. ఈ కార్యక్రమంలో హీరో ఆకాష్, హీరోయిన్ మిస్తీ, రమణ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

మూస ధోరణికి భిన్నంగా..


విజయ్‌కుమార్, బొప్పన చంద్రశేఖర్, అల్లరినరేష్, ఆది, సీతారామరాజు

అల్లరి నరేష్, నిఖిలా విమల్ జంటగా ప్రజిత్ దర్శకత్వంలో జాహ్నవి ఫిల్మ్స్ పతాకంపై బొప్పన చంద్రశేఖర్ నిర్మిస్తున్న చిత్రం 'మేడ మీద అబ్బాయి'. 'ఒరు వడక్కన్ సెల్ఫీ' అనే మలయాళ చిత్రానికిది రీమేక్. ఈ చిత్ర ట్రైలర్‌ను శనివారం హైదరాబాద్‌లో హీరో అల్లరి నరేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఈ మధ్య మీ సినిమాలు మూస ధోరణిలో ఉంటున్నాయి. కొత్తగా ప్రయత్నించండ'ని ఇటీవల చాలా మంది అన్నారు. కొత్తగా ఏం చేయాలి?ఎలా చేయాలని ఆలోచిస్తున్న క్రమంలో నేను చేసిన ఆ కొత్త ప్రయత్నమే ఈ చిత్రం. 'మీలో మరో నటుడున్నారు. ఆ నటుడిని బయటకు తీసుకురావాలి. 'నేను', 'గమ్యం' తరహాలో ఓ సినిమా చేద్దాం' అని 'కెవ్వుకేక' సమయంలో నిర్మాత బొప్పన చంద్రశేఖర్ అన్నారు. ఆయన కొత్తగా నిర్మాతగా మారిన సమయంలో ప్రయోగాత్మక చిత్రం చేయడం సరైనది కాదని ఇన్ని రోజులు వెయిట్ చేశాను. 'గమ్యం'లో గాలిశీను నవ్విస్తూనే ఏడిపిస్తాడు. అలాంటి కథ కోసం చాలా కాలంగా వెతికాను. దాదాపు మూడేండ్ల క్రితం అలాంటి కథ దొరికింది. అదే 'ఒరు వడక్కన్ సెల్ఫీ'. ఈ మలయాళ చిత్రం నాకు బాగా నచ్చడంతో రీమేక్ చేశాం. కామెడీకి థ్రిల్లర్‌ను మేళించి తెరకెక్కించిన చిత్రమది. మలయాళంలో నివిన్ పౌల్ నటించాడు. అతని బాడీ లాంగ్వేజ్‌ను అనుసరించకుండా నా పంథాలోనే చేశాను. ఫీల్ మిస్ కాకూడదనే ఉద్దేశ్యంతో మాతృకను తెరకెక్కించిన దర్శకుడినే ఈ చిత్రానికి తీసుకున్నాం. ఓ మంచి సినిమా చేశామని మనస్ఫూర్తిగా చెబుతున్నాను. సినిమాపై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. సెప్టెంబర్ 8న విడుదలవుతున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'అల్లరి నరేష్ నటించిన 'అల్లరి', 'ప్రాణం', 'గమ్యం', 'శంభో శివ శంభో' చిత్రాలు కలిస్తే ఎలా ఉంటుందో ఈ చిత్రం అలా ఉంటుంది' అని నిర్మాత చంద్రశేఖర్ తెలిపారు. హైపర్ ఆది చెబుతూ, 'ఎక్కడ కామెడీ కావాలో అక్కడ కామెడీ, ఎక్కడ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉండాలో అక్కడ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉన్న చిత్రమిది. అల్లరి నరేష్ కెరీర్‌లోనే బెస్ట్ సినిమాగా నిలుస్తుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో రచయిత విజయ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎం.ఎస్.కుమార్, సీతారామరాజు తదితరులు పాల్గొని చిత్రానికి సంబంధించి మరిన్ని విశేషాలను తెలియజేశారు.



తమిళ క్వీన్ రీమేక్‌లో..!

ఇటీవల 'నేనే రాజు నేనే మంత్రి', 'వివేకం' చిత్రాలతో తెలుగు, తమిళంలో వరుస విజయాలను అందుకున్న కాజల్ తాజాగా ఓ బంపర్ ఆఫర్ అందుకుంది. తమిళ 'క్వీన్' రీమేక్‌లో నటించబోతోంది. మహిళా ప్రధానంగా సాగే ఈ చిత్రం బాలీవుడ్‌లో 'క్వీన్'గా విడుదలై సంచలన విజయం సాధించింది. ఇందులో కంగనా రనౌత్ నటనకు జాతీయ అవార్డు సైతం దక్కింది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో రీమేక్ చేయాలని భావించారు. అందులో భాగంగా తమిళంలో తమన్నా ప్రధాన పాత్రధారిణిగా ఈ చిత్రాన్ని రీమేక్ చేయాలనుకున్నారు. కానీ తాజాగా ఆ పాత్ర కోసం కాజల్‌ను ఎంపిక చేశారు. ఈ చిత్రంలో ఎంపికైన సందర్భంగా కాజల్ తన ఆనందాన్ని పంచుకుంటూ. "క్వీన్' మాతృక నాకు చాలా బాగా నచ్చింది. ఆ చిత్రాన్ని బాలీవుడ్‌లో చాలా రోజుల క్రితం తెరకెక్కించారు. ఇప్పటి ప్రేక్షకులకు తగ్గట్టుగా కథలో మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. దక్షిణాదికి సరిపోయేలా స్క్రీన్‌ప్లేలో మార్పులు చేయాలని యూనిట్ అందరం భావించాం. కథ మాత్రం అలాగే ఉంటుంది, కానీ ట్రీట్‌మెంట్ కొత్తగా ఉంటుంది. ఈ పాత్రకు నా నిజ జీవిత స్వభావాన్ని కూడా జత చేస్తాను' అని చెప్పింది. కాజల్ ప్రస్తుతం కళ్యాణ్ రామ్ సరసన 'ఎమ్మెల్యే' చిత్రంలోను, విజయ్ సరసన 'మెర్సల్' (తెలుగులో 'అదిరింది') చిత్రంలోనూ నటిస్తోంది. అలాగే నాగార్జున నటిస్తున్న 'రాజుగారి గది 2' చిత్రంలో అతిథి పాత్రలో మెరవనుంది.

మేకింగ్ వీడియో హల్‌చల్


రజనీకాంత్, అక్షయ్‌కుమార్

ఒక భారీ సినిమా వెనుక ఎటువంటి కసరత్తులు జరుగుతాయి?, షూటింగ్ ఎలా జరుగుతుంటుందనేది ప్రేక్షకులకు ఎప్పుడూ ఆసక్తికరమే. థియేటర్‌లో సినిమా అయిపోయాక వచ్చే మేకింగ్ సన్నివేశాలను అంతే ఆసక్తిగా తిలకిస్తుంటారు. అలాంటి షూటింగ్ సన్నివేశాలను ముందే విడుదల చేస్తే సినిమాపై అది మరింత క్రేజ్‌ను పెంచటం ఖాయం. అదే రజనీకాంత్, శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న '2.0' చిత్రానికి సంబంధించిన మేకింగ్ వీడియోను విడుదల చేస్తే ఆ క్రేజ్ ఎలా ఉంటుందో వేరే చెప్పాల్సిన పనిలేదు. రజనీకాంత్, అమీ జాక్సన్ హీరో, హీరోయిన్లుగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న '2.0' మేకింగ్ వీడియోను వినాయక చవితి సందర్భంగా చిత్రయూనిట్ శుక్రవారం విడుదల చేసింది. భారీ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ, రజనీకాంత్, విలన్ పాత్ర పోషిస్తున్న అక్షయ్ కుమార్‌కు మేకప్ వేస్తున్న తీరు వంటి తదితర అంశాలతో రిలీజ్ చేసిన మేకింగ్ వీడియో ప్రస్తుతం సోషల్‌మీడియాలో విపరీతంగా హల్‌చల్ చేస్తోంది. హాలీవుడ్ టెక్నీషియన్ల ఆధ్వర్యంలో రూపుదిద్దుకుంటున్న సన్నివేశాలు, విజువల్ ఎఫెక్ట్స్, ఎ.ఆర్.రెహ్మాన్ సంగీతం స్పెషల్ ఎట్రాక్షన్స్‌గా నిలువనున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి 25న విడుదల చేయనున్నారు.

వాస్తవాల గురించి మాట్లాడండి..


గౌతమి

కొన్నేండ్ల పాటు సహజీవనం చేసిన కమల్ హాసన్, గౌతమి ఇటీవల విడిపోయిన విషయం విదితమే. 13 ఏండ్ల సహజీవనం అనంతరం తాము విడిపోతున్నట్టు గౌతమి గతేడాది నవంబర్‌లో ప్రకటించారు. అయితే మళ్ళీ ఈ ఇద్దరు కలిసి జీవితాన్ని కొనసాగించబోతున్నారని కోలీవుడ్‌లో వార్తలొచ్చాయి.
ఈ నేపథ్యంలో దీనిపై గౌతమి స్పందించారు. 'కమల్‌తో మళ్ళీ నా బంధాన్ని కొనసాగించడం లేదు. ఆయన జీవితం నుంచి పక్కకు వచ్చేశాను. కానీ మూర్ఖులు మాట్లాడుతారు. కుక్కలు మొరుగుతాయి. వాస్తవ విషయాల గురించి మాట్లాడండి' అంటూ ట్వీట్‌లో ఘాటుగా స్పందించింది. గౌతమి అనేక విజయవంతమైన తెలుగు చిత్రాల్లో నటించారు. గతేడాది కూడా 'మనమంతా' చిత్రంలో మోహన్ లాల్‌కి భార్యగా నటించి మెప్పించారు.



కళ్యాణ్ రామ్ సరసన..!

మంచి కథలు, ప్రాధాన్యత కలిగిన పాత్రలొస్తే ఇమేజ్‌కి అతీతంగా సినిమాల్లో నటించేందుకు తమన్నా వెనుకాడదని నిస్సందేహంగా చెప్పొచ్చు. 'బాహుబలి 2' తర్వాత తమన్నా ప్రస్తుతం సందీప్ కిషన్ సరసన ఓ చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రానికి బాలీవుడ్ దర్శకుడు కూనల్ కోహ్లి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా కళ్యాణ్‌రామ్ సరసన ఓ చిత్రంలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కళ్యాణ్‌రామ్ సరసన తమన్నా తొలిసారిగా నటించనుండటంతో ప్రాజెక్ట్‌పై ఆరంభంలోనే క్రేజ్ పెరిగింది. కళ్యాణ్ రామ్ హీరోగా జయేంద్ర దర్శకత్వంలో ఇటీవల ఓ చిత్రం ప్రారంభమైన విషయం విదితమే. ఈ చిత్రంలో కళ్యాణ్ రామ్ సరసన హీరోయిన్‌గా తమన్నాను ఎంపిక చేశారు. టాప్‌మోస్ట్ కెమెరామెన్ పీసీ శ్రీరామ్ సినిమాటోగ్రాఫర్ పనిచేస్తున్న ఈ చిత్రాన్ని ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్, కూల్ బ్రీజ్ సినిమాస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం తమన్నా తమిళంలో 'స్కెచ్', హిందీలో 'ఖామోషి' చిత్రాల్లో నటిస్తుండగా, కళ్యాణ్‌రామ్ 'ఎమ్మెల్యే' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయనకు జోడీగా కాజల్ నటిస్తోంది.

దర్పణం ప్రారంభం


అలెక్సియన్, తనిష్క్‌రెడ్డి, సుభాంగి పంత్

తనిష్క్ రెడ్డి, అలెక్సియస్, సుభాంగి పంత్ హీరో,హీరోయిన్లుగా వి.రామకృష్ణ దర్శకత్వంలో చిన్న శ్రీశైలం యాదవ్ ఆశీస్సులతో శ్రీ సిద్ధి వినాయక ప్రొడక్షన్స్ పతాకంపై వి.ప్రవీణ్ కుమార్ యాదవ్ నిర్మిస్తున్న చిత్రం 'దర్పణం'. ఈ చిత్ర ప్రారంభోత్సవం శనివారం రామానాయుడు స్టూడియోలో జరిగింది. హీరో,హీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి పరుచూరి వెంకటేశ్వరరావు క్లాప్ నివ్వగా, ఎన్.శంకర్ కెమెరా స్విచాన్ చేసి, గౌరవ దర్శకత్వం వహించారు. చిన్న శ్రీశైలం యాదవ్ స్క్రిప్ట్ అందించారు.
ఈ సందర్భంగా కాదంబరి కిరణ్ మాట్లాడుతూ, 'చిన్న శ్రీశైలం యాదవ్ టెక్నీషియన్లకు, ఆర్టిస్టులకు అండగా ఉంటూ ఎంతో సేవ చేస్తున్నారు. వారి కుమారుల్లో ఒకరైన ప్రవీణ్ కుమార్ యాదవ్ ఇప్పుడు నిర్మాతగా మారడం ఆనందంగా ఉంది. ఇది మంచి వినోదాత్మక చిత్రమవుతుంది' అని అన్నారు. 'శనివారం నుంచే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తున్నాం. కథ, కథనాలు నవ్యంగా ఉంటూ అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తాయి' అని నిర్మాత ప్రవీణ్ కుమార్(వెంకట్) యాదవ్ తెలిపారు. నవీన్ యాదవ్ చెబుతూ, 'దర్శకుడు మంచి టాలెంటెడ్. ఇటీవల చిన్న సినిమాను విడుదల చేయడం ఎంత కష్టమవుతుందో తెలిసిందే. ప్రభుత్వం మిని థియేటర్లను అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నా' అని చెప్పారు. 'లవ్, హర్రర్ సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. ప్రారంభం నుంచి ఎండింగ్ వరకు ప్రేక్షకుడిని సస్పెన్‌కు గురి చేస్తూ అలరిస్తుంది. ఈ చిత్రాన్ని సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని దర్శకుడు రామకృష్ణ అన్నారు. 'ఈ చిత్రంలో నటించే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు' అని హీరో,హీరోయిన్లు తెలిపారు.



సచ్‌దేవ్ మృతికి ఏఐటీయూసీ సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి డీఎల్ సచ్‌దేవ్ మృతిపట్ల ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సమితి తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. శనివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సచ్‌దేవ్ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకరరావు మాట్లాడుతూ.. హర్యానాలో కార్మికోద్యమాన్ని బలోపేతం చేయటంలో సచ్‌దేవ్ కీలకపాత్ర పోషించారని చెప్పారు. గుర్గావ్ పారిశ్రామిక ప్రాంతంలో ఆయన శ్రామికులందర్నీ సంఘటితపరిచి ఉద్యమాలకు రూపకల్పన చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు టి.నరసింహన్ ఉపాధ్యక్షులు ప్రేం పావని తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్‌పీఆర్‌డీ ద్వితీయ మహాసభ


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభ ఆదివారం సంగారెడ్డి పట్టణంలో ప్రారంభం కానుంది. ఈ మహాసభ రెండు రోజులపాటు కొనసాగుతుందని వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభ సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు సంగారెడ్డి చౌరస్తాలో బహిరంగ సభను నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీపీఐ (ఎం) ఎమ్మెల్యే సున్నం రాజయ్య, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఈ సభలో ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. సోమవారం స్థానిక పోతిరెడ్డిపల్లిలో నిర్వహించే ప్రతినిధుల సభలో ఎన్‌పీఆర్‌డీ జాతీయ ఉపాధ్యక్షులు జీఎన్ నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొంటారని వివరించారు.

వికలాంగ హక్కుల చట్టంపై ముసాయిదా కమిటీ

2016 వికలాంగ హక్కుల పరిరక్షణ చట్టం, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను పరిగణలోకి తీసుకొని ముసాయిదా నిబంధనల రూపకల్పనకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఒక శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.

భారీ వర్షంతో పరేషాన్



(మొదటిపేజీ తరువాయి)

జీహెచ్ఎంసీ అధికారులు అందజేశారు.

హుస్సేన్‌సాగర్‌కు పోటెత్తిన వరద... పెరిగిన నీటి మట్టం

హుస్సేన్‌సాగర్‌కు భారీగా వర్షపునీరు వచ్చి చేరుతుండడంతో నీటిమట్టం పెరిగింది. హుస్సేన్‌సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 513.41 అడుగులు కాగా, ప్రస్తుతం వర్షపునీరు చేరికతో 513.10 అడుగులకు చేరింది. 1200 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని, బయటకు 600 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు.

ఇండ్లను ముంచెత్తిన నురగ

కూకట్‌పల్లి ప్రాంతంలో కాలుష్య వ్యర్థాలను వర్షపు నీటిలో వదలడం వల్ల నురగ ముంచెత్తింది. కూకట్‌పల్లి ధరణినగర్‌కు సమీపంలో గల పరికి చెరువు నుంచి భారీగా కాలుష్యపు నురగ వెలువడుతోంది. పెద్దఎత్తున వస్తున్న ఈ నురగతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రాలేకపోయారు. నురగ నుంచి రక్షించాలంటూ ఆ ప్రాంత ప్రజలు అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులు రంగంలోకి దిగి చర్యలు చేపట్టారు. కూకట్‌పల్లి పరిసర ప్రాంతాలైన బాలానగర్, జీడిమెట్ల తదితర ప్రాంతాల్లో ఉన్న పార్మస్యూటికల్ కంపెనీలు వ్యర్థాలను ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు తరలించకుండా వర్షాలు వచ్చినప్పుడు బయటకు వదులుతున్నాయి. దీంతో పెద్దఎత్తున నురగ రావడంతో చెరువులు, కుంటలు కలుషితమవుతున్నాయి. గతంలో ఈ సమస్యను ప్రజాప్రతినిధుల దష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాల్లో ఇలా...

భారీ వర్షంతో మెదక్ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి ఆయా ప్రాంతాల్లో పెంకుటిండ్లు కూలాయి. సిద్దిపేట జిల్లాలో ఆయా మండలాల్లో ముసురు పడింది. సంగారెడ్డి జిల్లాలో పలు చోట్ల వర్షం పడింది. పటాన్‌చెరు, రామచంద్రాపురం మండలాల్లో ఎక్కువ వర్షపాతం నమోదైంది. నిజామాబాద్ జిల్లాలో మోస్తారు వర్షం కురిసింది. జక్రాన్‌పల్లి మండలంలోని కలిగోట్ గ్రామంలో శిథిలావస్థలో ఉన్న మూడు నివాస గృహాలు కూలిపోయాయి. కామారెడ్డి, ఖమ్మం, నల్లగొండ, భూపాలపల్లి, కరీంనగర్, ఖమ్మం, భద్రాది, తదితర జిల్లాల్లోనూ వర్షం పడింది.

భోజనం వికటించి 40 మంది విద్యార్థులకు అస్వస్థత

నవతెలంగాణ - జైనూర్

మధ్యాహ్న భోజనం వికటించి 40 మంది విద్యార్థులు సహా ఉపాధ్యాయుడు, అటెండర్ అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగింది. ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం... రోజువారీగానే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించారు. వారితోపాటు ఉపాధ్యాయులు, అటెండర్ కూడా తిన్నారు. కొద్దిసేపటికే తలతిరుగుతోందని కొందరు విద్యార్థులు ఉపాధ్యాయులకు తెలిపారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను వెంటనే జైనూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నరేష్, అటెండర్‌కు కూడా వాంతులు, విరేచనాలు అవ్వడంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఫుడ్‌పాయిజన్ అయిందని వైద్యాధికారి అరుణ తెలిపారు. ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉందన్నారు. మండల విద్యాధికారి జాధవ్‌రమేష్, వైస్‌ఎంపీపీ షేక్ రషీద్, జైనూర్ సీఐ నాగేంద్ర, సిర్పూర్(యు) ఎస్సై రామారావ్ ఆస్పత్రికి వచ్చి విద్యార్థులను పరామర్శించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు రాజీవ్ స్వగృహ ఇండ్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాజీవ్ స్వగృహ ఇండ్లను ప్రభుత్వ ఉద్యోగులకు విక్రయించనున్నట్టు గృహ నిర్మాణ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. ఇండ్లను ఆన్‌లైన్ ద్వారా విక్రయించేందుకు శనివారం సచివాలయంలో ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌తో కలిసి రాజీవ్ స్వగృహ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ లాంటి మహానగరంలో సొంతింటి కలను ప్రభుత్వ ఉద్యోగులు సాకారం చేసుకోవాలని తెలిపారు. సీఎం ఆదేశాలకు మేరకు అధిక సబ్సిడీ ఇచ్చి ఫ్లాట్లను విక్రయిస్తామన్నారు. త్వరలోనే ఆన్‌లైన్ ద్వారా ఫ్లాట్ల విక్రయాలు చేపడుతామని చెప్పారు. సీఎస్ ఎస్పీ సింగ్ మాట్లాడుతూ గృహ నిర్మాణ శాఖ నిర్మించిన ఇండ్లను కొనుగోలు చేయడం వల్ల భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు రావని తెలిపారు. పారదర్శకంగా ఫ్లాట్లను విక్రయిస్తామని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో నిర్మించిన రాజీవ్ స్వగృహ ఇండ్ల విక్రయాలు జరుగకపోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై రూ. 1069 కోట్ల భారం పడిందన్నారు. ఇప్పటికీ రూ.670 కోట్ల రుణాన్ని తీర్చామని, త్వరలోనే మిగిలిన రూ.400 కోట్ల అప్పును తీర్చనున్నట్టు ఆయన వెల్లడించారు.

'ఆర్ఎంపీ, పీఎంపీలను ప్రోత్సహించొద్దు'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్ఎంపీ, పీఎంపీలను ప్రోత్సహించవద్దని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ సంజీవ్ సింగ్ యాదవ్, డాక్టర్ శ్రీనివాసులు గట్టు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐఎంఏ ప్రతినిధి బృందం శనివారం రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రాజేశ్వర్ తివారీని కలిసి వినతిపత్రం సమర్పించింది.

డ్వాక్రా సంఘాలకు రూ.1810 కోట్ల రుణాలు

- 'స్త్రీ' నిధి పాలకమండలి నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల్లో పనిచేస్తున్న మహిళలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 1810 కోట్లు రుణాలుగా ఇవ్వాలని 'స్త్రీ'నిధి బ్యాంకు పాలకమండలి నిర్ణయించింది. ఇందులో ఇప్పటికే రూ.450 కోట్లు పంపిణీ చేసినట్టు ప్రకటించింది. శనివారం హైదరాబాద్‌లో 'స్త్రీ' నిధి బ్యాంకు అధ్యక్షురాలు ఎస్. అనిత అధ్యక్షతన ఆ బ్యాంకు పాలకమండలి సమావేశం జరిగింది. ఇందులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, సెర్ప్ సీఈవో పౌసుమి బసు, 'స్త్రీ' నిధి బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ విద్యాసాగర్‌రెడ్డి, అధికారులు టీసీఎస్ రెడ్డి, ఇతర మహిళా డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలకమండలి పలు నిర్ణయాలు చేసింది. రూ.1810 కోట్ల రుణ ప్రణాళికకు తోడుగా మరో రూ. 500 కోట్ల రుణాలను అదనంగా ఇవ్వడానికి నిర్ణయించింది. గత ఆరేండ్లుగా అమల్లో సాఫ్ట్‌వేర్‌ను సైతం తనిఖీ చేయాలని సూచించింది. అవసరమతై మార్పులు, చేర్పులు చేసేందుకు అనుమతించింది. రుణాల జారీలో నల్లగొండ, సూర్యాపేట, మేడ్చల్, కరీంనగర్ జిల్లాలు ముందంజలో ఉన్నట్టు 'స్త్రీ' నిధి మేనేజింగ్ డైరెక్టర్ విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. పాలకమండలి సమావేశం అనంతరం విలేకర్లతో మాట్లాడారు. అర్బన్‌లో ఉన్న సమస్యలను అధ్యయనం చేసి, పరిష్కారాలను సూచించేందుకు నివేదిక సమర్పించాలని మేనేజింగ్ కమిటీ సూచించిందని తెలిపారు. బిజినెస్ కరస్పాండెంట్ల అవసరాల కోసం సాంకేతిక సహకారం పొందేందుకు రూ. 2.20 లక్షలు ఖర్చుచేసేందుకు నిర్ణయించినట్టు చెప్పారు. ఇప్పటికే తొమ్మిది ప్రాంతీయ మేనేజర్ పోస్టులకుగాను మరో 17 మంది ఆర్ఎంలను నియమించనున్నామన్నారు.

రూ.100 కోట్లపైబడిన కార్యకలాపాలు నిర్వహిస్తున్న నిజామాబాద్, కరీంనగర్, సిద్దిపేట, నల్లగొండ జిల్లాలకు ప్రత్యేకంగా ఒక్కొక్క ప్రాంతీయ మేనేజర్ పోస్టును మంజూరు చేసినట్టు చెప్పారు.

కనీస వేతనం కోసం ఐక్య ఉద్యమం

- సెప్టెంబర్ 19న రాష్ట్రవ్యాప్త సమ్మెకు సమాయత్తం: సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు



మాట్లాడుతున్న చుక్క రాములు

నవతెలంగాణ-హన్మకొండ

కనీస వేతనం రూ.18వేల కోసం కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. సెప్టెంబర్ 19న రాష్ట్రవ్యాప్త సమ్మెకు సమాయత్తం కావాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ రెండు రోజుల సమావేశాలు వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని కళ్యాణి ఫంక్షన్‌హాల్‌లో శనివారం రాములు అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. నిత్యావసర ధరలు రోజురోజుకూ ఆకాశాన్నంటుతుంటే కార్మికుల వేతనాలు మాత్రం పెరగడం లేదని అన్నారు. పారిశ్రామిక రంగం ఉత్పత్తి రంగాల్లో కార్మికులు అభివృద్ధి చేస్తూ కోట్లాది రూపాయలు ప్రభుత్వానికి సంపాదించి పెడుతుంటే.. కార్మికులను మాత్రం ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కనీస వేతనాల పెంపు జీవోలపై సంతకాలు చేయకుండా కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. ఐదేండ్ల నుంచి మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు 100 శాతం పెరిగి కార్మికులు నానా అవస్థలు పడుతుంటే, అందులో కొంతయినా వేతనాలు పెంచలేదన్నారు. రాష్ట్రంలో కార్మికశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి కనీసం కార్మికుల పక్షాన ఆలోచించడం లేదని అన్నారు. కార్మికుల వేతనాల పెంపు విషయమై సెప్టెంబర్ 19న రాష్ట్ర వ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె చేయనున్నట్టు తెలిపారు. ఉద్యోగ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు.

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ప్రతిరోజూ దేశభక్తి, జీడీపీ, దేశ అభివృద్ధి అంటూ మాట్లాడటం తప్పితే కార్మిక లోకానికి చేసిందేమీ లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకు, స్టీలు, బొగ్గు తదితర సంస్థల్లో లక్ష కోట్లు లాభాలు ఆర్జిస్తున్నా కార్మికుల అభివృద్ధి కోసం ఏ ప్రభుత్వం ఆలోచించడం లేదన్నారు. రక్షణరంగంలోకి విదేశీ పెట్టుబడిదారులను ఆహ్వానించడం ప్రమాదకరమన్నారు. వ్యవసాయ, చిన్న చిన్న పరిశ్రమలు జీఎస్టీ వల్ల భయభ్రాంతులకు లోనవుతున్నట్టు తెలిపారు. నవంబర్ 9,10,11న పార్లమెంట్ ఎదుట మహాధర్నా చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జాతీయ నాయకులు ఆర్.సుధాభాస్కర్, పి.రాజారావు, పాలడుగు భాస్కర్, ఎస్.రమ, జయలక్ష్మి, జే వెంకటేష్, కె యాదానాయక్, వంగూరి రాములు, వీఎస్ రావు, ఎన్ కిరణ్, కోటం రాజు, బి మధు, జె మల్లికార్జున్, వరంగల్ అర్బన్ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

16 ఏండ్లయినా తీర్పు అమలు చేయరా?

- తెలంగాణ సర్కారును నిలదీసిన హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగు సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని పరిపాలనా ట్రిబ్యునల్ ఆదేశాలిచ్చి 16 ఏండ్లయినా నేటికీ అమలు చేయకపోవడం పట్ల తెలంగాణ సర్కారుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలా చేయడం న్యాయవ్యవస్థను నిర్లక్ష్యం చేయడమేనని అవుతుందని న్యాయమూర్తులు సివి నాగార్జునరెడ్డి, జి శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ శనివారం వ్యాఖ్యానించింది. వైద్య ఆరోగ్య శాఖలో తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ శ్రీనివాసరావు మరో 20 మంది 1999లో ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో కేసు నమోదు చేశారు. మిగిలిన సిబ్బందితోపాటుగా కనీస వేతనాలు చెల్లించాలని, వారి సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని ట్రిబ్యునల్ 2001లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. నేటికి 16 ఏండ్లయినా ట్రిబ్యునల్ ఆదేశాలు అమలు చేయకపోవడంతో బాధిత పిటిషనర్లు హైకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ట్రిబ్యునల్ ఆదేశాల్ని రెండు తెలుగు రాష్ట్రాలు ఖాతరు చేయకపోవడంపై బెంచ్ ఆందోళన వ్యక్తం చేసింది. కింది కోర్టులో కేసు గెలిచినా ఫలితాలు అందుకోలేని దుస్థితిలో ఉండే పరిస్థితుల్ని ప్రభుత్వం కల్పించకూడదని బెంచ్ వ్యాఖ్యానించింది. ట్రిబ్యునల్ తీర్పుతో అభ్యంతరాలు లేవనెత్తుతూ అప్పీల్ చేయకపోతే ఆ తీర్పులు అమల్లో ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. అన్ని శాఖల్లోని కేసులపై సమీక్ష నిర్వహించి నిర్ణీత గడువులోపు ట్రిబ్యునల్ ఆదేశాలను అమలు చేస్తామని లిఖితపూర్వక హామీ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. విచారణను 28వ తేదీకి వాయిదా వేసింది.

చీటికిమాటికి రావొద్దు

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ నిర్మాణం తదితర అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. భూ సర్వే గురించి వారికి సీఎం సుదీర్ఘంగా వివరించారు. వచ్చే ఏడాది నుంచి ప్రవేశ పెట్టనున్న రైతులకు పెట్టుబడి పథకం.. అర్హులైన రైతులకు అందాలంటే.. భూరికార్డుల ప్రక్షాళన పారదర్శకరంగా జరగాలని సీఎం తెలిపారు. ఈ సర్వే ద్వారా బినామీలకు అడ్డుకట్టవేయబోతున్నట్టు చెప్పారు. భూరికార్డుల ప్రక్షాళనపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు సెప్టెంబర్ 1 నుంచి 9 వరకు గ్రామస్థాయిలో రైతు సమన్వయ కమిటీల ఏర్పాటు, ఆ తరువాత 10 నుంచి 15 వరకు మండలాల్లో రైతు సంఘాలతో సదస్సులు, సెప్టెంబర్ 17 నుంచి పూర్తిస్థాయిలో భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం జరుగుతుందన్నారు. 90 రోజుల్లో(3 నెలలు) పూర్తిచేయాలని నిర్ణయించామని, అప్పటివరకు ప్రజాప్రతినిధులు నియోజకవర్గాల్లోనే ఉండాలని ఆదేశించారు. భూ సర్వేలో ప్రతి మూడు గ్రామాలకు ఒక అధికారుల బృందం ఉంటుందని, ఒక్కో ప్రజాప్రతినిది తలా మూడు గ్రామాలు యూనిట్‌గా పనిచేయాలని కోరారు. భూ సర్వే సమయంలో రైతుల నుంచి కొంత ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉన్నందున రైతుల సంఘాలను సమన్వయపరిచే బాధ్యతను భుజానికెత్తుకోవాలని ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు.

ఏడాదిన్నర ముందే ఎన్నికల ప్రచారం

ఏడాదిన్నర ముందే టీఆర్ఎస్‌పార్టీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టబోతుంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరగబోయే భూ సర్వే, రైతు పథకాలను ఆధారం చేసుకుని ఎన్నికల ప్రచారానికి ఏర్పాట్లు సిద్ధం చేసింది. భూ సర్వేలో ప్రతి మూడు గ్రామాలకు అధికారుల బృందం ఉన్నా, దానితో పాటు సమాంతరంగా ఒక్కో ప్రజాప్రతినిధి తలా మూడు గ్రామాలను యూనిట్‌గా తీసుకునే పనిచేసేలా వ్యూహం రచించింది. ఇందులో ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు ఉంటారు. కార్పొరేషన్ చైర్మెన్లు, సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించనున్నారు. మొత్తం పార్టీ కార్యకర్తలను, నేతలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయబోతున్నారు. ప్రభుత్వం చేయబోయే ఈ కార్యక్రమాలను పార్టీకి అనుకూలంగా మలచుకుని, ఓటర్లుగా తమవైపునకు తిప్పుకునేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాట్లు చేయడం గమనార్హం.

ఈ సారి సర్వేలు లేవు..

సీఎం సమావేశం అనగానే ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎన్నికల సర్వేల గురించి ఆలోచించారు. తమ నియోజకవర్గాల గురించి సర్వేలో ఏమొచ్చిందో సీఎం వివరిస్తారని అనుకున్నారు. అయితే భూ సర్వే, రైతు సమైఖ్యల గురించే చర్చించడంతో నిరాశకు లోనయ్యారు. తమ కంటే సీఎం సర్వేలో వాస్తవాలు ఉంటాయని ఆశపడ్డారు. సమావేశం ముగిసిన తర్వాత వారంతా విలేకరులు కనపడగానే 'ఈ సారి సర్వేలు లేవని చెప్పడం గమనార్హం. హైదరాబాద్ రావొద్దన్నారు. డిసెంబర్ దాకా నియోజకవర్గాల్లోనే ఉండమన్నారు. ఏదైనా ముఖ్యమైన పని ఉంటేనే రావాలని చెప్పారు.' ఇవే ముఖ్యమైన అంశాలని చెప్పుకుంటూ వెళ్లిపోయారు.

రాష్ట్ర ప్రభుత్వానివి మాటలే తప్ప చేతల్లేవు...

- ప్రాణహిత-చేవెళ్ల విషయంలో అలసత్వం: కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ

నవతెలంగాణ- తాండూరు

తెలంగాణ అభివృద్ధి అంటూ రాష్ట్ర ప్రభుత్వం మాటలు చెప్పడం కాదు చేతల్లో చూపాలని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనాశాఖ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా తాండూరు మండల పరిధిలోని జిన్గుర్తి గ్రామంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో కోట్ల రూపాయలు దుర్వినియోగం చేస్తోందన్నారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు విషయంలో అలసత్వం సరికాదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు పది లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు రూపకల్పన చేశారని, రీడిజైన్ చేయడంతో మరో రూ.12వేల కోట్లు అదనపు భారం పడిందని చెప్పారు. శ్రీశైలం నికర జలాలు తీసుకొచ్చే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గోదావరి జలాలను రాష్ట్రం వినియోగించుకునేందుకు సీఎం కేసీఆర్ చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. పేద జిల్లాలైన పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ ప్రాంత రైతులను ఆదుకొనేందుకు ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. రాష్ట్రంలోని నిరుపేదలకు నీడనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 80వేల ఇండ్లు మంజూరు చేసిందని చెప్పారు. తాండూరు కార్మికుల కోసం రూ.100 కోట్లతో వంద పడకల ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మించే చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

31 నుంచి డీసెట్ రెండోవిడత కౌన్సెలింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (డీసెట్) రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 31 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు డీసెట్ కో కన్వీనర్ బి శేషుకుమారి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 31 నుంచి వచ్చేనెల 6వ తేదీ వరకు అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లు నమోదు చేయాలని తెలిపారు. వచ్చేనెల 12న సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. వచ్చేనెల 12 నుంచి 14వ తేదీ వరకు అభ్యర్థులు ఫీజు చెల్లించాలని కోరారు. వచ్చేనెల 12 నుంచి 15వ తేదీ వరకు అభ్యర్థులు కేటాయించిన కాలేజీల్లో చేరాలని తెలిపారు. అభ్యర్థులు ఎక్కువ ఆప్షన్లు నమోదు చేయాలని సూచించారు. తొలివిడతలో సీటు పొందిన అభ్యర్థులూ కాలేజీ మారాలనుకుంటే వెబ్‌ఆప్షన్లు నమోదు చేసేందుకు అవకాశముందని పేర్కొన్నారు.

బోరు బావుల ప్రమాదాల నివారణకు చెక్

- మార్గదర్శకాలను హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పనిచేయని బోరు బావుల మూలంగా ఉత్పన్నమయ్యే ప్రమాదాల నివార ణకు తెలంగాణ సర్కార్ నడుం బిగించింది. గతంలో సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా అమలు చేయబోయే మార్గదర్శకాలను ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టుకు తెలంగాణ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి సమర్పించారు. వికారాబాద్‌తోపాటు ఆయా జిల్లాల్లో బోర్లలో పడి చిన్నారులు మతి చెందిన తరువాత సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ న్యాయవాది బుద్ధారపు ప్రకాశ్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంలో ప్రభుత్వం అమలు చేయబోయే మార్గదర్శకాల్ని హైకోర్టుకు తెలియజేశారు. వికారాబాద్ జిల్లాలో బాలికను రక్షించేందుకు 60 గంటలు శ్రమించినా ఫలితం లేకపోయిందని, బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం, పిల్లలకు ఉచిత విద్య, కటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చామని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. బోరు యజమానిపై కేసు పెట్టామని, మూసి వేసిన బోరు మూతను ఆ యజమాని చెప్పాపెట్టకుండా తీసినట్టు హైకోర్టుకు విన్నవించారు. వర్షాలు పడటంతో మూత తొలగించారని తెలిపారు. పనిచేయని బోర్లకు మూతలు బిగిస్తున్నామని, ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే మూడు వేల బోర్లకు మూతలు పెట్టినట్టు వివరించారు. ఈమేరకు కొన్ని నిబంధనలను అమలుచేస్తున్నట్టు తెలియజేశారు. బోర్లు తవ్వే రిగ్‌ల కంపెనీలు విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని. ఆ రిజిస్ట్రేషన్‌ను రెండేళ్లకోసారి రెన్యువల్ చేసుకోవాలని, రిగ్ యజమాని ప్రభుత్వం నుంచి రిజిస్ట్రే షన్ ధ్రువపత్రాన్ని పొంది ఉండాలని చెప్పారు. రిజిస్ట్రేషన్ చేయించుకోకపోతే రూ.లక్ష వరకు జరిమానా చెల్లించాల్సి వస్తుందని, అప్పటికీ రిగ్‌యజమాని రిజిస్ట్రేషన్‌ను పునరుద్ధరణ చేయించుకోకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలవే కాకుండా ప్రయివేటు వ్యక్తుల బోర్లు తవ్వాలంటే మండల తహసీల్దార్ అనుమతి పొందాల్సి ఉంటుందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అనుమతి తీసుకున్నదీ లేనిదీ అధికార ధ్రువపత్రాన్ని చూసిన తర్వాతే రిగ్ యజమాని బోరు తవ్వాలని. బోరు తవ్విన మూడు రోజుల్లో సంబంధిత తహసీల్దార్‌కు లిఖితపూర్వకంగా తెలియజేయాలని చెప్పారు. బోరు తవ్వకాన్ని సదరు తహసీల్దార్ పర్యవేక్షించాల్సి ఉటుందని, బోర్లకు మూత వేయ కపోతే బోరు యజమానిపై తహసీల్దార్ చర్యలు తీసుకోవాలని, పనిచేయని బోర్ల గురించి జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన సిబ్బంది సర్వే చేయాలని, పనిచేయని బోర్ల ను వారంలోగా మూసివేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మూయ కపోతే బోరు యజమానిపై రూ.50 వేల జరిమానా, క్రిమినల్ కేసులను నమోదు చేయాలని ఆదేశించింది.

మాట్లాడనియ్యలేదు

(మొదటిపేజీ తరువాయి)

సేకరణ?' అని సిద్దిపేటలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సభలో వేములఘాట్ నిర్వాసితులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాలలో వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన వారిని పోలీసులు అడ్డుకున్నారు. భూపాలపల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ సభ పోలీసుల నిర్బంధం నడుమ జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన వయోలా గార్డెన్‌లో శనివారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. జాయింట్ కలెక్టర్ పద్మాకర్, ఆర్డీఓ ముత్యంరెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టు సీఈ, పర్యావరణ పరిరక్షణ అధికారి హాజరయ్యారు. ముంపు గ్రామాల నుంచి అనేక మంది బాధితులు డీసీఎం, ఆటోల్లో తరలివచ్చారు. కార్యక్రమానికి ముందే టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాల్‌లో తిష్టవేశారు. దీంతో నిర్వాసితులకు ఎక్కడో చివర నిలబడ్డారు. తమ భూములు ఇవ్వబోమని చెప్పేందుకు వచ్చిన 70 మంది వేములఘాట్ నిర్వాసితులను పోలీసులు అరెస్టు చేసి నంగునూరు మండలం రాజ గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇంత నిర్బంధం మధ్య ప్రజాభిప్రాయ సేకరణ ఎందుకని నిర్వాసితులు ప్రశ్నించారు. ప్రభుత్వం నియమించిన కమిటీ 500 పేజీల నివేదికను ఇస్తే కేవలం 10 పేజీల నివేదికను మా గ్రామంలో అందుబాటులో ఉంచారని, ఇందులో ఏ మతలబ్ ఉందని నిలదీశారు. అటవీ శాఖ అనుమతి ఎప్పుడిచ్చిందో, గ్రామ సభలు ఎప్పుడు నిర్వహించారో రికార్డులు చూయించాలన్నారు. 'ఏ అధికారి మా గ్రామాలకు వచ్చి అభిప్రాయం సేకరించారో చూపెట్టాలి' అని వేములఘాట్ నిర్వాసితుడు డిమాండ్ చేయడంతో అతని మైక్ లాక్కున్నారు. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వాలంటూ నినాదాలు చేసిన 60 మందిని అదుపులోకి తీసుకుని చిన్న కోడూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొందరిని మాట్లాడనివ్వకుండా బయటకు పంపేశారు. దీంతో వారు రాస్తారోకోకు దిగగా అదుపులోకి తీసుకుని పలు ఠాణాలకు తరలించారు. తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి, నిర్వాసితుల సంఘం జిల్లా కన్వీనర్ గొడ్డుబర్ల భాస్కర్, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నక్కల యాదవరెడ్డి, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతుండగా టీఆర్ఎస్ కార్యకర్తలు వారిని మాట్లాడకుండా గొంతు నొక్కే ప్రయత్నం చేశారు. పర్యావరణంపై మాట్లాడటం లేదంటూ అధికారులు వంటేరు మాట్లాడుతుండగా మైక్ బంద్ చేశారు. దీంతో వంటేరు ప్రతాప్‌రెడ్డికి అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. బాధితులకు తక్కువ సమయం కేటాయిస్తూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు ఎక్కువ సమయం కేటాయించారని నాయకులు వాపోయారు. ఈ సందర్భంగా ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామలింగారెడ్డి, సతీశ్ కుమార్, ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్, రోడ్ల అభివృద్ధి కమిటీ చైర్మెన్ నర్సారెడ్డి, భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, చిట్టి దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ...ఈ ప్రాజెక్టు మూలంగా ఎలాంటి పర్యావరణ సమస్యలు లేవని చెప్పారు. ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేస్తే ఇక్కడి రైతులు బాగుపడుతారని తెలిపారు.

వినతిపత్రం ఇవ్వబోతే అరెస్టులు...

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాలలో ప్రజాభిప్రాయ సేకరణ కలెక్టర్ కృష్ణభాస్కర్ అధ్యక్షతన జరిగింది. ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న నిర్వాసితుల సంగతేంటని కాంగ్రెస్, టీడీపీ నాయకులు ప్రశ్నించారు. కలెక్టర్ కృష్ణభాస్కర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు సభావేదికపైకి వెళ్లారు. పోలీసులు వారిని అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే ప్రజాభిప్రాయ సేకరణను మమ అనిపించారు.

భూపాలపల్లిలో నిర్బంధం నడుమ...

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కలెక్టర్ మురళి అధ్యక్షతన ఏఎస్ఆర్ గార్డెన్‌లో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సభ వద్దే ఎస్పీ సహా జిల్లా పోలీసు యంత్రాంగమంతా తిష్టవేసింది. నిర్వాసితులను పోలీసులు పలుచోట్ల క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోనికి పంపారు. మధ్యలో వచ్చిన రైతులకు లోనికెళ్లేందుకు అనుమతి వ్వకపోవటంతో వర్షంలోనే నిలబడ్డారు. మరోవైపు ప్రజాభిప్రాయ సేకరణ కాస్త టీఆర్ఎస్ కార్యకర్తల అభిప్రాయ సభగా మారిపోయింది. నిర్వాసితుల సంఘం యువజన కమిటీ అధ్యక్షులు శ్రావణ్‌రెడ్డిని పోలీసులు బయటే నిలిపేశారు. నిర్వాసితులు ఉండే చోట అభిప్రాయ సేకరణ చేయకుండా భూపాలపల్లి జిల్లాకేంద్రంలో ప్రజాభిప్రాయ సేకరణ చేయడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. 'కాళేశ్వరం ప్రాజెక్టు కట్టొద్దని చెప్పట్లేదు. కానీ, కొన్ని అభ్యంతరాలున్నాయి. దానిపై స్పష్టత కావాలి..... రైతులకు న్యాయం చేయాలి' అంటూ మాజీ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతుండగా... టీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. దీంతో కాసేపు కాంగ్రెస్, టీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం జరిగింది.

పోలీసు కాంప్లెక్స్‌పై ఉగ్రదాడి

(మొదటిపేజీ తరువాయి)

ఉగ్రవాదులు పెద్ద ఎత్తున ఆయుధాలతో ప్రవేశించారు. వచ్చిరాగానే కాల్పులు జరుపుతూ పోలీసు కుటుంబాలు నివసిస్తున్న ఇండ్లలోకి వారు చొరబడ్డారు. అయితే బలగాలు అప్రమత్తం ఎదురు కాల్పులు ప్రారంభించాయి. ఉగ్రవాదుల చెర నుంచి దాదాపు 25 పోలీసు కుటుంబాలను జవాన్లు సురక్షితంగా విడిపించారు. భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్టు జనరల్ ఆఫీసర్ కమాండింగ్ జెఎస్ సంధూ వెల్లడించారు. మరో ముగ్గురు ఉగ్రవాదులు క్వార్టర్స్‌లోని నక్కి ఉన్నట్టు ఆయన వివరించారు. ఇద్దరు స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు కనిపించడం లేదని, వారు చనిపోయారా? లేక ఉగ్రవాదుల వద్ద బందీగా ఉన్నారా? అన్నది తెలియాల్సి ఉందన్నారు. గాయపడిన పోలీసులను ఆస్పత్రికి తరలించామని తెలిపారు. మరోవైపు దాడికి తమదే బాధ్యత తమదే అంటూ జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ ప్రకటించింది.

ముగ్గురు పాక్ రేంజర్లు మృతి

నియంత్రణ రేఖ వద్ద అదే పనిగా కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనకు పాల్పడుతున్న పాకిస్థాన్‌కు భారత సైన్యం గట్టి సమాధానమిచ్చింది. శనివారం రెండు చోట్ల బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) జవాన్లు జరిపిన కాల్పుల్లో ముగ్గురు పాక్ రేంజర్లు మృతి చెందారు. ఆర్ఎస్‌పురా సెక్టార్ వద్ద, సుందర్బనీలోని దేవ్రా గ్రామంలో జవాన్లు కాల్పులు జరిపిన ఘటనలో ముగ్గురు పాక్ రేంజర్లు హతమయ్యారని ఐజీ రామ్ అవతార్ వెల్లడించారు.

అమెరికా చేతిలో.. ఆధార్ గుట్టు

(మొదటిపేజీ తరువాయి)

గానీ, దాని మధ్యవర్తి ఏజెన్సీలకుగానీ డేటాబేస్ సరఫరా కాదని అధికార వర్గాలు తెలిపాయి. భారత అధికార వర్గాల వివరణను వికీలీక్స్ వెబ్‌సైట్ తోసిపుచ్చింది. బయోమెట్రిక్ డేటాను సేకరించేందుకు సీఐఏలో ఆఫీస్ ఆఫ్ టెక్నికల్ సర్వీసెస్(ఓటీఎస్) అనే మరో విభాగం ఉన్నదని వికీలీక్స్ తెలిపింది. డేటా సేకరణ కోసం ఎక్స్‌ప్రెస్ లేన్ అనే కోవర్ట్ కలెక్షన్ టూల్‌ను ఓటీఎస్ ఉపయోగిస్తున్నదని వికీలీక్స్ తన వెబ్‌సైట్ ద్వారా తెలిపింది. ఓటీఎస్ కూడా క్రాస్‌మ్యాచ్ ఉత్పత్తులనే తన సైబర్ దొంగతనాల కోసం ఉపయోగిస్తున్నట్టు వికీలీక్స్ తెలిపింది. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) ఆధార్ డేటాబేస్ కోసం సాంకేతికత సరఫరాదారుగా క్రాస్‌మ్యాచ్‌కు 2011లో ధ్రువీకరణ ఇచ్చినట్టు జాతీయ మీడియా వర్గాలు చెబుతున్నాయి. ఫింగర్ ప్రింట్, ఐరిస్(కనుపాప) 'ఐస్కాన్' పరికరాల సరఫరా కోసం యూఐడీఏఐ ఎంపిక చేసిన మొదటి సరఫరాదారుల్లో క్రాస్‌మ్యాచ్ ఒకటిగా మీడియా వర్గాలు తెలిపాయి. పాకిస్తాన్‌లోని రహస్య స్థావరంలో దాక్కున్న అల్‌ఖైదా అధినేత ఒసామాబిన్‌లాడెన్‌ను పట్టుకునేదుకు ఈ సంస్థ సమకూర్చిన సాంకేతికతనే అమెరికా వినియోగించినట్టు 2011లో మొదటిసారిగా మీడియాలో క్రాస్‌మ్యాచ్ గురించి వార్తలు వచ్చాయి.

ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య

నుంచి బదిలీపై కరీంనగర్ కమిషనరేట్‌కు వచ్చాడు. ఎప్పటిలాగే శనివారం విధులకు కమిషనరేట్‌కు వచ్చిన చంద్రయ్య తుపాకీ తీసుకుని తన బైక్ వద్దకు వెళ్లాడు. అక్కడే తలకు కాల్చుకున్నాడు. మృతునికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. ఘటనపై వన్‌టౌన్ సీఐ తుల శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ప్రధానాస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసువర్గాల్లో విషాదం నెలకొంది.

మతిస్థిమితం సరిగా లేదు : సీపీ కమలాసన్ రెడ్డి

చంద్రయ్యకు కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేదని సీపీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఆయనపై శాఖాపరంగా ఎలాంటి ఒత్తిళ్లు లేవని చెప్పారు. మానసిక స్థితి బాగోలేక కొంతకాలంగా చికిత్స కూడా చేయించుకున్నాడని తెలిపారు. ఆత్మహత్యపై సాంకేతిక విచారణ చేపట్టనున్నామని చెప్పారు.

సెన్సెక్స్ ▲ 28	నిఫ్టీ ▲ 5	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
31,596	9,857	64.03	రూ. 29,582	రూ. 42,600

గురువారం మార్కెట్లు ముగిసిన నాటికి





కోడిగుడ్లు			
హైదరాబాద్	320	విజయవాడ	320
ఒక్కగుడ్డుకు	3.80	చెన్నై	355
వరంగల్	322	ముంబయి	365



జియో ఫోన్ ప్రీ బుకింగ్స్ నిలిపివేత!



న్యూఢిల్లీ: రిలయన్స్ జియో ప్రవేశపెట్టిన 4జీ ఫోన్ ప్రీ-బుకింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. లక్షల మంది వినియోగదారులు ఈ మొబైల్‌ను బుక్ చేసుకోవడంతో ప్రీ బుకింగ్ వెసులుబాటును తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని జియో తన అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. 'లక్షల మంది ఇప్పటికే ఫోన్‌ను ముందుగా బుక్ చేసుకున్నారు' అనే మెసేజ్‌ను ఆ సైట్ హోమ్ పేజీలో పెట్టారు. ప్రస్తుతానికి ప్రీ-బుకింగ్‌లను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్టుగా తన అధికారిక సైట్‌లో పేర్కొంది. ఈ నేపథ్యంలో జియో ఫోన్ కావాల్సిన వారు ప్రస్తుతం తమ ఆసక్తిని మాత్రమే రిజిస్టర్ చేసుకోవాలని సూచించింది. ప్రీ-బుకింగ్స్‌ను తిరిగి ఎప్పుడు ప్రారంభిసున్నామనే విషయాన్ని త్వరలో వెల్లడిస్తామని జియో సైట్‌లో తెలిపింది. తాత్కాలికంగా అయితే బుకింగ్ ఆప్షన్‌ను తొలగిస్తున్నట్టు పేర్కొంది. జియో అకస్మాత్తుగా ఈ ఫోన్ ప్రీ-బుకింగ్స్‌ను నిలిపివేయడంతో, తర్వాత బుక్ చేసుకోవచ్చని భావించిన ప్రజలు కొంత నిరుత్సాహానికి గురయ్యారు. జియో ఫోన్‌ను ఇప్పుడు బుక్ చేసుకున్న వారికి సెప్టెంబర్‌లో రిలయన్స్ జియో అందించనుంది. త్వరలో ఫోన్ల డెలివరీ తేదీ, స్టోర్ వివరాలను వినియోగదారుల ఫోన్లకు కంపెనీ మెసేజ్ పంపనుంది. రిలయన్స్ జియో పేరిట రూ.1,500లకే 4జీ ఫీచర్‌ఫోన్‌ను అందించనున్న విషయం తెలిసిందే.

సామ్‌సంగ్ వైస్ చైర్మెన్‌కు ఐదేండ్లు జైలు..



సియోల్: ప్రపంచంలోనే అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ గ్రూప్ వైస్ చైర్మెన్ లిజే యాంగ్‌కు ఐదేండ్లు జైలు శిక్ష పడింది. దక్షిణ కొరియాకు చెందిన ఈ కంపెనీ ఆ దేశ మాజీ అధ్యక్షురాలు పార్క్ గ్వెన్ హైకు లంచం ఇచ్చిన వ్యవహారంలో దోషిగా తేలడంతో ఈ శిక్ష పడింది. గ్వెన్ హైకు సంబంధించిన కంపెనీలకు అక్రమంగా ఆయన దాదాపు 36 మిలియన్ డాలర్లు మళ్లించారని ప్రధాన ఆరోపణ. కాగా అత్యంత ధనవంతుడిగా పేరొందిన లీపై అవినీతి, లంచం తీసుకున్నట్టు ఆరోపణలు రావడంతో ఆయనను ఫిబ్రవరిలో అక్కడి అధికారులు అరెస్టు చేశారు. లీకు 12ఏండ్లు జైలు శిక్ష విధించాల్సిందిగా ప్రాసిక్యూటర్ న్యాయస్థానాన్ని కోరారు. కానీ కేసు వివరాలను పరిశీలించిన న్యాయస్థానం ఐదేండ్ల జైలు శిక్ష మాత్రమే విధించింది.

హెచ్‌పీఈలో చేరటం లేదు..
ఆ వార్తలను ఖండించిన ఇన్ఫీ మాజీ సీఈవో

బెంగళూరు: ఇన్ఫోసిస్‌లో గత కొద్దిరోజులుగా వ్యవస్థాపకులకు-బోర్డుకు నెలకొన్న విభేదాల నేపథ్యంలో ఆ సంస్థ చైర్మెన్ పదవి నుంచి విశాల్ సిక్కా అనుహ్యంగా వైదొలగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన హ్యూలెట్ ప్యాకర్డ్ ఎంటర్‌ప్రైజెస్(హెచ్‌పీఈ)లో చేరుతున్నట్టు వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలను ఇన్ఫీ మాజీ సీఈవో విశాల్ సిక్కా ఖండించారు. 'నేను హెచ్‌పీఈలో చేరుతున్నట్టు వస్తున్న కథనాలు నిరధారం. ఈ సందర్భంగా ఆయన ప్రముఖ ఆంగ్ల టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో విశాల్ సిక్కా మాట్లాడుతూ.. నీలేకని ఇన్ఫోసిస్ పగ్గాలు చేపట్టడమనేది మంచి నిర్ణయమని తెలిపారు. నందన్ నీలేకని పూర్తి స్వేచ్ఛగా పనిచేసేందుకు వీలుగా వైస్ చైర్మెన్ పదవి నుంచి కూడా తప్పుకొన్నట్టు పేర్కొన్నారు.

ఇన్ఫీని గాడిలో పెడతా..!

సంస్థలో స్థిరత్వం తీసుకొస్తా...
- తమ మధ్య ఏలాంటి భేదాభిప్రాయాలు లేవు
- కొత్త సీఈవో ఎంపిక కోసం త్వరలో సెర్చ్ కమిటీ : ఇన్వెస్టర్ల సమావేశంలో నందన్ నిలేకని వెల్లడి



ఇన్వెస్టర్ల సమావేశంలో నందన్ నిలేకనీ (మధ్యలో) ఇన్ఫోసిస్ ఉన్నతాధికారులు రవి వెంకటేశన్, ప్రవీణ్ రావు, డీఎన్ ప్రహ్లాద్, రంగనాథ్

ముంబయి: ఇన్ఫోసిస్‌ను గాడిలో పెట్టిన అనంతరమే తాను వైదొలుగుతానని ఆ కంపెనీ సారథి నందన్ నిలేకని స్పష్టం చేశారు. తమ సంస్థలో ఎవరి మధ్యలో కూడా భేదాభిప్రాయాలు లేవని అన్నారు. ఇటీవల ఆ కంపెనీ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న విశాల్ సిక్కా అనుహ్యంగా తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో దేశంలోనే రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్‌కు నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మెన్‌గా నిలేకని బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తొలిసారిగా శుక్రవారం ఇన్వెస్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మెన్‌గా తన పాత్ర బోర్డు పర్యవేక్షణ, పాలన, పనితీరు పరంగా కొనసాగుతుందన్నారు. ఇన్ఫోసిస్‌లో స్థిరత్వం తీసుకువచ్చేందుకు కషి చేస్తానని చెప్పారు. రాబోయే సవాళ్లను ఎదుర్కొవాలని పేర్కొన్నారు. తాను నారాయణ మూర్తిని ఆరాధిస్తానని తెలిపారు. మూర్తి, కంపెనీ వ్యవస్థాపకుల మధ్య సత్సంబంధాలు ఉన్నాయని భావిస్తున్నానని అభిప్రాయపడ్డారు. కంపెనీలో ఎవరి మధ్య ఎటువంటి భేదాభిప్రాయాలు లేవని హామీ ఇస్తున్నానని చెప్పుకొచ్చారు.

కంపెనీకి నూతన సీఈవోను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తానన్నారు. ఇన్ఫోసిస్‌కు తన అవసరం ఉన్నంతకాలం పనిచేస్తానని హామీ ఇచ్చారు. బోర్డు తనను ఏకగ్రీవంగా ఎన్నుకుందని, తన తక్షణ, ప్రధాన కర్తవ్యం సీఈవో ఎంపిక అని అన్నారు. నూతన సీఈవో నియామకం కోసం తుది నిర్ణయం తీసుకోవడానికి కొన్ని వారాల సమయం పడుతుందని చెప్పారు. ఇందుకోసం బోర్డు ప్రపంచవ్యాప్తంగా తగిన అభ్యర్థి కోసం శోధిస్తుందని, ఇన్ఫోసిస్ పూర్వ విద్యార్థులతో సహా అంతర్గత, బాహ్య అభ్యర్థులను పరిశీలిస్తానని చెప్పారు. రాబోయే నూతన సారథికి టెక్నాలజీ పరంగా బలమైన పట్టు ఉండాలన్నారు. కొత్త సీఈవో ఎంపిక కోసం సెర్చ్ కమిటీని త్వరలోనే నియమిస్తామన్నారు.

కంపెనీలో ఇటీవలి పరిణామాలపై భయపడాల్సిన అవసరం లేదంటూ పెట్టుబడిదారులకు భరోసా ఇచ్చారు. సిక్కా ఆకస్మిక రాజీనామాపై సంస్థ నిర్వహణ కార్యకలాపాల్లో ఎలాంటి అంతరాయం ఉండదని నొక్కి చెప్పారు. మరోవైపు సంస్థకు సిక్కా చేసిన కృషిని కూడా ఆయన అంగీకరించారు.

తన నేతృత్వంలో ప్రతిష్టాత్మకమైన ప్రణాళికలను ముందుకు తీసుకువెళతామన్నారు. దీంతోపాటు మేనేజ్‌మెంట్ బోర్డులో నిర్మాణాత్మక మార్పులు చోటు చేసుకుంటాయనే సంకేతాలు కూడా ఇచ్చారు. పనాయా డీల్‌పై స్పందించిన నిలేకని, ఆ విషయాన్ని పరిగణలోకి తీసుకుంటానని, స్వల్పకాలికంగా కంపెనీ పనితీరులో ఎలాంటి ఆటంకాలు ఉండబోవని చెప్పారు. క్లయింట్స్‌తో సంస్థ చేసుకున్న ఒప్పందాలకు తాను కట్టుబడి ఉంటానన్నారు.

జీవితం గుండ్రంగా తిరుగుతోంది..

ఇన్ఫోసిస్‌లో తాను 26 ఏండ్ల వయసులో తొలిసారి చేరానని, మళ్లీ 62ఏండ్ల వయసులో పునరాగమనం చేస్తున్నానని నిలేకని ట్విట్టర్‌లో ఓ సందేశం ఉంచారు. జీవితం గుండ్రంగా తిరుగుతోందంటూ తన సంతోషాన్ని ట్విట్ చేశారు. ఇన్ఫోసిస్‌కు మళ్లీ తిరిగిరావడం సంతోషంగా ఉందని ఇన్వెస్టర్ల సమావేశంలో పేర్కొన్నారు. క్లయింట్లు, షేర్‌హోల్డర్లు, ఉద్యోగులు మొదలైన వారందరికీ ప్రయోజనాలు చేకూర్చేలా వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా బోర్డులోని నా సహచర సభ్యులతో కలసి పనిచేస్తానని నిలేకని చెప్పారు.

అనుమతి తప్పనిసరి..!



పసిడి దిగుమతులపై ప్రభుత్వ నిర్ణయం

ముంబయి: దక్షిణ కొరియా నుంచి అంతకంతకు పెరిగిపోతున్న పసిడి, వెండి దిగుమతులను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆంక్షలు విధించింది. ఇక ముందు వీటి దిగుమతులపై ప్రభుత్వ అనుమతి తప్పనిసరి చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అదే విధంగా ఈ ఉత్పత్తులను పరిమిత కేటగిరీలోకి చేర్చింది. జూలై 1 నుంచి ఆగస్టు 21 వరకు మధ్య కాలంలో దక్షిణ కొరియా నుంచి దేశంలోకి దాదాపు 1 బిలియన్ డాలర్ల విలువ చేసే బంగారం దిగుమతులు జరగడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.. కాగా నాణేలు, ఆభరణాలతో సహా అన్ని రకాల బంగారం, వెండి వస్తువులపై ఈ పరిమితి వర్తిస్తుందని ప్రభుత్వం పేర్కొంది. దక్షిణ కొరియాకు, భారత్‌కు మధ్య ఉచిత వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) అమల్లో ఉంది. దీంతో ఆ దేశం నుంచి వచ్చే బంగారం దిగుమతిపై ప్రాథమిక కస్టమ్ సుంకం విధించడానికి వీల్లేదు. ప్రస్తుతం సమీకృత జీఎస్టీ కింద బంగారంపై 3 శాతం పన్ను మాత్రమే అమల్లో ఉంది. ఉచిత వాణిజ్య ఒప్పందం లేని దేశాల నుంచి దిగుమతి చేసుకునే బంగారం ఉత్పత్తులపై 10 శాతం కస్టమ్ డ్యూటీ అమల్లో ఉంది.

దక్షిణ కొరియాతో ఉన్న ఎఫ్‌టీఏను ఉపయోగించుకుని పలువురు వాణిజ్య వ్యాపారులు పన్ను ఎగొట్టేందుకు ఆ దేశం నుంచి భారీగా పసిడి దిగుమతులు చేసుకుంటున్నారు. దీంతో జులైలో బంగారం దిగుమతులు 95 శాతం పెరిగాయని తెలుస్తోంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో బంగారం, వెండిని దిగుమతి చేసుకోవాలంటే దిగుమతిదారులు ముందస్తుగా ప్రభుత్వం వద్ద నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. చైనా తర్వాత ప్రపంచంలో అతిపెద్ద బంగారం వినియోగదారునిగా భారత్ ఉంది. ప్రస్తుతం 400 ప్లస్ ఉత్పత్తులు నియంత్రిత దిగుమతుల జాబితాలో ఉన్నాయి. వాటిలో జంతువులు, కొన్ని విత్తనాలు, యూరేనియం, పేలుడు పదార్థాలున్నాయి. డబ్ల్యూటీవో నిబంధనలకు అనుగుణంగానే ఈ నిషేధం ఉందని, ఎఫ్‌టీఏ నిబంధనలను ఇది ఉల్లంఘించడం లేదని అధికారులు పేర్కొన్నారు.

జీఎస్టీతో గ్రానైట్ పరిశ్రమ కుదేలు
- పోరాటానికి అండగా ఉంటాం : తమ్మినేని



దీక్షలను ప్రారంభించి మాట్లాడుతున్న తమ్మినేని

నవతెలంగాణ-ఖానాపురంహవేలి

గ్రానైట్ పరిశ్రమపై ఆధారపడి లక్షలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, ఈ రంగంపై 28శాతం జీఎస్టీ విధించడం వల్ల పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదమేర్పడిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మం జిల్లా గ్రానైట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం ధర్నాచౌక్‌లో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షలను శనివారం తమ్మినేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశ వ్యాప్తంగా గ్రానైట్ యజమానులు పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదన్నారు. తెలంగాణలో గ్రానైట్ పరిశ్రమ ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోందని, ఈ తరుణంలో జీఎస్టీ విధించడం వల్ల అభివృద్ధి కుంటుపడే అవకాశముందన్న విషయాన్ని రాష్ట్ర సర్కారు గ్రహించట్లేదని అన్నారు. ఒకే పన్ను విధానంతో చిన్నపరిశ్రమలు కుదేలవుతున్నాయన్నారు. జీఎస్టీలో స్లాబ్ విధానం అశాస్త్రీయంగా ఉందన్నారు. జీఎస్టీకి వ్యతిరేకంగా ఖమ్మం జిల్లా గ్రానైట్ అసోషియేషన్ చేస్తున్న ఉద్యమానికి సీపీఐ(ఎం) అండగా ఉంటుందన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం నుంచి హైదరాబాద్ వరకూ చేపట్టనున్న పాదయాత్రలో తానూ ఓరోజు పాల్గొంటానని తెలిపారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కూరపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జీఎస్టీ పేరుతో 28శాతం పెంచి కేంద్రం దొంగదెబ్బ తీసిందన్నారు. దీక్షలో గ్రానైట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేముల రవికుమార్, జిల్లా మాజీ అధ్యక్షులు పారా నాగేశ్వరరావు, తమ్మినేని వెంకట్రావ్, జొన్నలగడ్డ రవికుమార్, బాలాజీ ప్రసాద్, పాటిబండ్ల యుగంధర్, కనకమేడల సత్యనారాయణ, నజీర్, బయ్యర్స్ అసోషియేషన్ నాయకులు అశోక్ కొఠారీ కూర్చున్నారు. దీక్షలకు సంఘీభావం తెలిపిన వారిలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శనరావు, జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు నున్నా నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి డీఎస్ఎమ్ఎమ్ జాతీయ సమావేశాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డీఎస్ఎమ్ఎమ్) జాతీయ సమావేశాలు ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభం కానున్నాయి. రెండు రోజులపాటు కొనసాగే ఈ సమావేశాలకు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వేదిక కానుంది. సమావేశాల ప్రారంభం సందర్భంగా ఆదివారం ఉదయం 11 గంటలకు 'రాజ్యాంగం- సామాజిక న్యాయం-సవాళ్లు' అనే అంశంపై జాతీయ సెమినార్‌ను నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు అధ్యక్షతన జరిగే ఈ సెమినార్‌లో డీఎస్ఎమ్ఎమ్ జాతీయ నాయకులు బివి రాఘవులు, సుభాషిణి అలీ, వి.శ్రీనివాసరావు, కె.రాధాకృష్ణన్, ఎంపీ సోమ ప్రసాద్ తదితరులు ప్రసంగిస్తారని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాడిగల్ల భాస్కర్, కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో గోరక్షక దళాల పేరిట దళితులపై కొనసాగుతున్న దాడులు, హత్యలు, తెలంగాణాలో కుల దురహంకార హత్యలు, వీటిపై టీఆర్ఎస్ సర్కారు నుంచి ఎలాంటి స్పందనా లేకపోవటం తదితరాంశాలపై సమావేశాల్లో చర్చిస్తామని వారు పేర్కొన్నారు.

రేషన్ షాపుల వారీగా
కోటి మందికి బతుకమ్మ చీరెలు

సెప్టెంబరు 18,19,20 తేదీల్లో పంపిణీ : ముఖ్యమంత్రి కేసీఆర్



బతుకమ్మ చీరెలను సీఎంకు చూపిస్తున్న శైలజా రామయ్యర్, చిత్రంలో సోమేశ్‌కుమార్, తదితరులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలోని కోటి నాలుగు లక్షల 57 వేల మంది మహిళలకు బతుకమ్మ చీరెలను పంపిణీ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. 18 ఏండ్లు నిండిన పేద మహిళలందరికీ రేషన్ షాపుల వారీగా వీటిని అందజేస్తామని తెలిపారు. సెప్టెంబరు 18,19,20 తేదీల్లో వీటిని పంపిణీ చేయనున్నట్టు వివరించారు. రేషన్ షాపుల్లో ఆధార్ కార్డునుగాని, ఓటరు గుర్తింపు కార్డునుగాని, మరేదైనా ఫొటో గుర్తింపు కార్డునుగానీ చూపించి చీరెలను పొందొచ్చని తెలిపారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు పర్యవేక్షిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను ఆయన ఆదేశించారు. ఇందుకనుగుణంగా వారందరికీ లేఖలు రాయాలని చేనేత, జౌళిశాఖ మంత్రి కేటీఆర్‌కు సూచించారు. చీరెల పంపిణీపై శనివారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పంపిణీ చేయబోయే చీరెల నాణ్యతను పరిశీలించిన ఆయన.. సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలంతా మరింత సంతోషంగా పండుగను జరపుకోవాలనే ఉద్దేశంతో పేద మహిళలందరికీ చీరెలను కానుకగా ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిపారు. రంజాన్ సందర్భంగా ముస్లింలకు, క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేశాం.. కానీ బతుకమ్మ చీరెలను మాత్రం రాష్ట్రంలోని హిందూ, ముస్లిం, క్రైస్తవులతోపాటు అన్ని కులాలు, మతాల పేద మహిళలందరికీ పంపిణీ చేయాలని నిర్ణయించామని చెప్పారు. 'మరమగ్గాలు, చేనేత మగ్గాలను ఆధారం చేసుకుని బతికే కార్మికుల పరిస్థితి దారుణంగా ఉంది. పనిలేక వారు ఆత్మహత్యలు పాల్పడే దుస్థితి వచ్చింది. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. అందుకే పవర్‌లూమ్, హ్యాండ్లూమ్ కార్మికులు నేసిన చీరెలనే కొనుగోలు చేసి పంపిణీకి సిద్ధం చేస్తున్నాం..దీని ద్వారా కార్మికులకు ఉపాధి దొరుకుతున్నది. పనికి హామీ లభిస్తున్నది. బతుకుకు భరోసా ఏర్పడు తున్నది..' అని సీఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మెన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఆ శాఖ ఎమ్‌డీ సివి ఆనంద్, చేనేత, జౌళిశాఖ సంచాలకులు శైలజా రామయ్యర్ పాల్గొన్నారు.

సీఎస్ వీడియో కాన్ఫరెన్స్...

బతుకమ్మ చీరెల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ శనివారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సుమారు రూ.200 కోట్ల విలువైన చీరెలను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఇందుకనుగుణంగా వారం రోజుల్లోగా ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్లను ఆదేశించారు. పంపిణీ విషయంలో సిబ్బందికి శిక్షణనివ్వాలని సూచించారు.

కాంట్రాక్టర్లకు వద్దు : తెలుగు మహిళ శోభారాణి

బతుకమ్మ కానుకగా పేదింటి ఆడపడుచులకు పంపిణీ చేయాల్సిన చీరలను ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించడం సరైంది కాదని తెలుగుదేశం తెలంగాణ శాఖ తెలుగు మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు బి. శోభారాణి అన్నారు. రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ఉపాధి కల్పించకుండా, ఇతర రాష్ట్రాల నుంచి చీరలు తెప్పించడం అన్యాయమన్నారు.

ఎవరి మాట కరెక్టు..? ముఖ్యమంత్రిదా..? లేక డైరెక్టర్‌దా..?

బతుకమ్మ చీరెలకు సంబంధించి ముఖ్యమంత్రి కేసీఆర్, చేనేత, జౌళిశాఖ సంచాలకులు శైలజా రామయ్యర్ చేసిన ప్రకటనలు పరస్పర విరుద్ధంగా ఉండటంతో చేనేత ప్రతినిధులు తీవ్ర ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. బతుకమ్మ చీరెలను రాష్ట్రంలో సకాలంలో పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేయలేకపోయినందున సూరత్ నుంచి మిగిలిన వాటిని తెప్పిస్తున్నామంటూ ఈనెల 19న శైలజా రామయ్యార్ ప్రకటించారు. వస్త్ర పారిశ్రామికులతో సమావేశం సందర్భంగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆమె ఈ ప్రకటన చేశారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. జనవరిలో ఇవ్వాల్సిన ఆర్డర్లను హడావుడిగా మేలో ఇవ్వటం వల్లే అనుకున్నంత స్థాయిలో వస్త్రోత్పత్తి చేయలేకపోయామని అటు అధికారులు, ఇటు కార్మికులు చెప్పారు. ఇందుకు విరుద్ధంగా రాష్ట్రంలోని చేనేత, మరమగ్గాల మీద నేసిన చీరెలనే పంపిణీ చేస్తామంటూ ముఖ్యమంత్రి శనివారం ప్రకటించటం గమనార్హం. మొత్తం మీద సీఎం, అధికారులు ఇద్దరూ కలిసి చేనేత, మరమగ్గాల కార్మికులను గందరగోళంలో పడేశారన్నమాట. ఏదైమైనా వీరికి పని కల్పించటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నిపుణులు విమర్శిస్తున్నారు.

నేపాల్ ప్రధానికి ఘన స్వాగతం
తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో గవర్నర్ విందు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి శుక్రవారం నాడు వచ్చిన నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బాకు శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘనస్వాతం లభించింది. తెలంగాణ రాష్ట్రం తరపున ఆయనకు డిప్యూటీ సీఎం మహ్మద్ మహమూద్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, డిజిపి అనురాగ్ శర్మ, ప్రత్యేక కార్యదర్శి అదర్ సిన్హా ఇతర రాష్ట్ర నేతలు ఘనంగా స్వాగతం పలికారు. అయితే అదే రోజు గవర్నర్ నరసింహన్ షేర్ బహదూర్ దేవ్‌బా దంపతులకు తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ సతీమణి విమలా నరసింహన్, రాష్ట్ర మంత్రి కడియం శ్రీహరి, హజరయ్యారు. విందు అనంతరం గవర్నర్ సతీమణి షేర్ బహదూర్‌కు జ్ఞాపికను అందజేశారు. అతిథిగా పాల్గొన్న నిజామాబాద్ ఎంపీ కవిత నేపాల్ ప్రధానికి బతుకమ్మ జ్ఞాపికను బహుకరించారు.

సీపీఎస్ రద్దు చేయండి
సీఎస్ ఎస్పీసింగ్‌కు జేఏసీ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల హక్కులను కాలరాయడానికే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను తెచ్చిందని ఉద్యోగులు, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. శనివారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌ను కలిసి సీపీఎస్‌ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా జేఏసీ చైర్మెన్ కారం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ విధానంపై రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు 2004 నుంచి ఆందోళనలు చేపడుతున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో లక్షకు పైగా సీపీఎస్ ఉద్యోగులు చనిపోయినా, ఉద్యోగ విరమణ చేసిన వారి కుటుంబాలకు ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం తరపున చెల్లించలేదని తెలిపారు. దాంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దు కోసం 19 రోజుల పాటు దేశ వ్యాప్త సమ్మెలో తెలంగాణ ఉద్యోగులు పాల్గొన్నారని చెప్పారు. అయినా కేంద్ర ప్రభుత్వం ఈ విషయంపై పట్టించుకోలేదన్నారు. సీపీఎస్ రద్దు కోసం తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఉద్యమాన్ని తీవ్రతరం చేసి కేంద్ర ప్రభుత్వంకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సెప్టెంబర్1న బ్లాక్‌డే పాటిస్తూ ఉద్యోగులంతా నల్ల బ్యాడ్జీలు ధరించాలని ఆయన పిలుపునిచ్చారు. భోజన విరామ సమయంలో నిరసనలు తెలుపాలని సూచించారు. అప్పటికీ కేంద్ర ప్రభుత్వం దిగిరాకపోతే త్వరలోనే తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సెక్రెటరీ జనరల్ వి మమత, ఉద్యోగ సంఘం అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్‌తో పాటు తదితర ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.



సీపీఎస్‌ను రద్దు చేయాలని సీఎస్‌కు వినతి పత్రం అంజేస్తున్న జేఏసీ ఉద్యోగులు, గెజిటెడ్ ఆఫీసర్స్ తదితరులు



ఫిదా



తలపులు శూన్యమై
కలతగా నిర్జీవమై పడివున్నప్పుడు
ఎడారిలో తడారిన అధరాలను
ఒయాసిస్సులా లాలాజలంతో తడి పేస్తావు

పల్లె ప్రౌఢ సౌష్టవ అందాలతో అలరారు
పచ్చ పచ్చని జొన్న సేనులో
కంకి సివరంచు మరుల రామసిలుకై
కొరికి కొసరి ముద్దులను తినిపిస్తావు

పూర్వ కౌమార సుకుమార ప్రాయంలో
అమ్మ నాన్నల ఆటలప్పుడు
కుమ్మరి గురిగిల అన్నం వండి
ఆలిలా చుంభనాల కూరతో వడ్డిస్తావు

తెల్లారి పొలం ఒడ్ల మధ్య
పచ్చ రంగు ఓణీలో మరకతమణిలా
హృదయ కవాటమై ఊయలూగుతూ
నా కోసం సద్దిగిన్నెలు మోసుకొస్తావు

నీ నడుమును హరివిల్లులా వంచి
సప్తరంగులను సప్తపదులుగా మార్చి
నా ప్రణయ క్షేత్రాన్ని 'ఫిదా' చేసి
నా చిటికెనవేలై నాతో నడుస్తున్నావు

– అశోక్ అవారి,
9000576581

ఆమెకు లిఫ్ట్ ఇవ్వొద్దూ..!



'డాడీ! నాకు బైక్ కొనివ్వండి' అడిగాడు కొడుకు.
'ఇప్పుడు దాని అవసరం ఏముంది రా..!' అన్నాడు తండ్రి.
'కాలేజ్‌కి వెళ్లేందుకు కావాలి' చెప్పాడు కొడుకు.
తండ్రికి కోపం వచ్చింది.
'పక్కింటి అమ్మాయిని చూసి బుద్ధి తెచ్చుకో.. ఆమె నడుచుకుంటూ కాలేజ్‌కి ఎలా వెళ్తోందో..' అంటూ మండిపడ్డాడు.
అప్పుడు కొడుకు–
'బైక్ కొనివ్వమని నేనడిగింది అందుకేగా మరి...' అని చెప్పి నాలుక్కర్చుకున్నాడు.

మంత్రి వారసుడు

ఓ మంత్రి కొడుక్కి మెడికల్ కాలేజ్‌లో సీటు వచ్చింది.
అడ్మిషన్‌కి ముందు అతడికి ప్రొఫెసర్ చిన్న పరీక్ష పెట్టాడు.
'నీ తోటి విద్యార్థి ఉన్నట్టుండి స్పృహ తప్పి పడిపోతే నువ్వేం చేస్తావ్?' అనడిగాడు.
'వెంటనే ముఖంపై నీళ్ల చల్లుతాను..' చెప్పాడు మంత్రి కొడుకు.
'అప్పటికప్పుడు నీళ్ల దొరక్కపోతే..?' మళ్లీ అడిగాడు ప్రొఫెసర్.
'ఏముంది.. రానున్న ఐదేండ్లలో కచ్చితంగా నీళ్ల తెచ్చి ముఖంపై చల్లుతానని హామీ ఇస్తా..' చెప్పాడు మంత్రి కొడుకు.



'నెగటివ్'కి నో చెబుదామా..!

చాలామందికి విచిత్ర ధోరణిఉంటుంది. తనకు నచ్చినట్టే అన్నీ జరగాలనుకుంటారు. పరిస్థితులు దానికి విరుద్ధంగా ఉంటే అసహనం వ్యక్తం చేస్తారు. మరికొందరు బాధపడతారు. తమకు నచ్చనట్టు ఎవరైనా ప్రవర్తిస్తే ఆవేదన చెందుతారు. తమకు తామే మనసులో అశాంతిని సృష్టించుకుంటారు. ఇలాంటి వారు ఒక్కటి గుర్తుపెట్టుకోవాలి. మనం కోరుకున్నట్టే అన్ని జరగవని మరచిపోవద్దు. మనకు నచ్చనట్టు ప్రవర్తించిన వారితో బంధాన్ని తెగ్గొట్టుకోవద్దు. మనకు అయిష్టంగా జరిగే వాటి గురించి అదే పనిగా ఆలోచిస్తూ సమయాన్ని వృథా చేసుకోవద్దు.

మనిషి జీవితంలో ఇలాంటివన్నీ మామూలే. అన్ని మనకు సానుకూలంగా జరగాలని లేదు. మనం జీవించినంత కాలం అయిష్టమైన అంశాలు చోటుచేసుకుంటూనే ఉంటాయి. వాటిని అధిగమించాలి గానీ.. అతిగా ఆలోచించి మనసులో అలజడి సృష్టించుకోవద్దు. మానసికంగా, శారీరక ఆరోగ్యానికి ఇదేంతో హానికరం. అంతేకాదు... ఇలాంటి ఆలోచనలు వ్యతిరేక భావాలను రేకెత్తిస్తాయి. ప్రతికూల ఆలోచనలు జీవితాన్ని దుర్భరం చేస్తాయి. దీనికి ఒకటే పరిష్కారం. మనం కోరుకున్న విధంగానే జరిగేటట్టు, మనకు అయిష్టమైనవి ఏవీ జరగకుండా ఉండేట్టు జీవితాన్ని మలచుకోవటమే.

అదెలాగంటే..

మనకు అయిష్టమైనవి జరగకుండా, ఇష్టమైనవే జరిగే విధంగా చూసుకోవటానికి అవసరమైన శక్తిని మనలో మనమే వృద్ధి చేసుకోవాలి. అది సాధ్యం కానప్పుడు మనలో సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలి. ప్రతిదీ పాజిటివ్‌గా తీసుకోవాలి. నెగెటివ్ ఆలోచనలకు అస్సలు తావివ్వొద్దు. జీవితంలో రాణించడానికి సానుకూల దృక్పథం ఎంతగానో తోడ్పడుతుంది. కెరీర్‌ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడానికి ఇది బాగా ఉపయోగపడుతుంది. నెగటివ్‌గా ఆలోచిస్తే మన జీవితాన్ని మనమే ఆగాధంలోకి నెట్టేసుకున్నట్టవుతుంది.



నిణుపులు ఏం సూచిస్తున్నారు?

- మన ఆలోచనలు లైఫ్ గిఫ్ట్ లాంటివి. వాటిపై ఎవరి నియంత్రణ, ఎవరి అధికారమూ ఉండదు. సొంత ఆలోచనలతో జీవితాన్ని ముందుకు నడిపించినప్పుడే జీవితం అందంగా ఉంటుంది.
- జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను చాలెంజ్‌గా తీసుకోవాలి. వాటిని అధిగమించేందుకు ప్రయత్నించాలి. ప్రతికూల పరిస్థితుల నుంచి గట్టెక్కగలనా..? అనే భయం ఏమాత్రం మంచిదికాదు. ఫెయిల్యూర్ అనేది జీవితంలో ఒక భాగమని భావించాలి. చీకటి తర్వాత వెలుగు అనేది ఉంటుందని గుర్తుపెట్టుకోవాలి.
- నెగటివ్ థాట్స్ వచ్చినప్పుడు వాటిని నోట్ చేసుకుని అవి లైఫ్‌లో తీసుకునే నిర్ణయాలపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయో తెలుసుకోవాలి. కొంత సమయం కేటాయించి వివిధ సందర్భాల్లో రోజంతా ఎలా ఉంటున్నారో నోట్ చేసుకోవాలి. నెగటివ్ థాట్స్ ఎందుకొచ్చాయో గుర్తించాలి. నెగటివ్ ఆలోచనలు జీవితంపై ఎలాంటి ప్రభావం చూపుతాయో తెలుసుకోవాలి.
- జరగబోయేదాన్ని ఎవరూ ఆపలేం. కాబట్టి దాని గురించి ఆలోచించడం వల్ల ప్రయోజనం ఉండదు. దీనికి పరిష్కారం పాజిటివ్‌గా ఆలోచించడమే.
- నెగటివ్‌గా ఆలోచిస్తున్నారంటే మిమ్మల్ని మీరు నమ్మడం లేదని అర్థం. ఇతరులు మిమ్మల్ని ఇష్టపడటం లేదని భావిస్తున్నారన్నమాట. మీరు ఏ పని చేసినా పర్‌ఫెక్ట్‌గా చేస్తే ఎదుటి వాళ్ల నుంచి నెగటివ్ రెస్పాన్స్ ఉండదని గ్రహించాలి.
- అన్ని ఆలోచనలకు వెల్‌కమ్ చెప్పాలి. కానీ.. ఏది అవసరమో దాన్ని మాత్రమే తీసుకోవాలి.
- గతంలో జరిగిన విషయాలను మరచిపోవాలి. అప్పుడే మీరు నైతికంగా స్ట్రాంగ్ అవుతారు.
- సరైన ఆలోచనలు వచ్చేలా మైండ్‌ని ఫోర్స్ చేయండి. కరెక్ట్ గా ఆలోచించడం వల్ల ఏది చేసినా సక్సెస్ అవుతుంది. కాబట్టి నెగటివ్ ఆలోచనలకు వెళ్లకుండా బ్రెయిన్‌ని కట్టడి చేయండి. నెగటివ్ ఆలోచనల నుంచి బ్రెయిన్ ని డైవర్ట్ చేయండి.
- ఒకవేళ మీరు నెగటివ్ ఆలోచనల నుంచి బయటపడలేకపోతుంటే.. అలాంటి వాటిని నమ్మడం మానేయండి. ఇలా చేయడం వల్ల పాజిటివ్ ఆలోచనలు మైండ్‌లోకి వస్తాయి. పాజిటివ్ ఆలోచనల కారణంగా పనిలో వృద్ధి పెరుగుతుంది. జీవితంలో విజయం సాధిస్తారు.

కష్టాలొస్తే కుమిలిపోవద్దు

సమస్యలనేవి మనిషికి సర్వసాధారణమే. జీవితంలో ఇవీ ఒక భాగమే. సుఖాలు ఉన్నచోట దు:ఖాలూ ఉంటాయి. మోతాదులోనే తేడా. ఒకటి ఎక్కువ కావచ్చు. ఇంకొకటి తక్కువగా కావచ్చు. రెండూ సమానంగానూ ఉండొచ్చు. వీటికి వయసుతో నిమిత్తం లేదు. సమయం, సందర్భమూ అక్కర్లేదు. ఇవి ఉన్నట్టుండి తలుపు తట్టుతాయి. పిలవకుండానే మన జీవితంలోకి దూరిపోతాయి. కొన్నిసార్లు మనంతట మనమే వాటిని ఆహ్వానిస్తాం. సుఖాలు వస్తే సంతోషిస్తాం. కష్టాలొస్తే కుమిలిపోతాం.

మన క్లాస్‌మెంట్ గానీ, స్నేహితుడు గానీ, కొలీగ్ గానీ డల్‌గా కనిపిస్తే ఎందుకలా ఉన్నవని వెంటనే అడగేస్తాం. అతడు/ఆమె తన కష్టాలు చెప్పుకుంటే సాధారణంగా మన నోట్లోంచి వచ్చే మాట ఒక్కటే. 'ఈ వయసులో నీకు కష్టాలేమిటి?' అని. కష్టాలనేవి వయసును చూసి రావయనే విషయాన్ని మరచిపోతాం. లైట్‌గా తీసుకోమని చెబుతాం గానీ పరిష్కారమేమిటో సూచించం. ఓదార్చడమేమో గానీ 'లైట్'గా మాట్లాడి మనసును మరింత 'గాయ' పరుస్తాం. అవే కష్టాలు మనకొస్తే.. బెంబేలెత్తిపోతాం.

వాస్తవానికి కష్టాలు ఎవరికొచ్చినా లైట్‌గానే తీసుకోవాలి. వాటి నుంచి ఉపశమనం పొందడానికి మూల కారణం తెలుసుకోవాలి. పాజిటివ్‌గా ఆలోచించి వాటిని అధిగమించేందుకు సర్వశక్తులు ప్రయత్నించాలి.

ఆలోచన-నియంత్రణ

→ జీవితంలో ఎంత ఎత్తుకు ఎదుగుతారనేది ఆ మనిషికి జీవితం పట్ల గల దృక్పథాన్ని బట్టి ఉంటుంది.
→ మనసులో రూపొందించుకున్న ఆశలు, ఆశయాలే జీవిత గమ్యాన్ని నిర్దేశిస్తాయి.
→ ఆలోచనలు సక్రమమైనప్పుడే మేధస్సు వికసిస్తుంది.
→ ఒక మంచి ఆలోచన మనకు తట్టినప్పుడు దానిని పదే పదే మననం చేసుకోవాలి. అయితే ఆలోచనలను అదుపు చేయటం అనుకున్నంత సబబు కాదు. అయినా సరే.. ఆ ప్రయత్నంలో విఫలం కావద్దు.



→ ఖాళీగా కూర్చుంటే మనిషి ఆలోచనలు పరి పరి విధాలుగా పోతుంటాయి. అందుకని అసలు తీరిక అనేది లేకుండా నిరంతరం పనిచేస్తూంటే మనసుకు, అందులో చెలరేగే ఆలోచనలకు స్థిరత్వం ఏర్పడుతుంది.
→ మనసును తట్టుతున్న ఆలోచనలు ఎలాంటివనే అంశాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి. అదుపులోకి రాని మనసు ఎటు పోతోందో గమనించాలి.
→ మనిషిని చెడు మార్గంలోకి తీసుకెళ్లేది అతనిలోని కోపం, భయం. ఈ రెండింటినీ నియంత్రించుకోవటం ద్వారా మనిషి తన స్థితిని మెరుగుపర్చుకోగలుగుతాడు.

-వీఆర్‌కే

పాదాలు చెప్పే నిజాలు

మనిషి పాదాలనుబట్టి మనస్తత్వాన్ని తెలుసుకోవచ్చట. మనమేమిటో మన పాదాల రూపురేఖలే చెబుతాయని అంటున్నాయి అధ్యయనాలు. శారీరక, మానసిక సంఘర్షణలనుబట్టి పాదాలు ఉంటాయని పేర్కొంటున్నారు పరిశోధకులు.




✓ పాదాలు వెడల్పుగా కలిగిన వారు ఉత్సాహంగా ఉంటారు. ఎప్పుడూ చురుగ్గా ఉంటారు. తమ పనులను తామే సమర్థంగా నిర్వర్తించుకుంటారు.
✓ పాదాలు సన్నగా ఉన్నవారు తమ పనులను ఇతరులకు అప్పగించేందుకు మొగ్గుచూపుతారు.
✓ పాదం మధ్యభాగం వంపు లేకుండా తిన్నగా ఉన్నవారు స్నేహ పూర్వకంగా మెలుగుతారు. సన్నిహితుల కోసం ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తారు. తమ సమస్యలను ఇతరుల సహాయంతో పరిష్కరించుకుంటారు.
✓ పాదం అడుగుభాగం వంపు తిరిగి ఉన్నవారు మానసికంగా బలవంతులు అయ్యుంటారు. వీరు కూడా ఇతరులతో స్నేహంగానే ఉంటారు. సమస్యలను తమకుతాముగా సొంతంగా పరిష్కరించుకునేందుకు ఇష్టపడతారు.
✓ ఈ వంపు మరింత ఎక్కువగా ఉంటే వీరిలో స్వతంత్ర భావాలు మరింత ఎక్కువగా ఉంటాయి. ఎవరినీ సహాయం అడగరు. అంతేకాదు.. ఇలాంటి వారికి జీవితంలో పెద్ద కలలు, ఆశయాలు ఉంటాయి.
✓ పాదాలు పెద్దగా ఉన్నవారిలో నాయకత్వ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటారు.
✓ పాదాలు చిన్నగా ఉన్నవారిలో తెలివితేటలు హెచ్చుగా ఉంటాయి. వీరు తమ అసలు వయసు కంటే చిన్న వారిలా కనిపిస్తారు.
✓ బొటనవేలు పొడుగ్గా ఉన్నవారు వ్యాపారంలో బాగా రాణిస్తారు.
✓ బొటనవేలు తర్వాత వేలు పొడుగ్గా ఉన్నవారు ఇతరులను అనుసరించేందుకు ఇష్టపడరు.
✓ వేళ్లు చక్కగా ఒక వరుసలో అమర్చినట్టుగా ఉన్నవారు నిజాయితీగా ఆలోచిస్తారు.
✓ వేళ్లు ఒకదానిపై ఒకటి ఎక్కినట్టుగా ఉన్నవారిలో నిజాయితీ తక్కువగా ఉంటుంది.
✓ చివరి వేలు వైపు మిగతా వేళ్లు వాలిపోయి ఉన్నవారు జీవితంలో ఎప్పుడూ బిజీగా ఉంటారు.
✓ బొటన వేలివైపు మిగతా వేళ్లు వాలిపోయి ఉన్నవారు గతాన్ని తలచుకుంటూ బతికేస్తారు.
✓ వేళ్ల మధ్య ఖాళీ స్థలం ఎక్కువగా ఉన్నవారు గలగలా మాట్లాడతారు. నలుగురితో ఉన్నప్పుడు నవ్వులు పూయిస్తారు.

మనసును గాయపర్చొద్దు

ప్రేమ సౌధానికి పునాది నమ్మకం. అది పటిష్ఠంగా ఉంటేనే రెండు జీవితాలూ నిలబడతాయి. లేదంటే అగాధమే. ఆ పునాదిని దృఢంగా ఉంచుకునే బాధ్యత ప్రేమికులిద్దరిది. ఏ ఒక్కరు కూడా దాన్ని బీటలు వారనివ్వొద్దు.

- ప్రేమించిన వ్యక్తి పట్ల సత్ప్రవర్తన కలిగి ఉండాలి. ఎక్కడా అదుపు తప్పొద్దు. బిహేవియర్ బాగుంటేనే ప్రేమ వర్ధిల్లుతుంది. లేదంటే మూన్నాళ్ల ముచ్చటగానే ముగుస్తుంది.
- ప్రేమను కనబర్చడమంటే నాలుగు మంచి మాటలు చెప్పడం కాదు. నీ కోసం అది చేస్తా.. ఇది చేస్తానంటూ కబుర్లు చెప్పడానికే పరిమితం కావద్దు. మీ ప్రేమ నిజమని నిరూపించుకోవాలంటే మాటలు కాదు.. చేతలు ఉండాలి. అలాగని ప్రేమించిన వ్యక్తిని ఇంప్రెస్ చేయడానికి సాధ్యం కాని పనులకు ఉపక్రమించొద్దు. సాహసాలకు పోయి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దు.
- బంధం తెగడానికి అబద్ధాలు పదునైన కత్తిలా పని చేస్తాయి. అసత్య పలుకులు నమ్మకాన్ని ముక్కలు ముక్కలుగా ఖండిస్తాయి.
- ప్రేమలో పంతాలకు తావ్వుండొద్దు. 'నేను చెప్పిందే కరెక్ట్' అని వాగ్వాదానికి దిగితే మీ ప్రేమను మీరే చేజేతులా పోగొట్టుకున్నట్టవు తుంది. తానే నెగ్గాలనుకునే వారు ఎక్కువ రోజులు ప్రేమను కాపాడుకోలేరు.
- ప్రేమించిన వ్యక్తిని సరదాగానైనా తక్కువ చేసి మాట్లాడొద్దు. పరాచికంలో ఏదైనా మాట్లాడొచ్చనుకోవద్దు. నవ్వుతూ మాట్లాడినా మీ మాటలు అనర్థాలకు దారి తీయొచ్చు. పరాచికమే మీ ప్రేమ వైఫల్యానికి కారణం కావచ్చు. ప్రేమికులిద్దరూ పరస్పరంగా గౌరవించుకోవాలి. ఒకరి మనసును ఒకరు నొప్పించొద్దు. హృదయానికి గాయమైతే అది మానడం చాలా కష్టం.
- రెండు మనసులకు సంబంధించిన ప్రేమ ఏనాటికైనా ఆ రెండు మనుసుల మధ్య బంధాన్ని ముడివేయగల్గితే ఆ ప్రేమకథ సుఖాంతమైనట్టే. కానీ అదే ప్రేమ ఓ మనసులో ఆకాశమంత ఎత్తుకు ఎదిగి మరో మనసులో అసలు తన ఉనికినే చాటకపోతే ఇక ఆ ప్రేమకథ ఎలాంటి ముగింపుకు చేరుతుందో ఊహించడం కష్టమే.

– సేకరణ : మునీరుద్దీన్, ఖమ్మం



పెద్దలు ఏమన్నారంటే...



★ మనల్ని మనం తెలుసుకోవడమే జీవితంలో ఆనందానికి మూలం.
★ మనం ఎంచుకునే (మంచి, చెడు) అంశాలే మనల్ని దానికి తగిన విధంగా తయారుచేస్తాయి.
★ మనపై మన నమ్మకమే విజయానికి తొలిమెట్టు.
★ మన మైండ్‌లోని చెడు ఆలోచనలే వైరస్‌లు. అవి మన సామర్థ్యాన్ని నాశనం చేస్తాయి. మనకు మనమే యాంటీవైరస్‌ని తయారు చేసుకోవాలి.
★ మనల్ని మనమే ఆనందంగా, తృప్తిగా ఉంచుకోవాలి. ఎందుకంటే.. మనకు ఉన్నదాన్ని మాత్రమే ఇతరులకు పంచగలం కదా!
★ మనకు ఆసక్తి ఉన్న మార్గాన్ని ఎంచుకుంటేనే విజయాన్ని పొందగలం.
★ ఎప్పుడైనా మనకు తెలిసిన స్థాయి నుంచే తెలవని స్థాయికి చేరుకోగలం. కాబట్టి మనల్ని మనం ఎప్పుడూ తెలుసుకుంటూ ఉండాలి.
★ మన బలాలను, బలహీనతలను ఎప్పటికప్పుడు స్వయంగా తెలుసుకుంటూ ఉండాలి.
★ మనల్ని మనం అభివృద్ధి పరచుకోవడంపై లక్ష్యం ఉన్నప్పుడే ఫలితాలు వస్తాయి.
★ ఉన్నత లక్ష్యం లేకపోతే ఏదీ సాధించలేం.
★ విజయానికి దగ్గరిదారులు లేవు. అపజయాలకు మాత్రం లెక్కలేనన్ని ఉన్నాయి.
★ ఇతరులను జయించడం కంటే ముందు మనల్ని మనం జయించాలి.
★ మన గురించి మనం శ్రద్ధ తీసుకోవడం నేర్చుకుంటే ఆ అనుభవం ఇతరుల పట్ల కూడా చూపొచ్చు.

– సేకరణ : తపస్వీ, మడికొండ (వరంగల్)

ఆనందంగా ఉండాలంటే ..



☞ మనల్ని నిత్యం కలవరపెట్టే విషయాల నుంచి దూరంగా ఉండాలి.
☞ ఎప్పుడూ ఎవరినీ ద్వేషించొద్దు.
☞ మనసును ఆందోళనలకు దూరంగా ఉంచాలి.
☞ చీటికిమాటికి కంగారు పడొద్దు
☞ నిరాడంబర జీవనం సాగించాలి.
☞ తక్కువ ఆశించాలి.
☞ ఎక్కువ త్యాగం చేయాలి.
☞ ఎప్పుడూ నవ్వుతూ ఉండాలి.

మీరూ రాయొచ్చు

హాయ్ ఫ్రెండ్స్. ఈ పేజీకి మీరేదైనా రాయాలనుకుంటున్నారా.. అయితే ఆలస్యం దేనికి? కలం పట్టండి. ముఖ్యమైన ఈవెంట్స్, సక్సెస్ స్టోరీలు, సమాజ శ్రేయస్సు కోసం చేపడుతున్న కార్యక్రమాలు.. ఇలా యూత్‌కు సంబంధించి సమాచారం ఏదైనా మాకు పంపండి.

మా అడ్రస్ : జోష్ పేజీ, నవ తెలంగాణ తెలుగు దినపత్రిక,
ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం వీధి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500020.
e-mail : josh@navatelangana.com

వావ్.. వాట్ ఏ లవ్!



ప్రేమికులిద్దరు పార్కులో కలుసుకున్నారు.
అతడి భుజంపై ఆమె తల వాల్చింది.
మాటల సందర్భంగా అడిగింది.
'నీ భుజంపై నన్నిలా ఎప్పటి వరకు ఉండనిస్తావ్?'
అప్పుడతను చెప్పాడు..
'నన్ను నలుగురు భుజాల మీద ఎత్తుకునే వరకూ..'
చెప్పాడు ప్రియుడు.

బ్యాక్ టూ బ్యాక్ మెడల్స్. ఫిట్‌నెస్, ఫామ్ కోల్పోయి కొన్నాండ్లుగా ఇబ్బంది పడుతున్న మాజీ వరల్డ్ నెం.1 సైనా నెహ్వాల్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో మెరిసింది. జపాన్ స్టార్ షట్లర్ నొజోమి ఒకుహరతో సెమీ సమరంలో పోరాడి ఓడినా.. కాంస్యం పతకం సాధించి ఆకట్టుకున్నది. గత సీజన్‌లో సిల్వర్ మెడల్ సాధించిన సైనా, గ్లాస్గోలో కాంస్యంతో సరిపెట్టుకున్నది. పి.వి సింధు తర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో రెండో మెడల్ సాధించిన భారత షట్లర్‌గా రికార్డు సృష్టించింది.

కాంస్య కాంతులు

- ఫైనల్స్ దారిలో తడబడిన సైనా నెహ్వాల్
- కాంస్యంతో సరిపెట్టుకున్న మాజీ వరల్డ్ నెం.1
- ఒకుహరతో పోరాడి ఓడిన హైదరాబాదీ
- బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్స్



సైనా నెహ్వాల్

నవతెలంగాణ-గ్లాస్గో

సెమీస్ ప్రత్యర్థి.. రెండు సార్లు ప్రపంచ చాంపియన్ కరొలినా మారిన్ (స్పెయిన్)ను వరుస గేముల్లో ఓడించిన జపాన్ షట్లర్ నొజొమి ఒకుహర. ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్నది. అయితేనేం తొలి గేమ్‌లోనే 21-12తో ఒకుహరను రఫ్ఫాడించింది సైనా నెహ్వాల్. వరల్డ్ నెం.3ని క్వార్టర్స్‌లో మట్టికరిపించి ఫైనల్స్ రేసులో నిలిచిన సైనా పసడి పోరుకు వెళ్లేలా కనిపించింది. రెండో గేమ్‌లోనూ 16-16, 17-17తో ఒకుహరతో హోరాహోరీగా పోరాడింది. కానీ కీలక సమయంలో తడబడిన హైదరాబాదీ అమ్మాయి మూడు గేముల మ్యాచ్‌ను నిరాశగా ముగించింది. 21-12, 17-21, 10-21తో ఒకుహరకు ప్రపంచ చాంపియన్‌షిప్స్ ఫైనల్స్ బెర్త్‌ను కోల్పోయింది. చాన్నాండ్ల తర్వాత పూర్వపు ఫామ్‌లో కనిపించిన సైనా నెహ్వాల్, రియో ఒలింపిక్స్ తర్వాత మోకాలి గాయంతో కెరీర్‌కు గుడ్‌బై చెబుతుందా? అనే దశ నుంచి ప్రపంచ చాంపియన్ షిప్స్‌లో కాంస్యం సాధించి ఆకట్టుకున్నది. 2015 ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో ఫైనల్స్‌కు చేరి ఈ ఘనత సాధించిన తొలి ఇండియన్ షట్లర్‌గా నిలిచిన సైనా.. అప్పుడు సిల్వర్ సాధించింది. వరుసగా రెండో సీజన్‌లో మెడల్ సాధించి, సహచర షట్లర్ సింధు (2013, 2014లలో కాంస్యం) సరసన చేరింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో చైనా షట్లర్, ఐదో సీడ్ సన్ యూపై 21-14, 21-9తో ఏకపక్ష విజయం సాధించిన పి.వి సింధు ఫైనల్స్ రేసులో నిలిచింది. వర్థమాన చైనా స్టార్ చెన్ యుఫెయ్‌తో సెమీస్‌లో తలపడనున్నది.

ఆశలు రేకెత్తించి... : శుక్రవారం నాటి క్వార్టర్‌ఫైనల్లో వరల్డ్ నెం.3, రెండో సీడ్ సంగ్ జీ హ్యూన్ (దక్షిణ కొరియా)పై 21-19, 21-15తో ఏకపక్ష విజయం సాధించిన సైనా నెహ్వాల్ సెమీస్‌లో ఫేవరేట్‌గా కనిపించింది. ప్రత్యర్థి ఒకుహర సైతం క్వార్టర్స్‌లో కరొలినా మారిన్ (స్పెయిన్)ను ఓడించినా.. తొలి గేమ్‌లోనే సైనా సత్తా చాటింది. 2-2 నుంచి వరుసగా ఆరు పాయింట్లు సాధించిన సైనా 8-2తో తిరుగులేని ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఒకుహర పుంజుకొని 5-9తో పోటీలోకి వచ్చింది. కానీ 11-6తో విరామ సమయానికి సైనా ఆధిక్యం కొనసాగించింది. ద్వితీయార్థంలోనూ జోరు కొనసాగించిన సైనా 15-7, 16-10తో దూసుకెళ్లింది. ఒకుహరను బ్యాక్ గేమ్ ఆడిస్తూనే నెట్ దగ్గర నేర్పుగా పాయింట్లు సాధించింది. కానీ రెండో గేమ్‌లో 0-4తో వెనుకంజలో నిలిచిన సైనా.. విరామ సమయానికి 10-11తో ఒకుహరకు పోటీనిచ్చింది. సెకండ్ హాఫ్‌లో 15-15, 16-16, 17-17తో స్కోరు సమం చేసినా ముందంజ వేయటంలో విఫలమైంది. 17-17 వద్ద వరుస పాయింట్లు సాధించిన ఒకుహర రెండో గేమ్‌ను గెల్చుకున్నది. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్‌లో జపాన్ అమ్మాయిని ఆపతరం కాలేదు. వరుసగా తొమ్మిది పాయింట్లు ఖాతాలో వేసుకున్న ఒకుహర.. సైనాను చిత్తు చేసింది. 21-10తో నిర్ణయాత్మక గేమ్‌లో గెలుపొందిన ఫైనల్లోకి ప్రవేశించింది. 74 నిమిషాల సెమీస్‌లో పోరాడి ఓడిన సైనా నెహ్వాల్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో కాంస్యంతో నిష్క్రమించింది. 2015 సిల్వర్ సాధించిన సైనా, ఈ సారి పసిడిపై కన్నేసినా జపాన్ షట్లర్ మాజీ వరల్డ్ నెం.1ను నిలువరించింది.

ఆశలన్నీ సింధుపైనే : సెమీ ఫైనల్లో సైనా నెహ్వాల్ నిష్క్రమణతో ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో భారత్ పసిడి ఆశలన్నీ ఇప్పుడు తెలుగు తేజం పి.వి సింధుపైనే నెలకొన్నాయి. సైనా, సింధులు సెమీస్‌కు చేరటంతో ఆల్ ఇండియన్ ఉమెన్స్ ఫైనల్స్‌పై ఆశలు రేకెత్తినా.. సైనా అనూహ్య రీతిలో నిష్క్రమించింది. శుక్రవారం నాటి క్వార్టర్‌ఫైనల్లో సింధు అలవోక విజయం నమోదు చేసింది. ఐదో సీడ్ చైనా షట్లర్ సన్ యూపై 21-14, 21-9 అత్యంత ఏకపక్ష విజయం నమోదు చేసింది. సహజశైలిలో దూకుడుగా ఆడిన సింధు.. చైనా అమ్మాయిని చిత్తుగా ఓడించింది. తొలి గేమ్‌లో 3-0 నుంచి 13-4తో తిరుగులేని ఆధిక్యం సాధించింది. సన్ యూ కేవలం ఓటమి అంతరాం తగ్గించే ప్రయత్నమే చేయగల్గింది. ఇక రెండో గేమ్‌లో సింధు మరింత దూకుడుగా ఆడింది. పదునైన స్మాష్‌లతో సన్ యూకు చుక్కలు చూపించింది. 6-1, 11-4, 15-8తో దుమ్మురేపింది. 39 నిమిషాల్లోనే సెమీఫైనల్స్ బెర్త్ సొంతం చేసుకున్నది.

ఇక శనివారం అర్థరాత్రి తరువాత జరిగే సెమీఫైనల్లో చైనా సంచలన షట్లర్ చెన్ యుఫెయ్‌తో సింధు తలపడనున్నది. డిఫెండింగ్ చాంపియన్ అకానె యమగూచి (జపాన్)పై గెలుపొందిన చెన్ యుఫెయ్ మంచి జోరుమీదున్నది. చెన్ యుఫెయ్‌తో ముఖాముఖిలో సింధు 1-1తో సమవుజ్జీగా ఉంది. అయితే సింధు 2015 మకావు ఓపెన్‌లో యుఫెయ్‌ను ఓడించగా, చైనా అమ్మాయి మాత్రం ఇటీవల మలేషియా ఓపెన్‌లో మన అమ్మాయిపై గెలుపొందింది. ప్రస్తుతం చెన్ భీకర ఫామ్‌లో ఉన్నప్పటికీ, దూకుడుకు పెట్టింది పేరైన సింధుతో ఆమె పోరు ఆసక్తికరంగా మారింది.



పి.వి సింధు

సెమీస్ సాగిందిలా

సైనా		ఒకుహర
06	వరుస పాయింట్లు	09
01	గేమ్ పాయింట్లు	03
102	ర్యాలీలు	102
48	నెగ్గిన ర్యాలీలు	54
102	మొత్తం పాయింట్లు	102
54	నెగ్గిన పాయింట్లు	48

మ్యాచ్ సమయం : 74 నిమిషాలు
ఫలితం : 21-12, 17-21, 10-21

రియో వెళ్లాల్సింది కాదు!



'రియో ఒలింపిక్స్‌కు నేను వెళ్లి ఉండాల్సింది కాదు. అక్కడికెళ్లిన తర్వాతే గాయం గురించి తెలిసింది. అంత పెద్ద గాయం అనుకోలేదు. తల్లిదండ్రుల, కోచ్ నమ్మకమే ఇక్కడికి తీసుకొచ్చింది. ఇప్పటికే కుడి కాలి మోకాలితో ఇబ్బంది పడుతున్నాను. మెడల్ వస్తుందని అనుకోలేదు. కఠినమైన డ్రా ఎదురైంది. అయినా సెమీఫైనల్స్‌కు చేరుకోవటం గొప్పగా అనిపించింది' - **సైనా నెహ్వాల్**

పైరేట్స్ విజయం



ముంబయి: తమిల్ తలైవాస్‌పై పట్నా పైరేట్స్ 35-24తో గెలుపొందింది. రైడర్స్, డిఫెండర్స్ సమిష్టిగా రాణించడంతో అలవోకగా విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రథమార్థంలో 8-8తో తడబడిన పట్నా పుంజుకుని 16-9తో తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ద్వితీయార్థంలోనూ దూకుడుగా ఆడి ప్రత్యర్థిని ఇరకాటంలోకి నెట్టింది. పట్నా రైడర్‌లలో మోను గోయత్ 11 పాయింట్లతో మెరిపించాడు. పర్దీప్ నర్వాల్ ఆరు రైడ్ పాయింట్లు, జైదీప్ అయిదు టాకిల్స్‌తో ఆకట్టుకున్నారు. తమిళ తలైవాస్‌లో అజయ్ ఠాకూర్ 10 రైడ్ పాయింట్లు చేయగా, దర్శన్ అమిత్ హుడాలు చెరో మూడు టాకిల్స్‌తో రాణించారు. మరో మ్యాచ్‌లో ముంబయిపై పుణె 26-24తో విజయం సాధించింది. ఇరు జట్లు సమఉజ్జీలుగా నిలిచిన పోరులో చివరి రెండు టాకిల్స్‌తో పుణె గెలిచింది. పుణేరి పల్టన్ టాప్ రైడర్ దీపక్ హుడా ఏడు రైడ్ పాయింట్లు సాధించాడు. శుక్రవారం బెంగాల్, పట్నాల మధ్య జరిగిన మ్యాచ్ టై అవ్వగా, మరో మ్యాచ్‌లో జైపూర్‌ను ముంబయి 36-39తో ఓడించింది.

బెంగాల్ X బెంగళూరు	ప్రొ కబడ్డీలో నేడు	ముంబయి X ఢిల్లీ
రాత్రి 8 గంటలకు		రాత్రి 9 గంటలకు

రెజ్లింగ్‌లో సున్నా

- ముగిసిన వరల్డ్ చాంపియన్‌షిప్స్

పారిస్ : రెజ్లింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు వరుసగా రెండో ఏడాది రిక్తహస్తమే మిగిలింది. రియో స్టార్ సాక్షి మాలిక్ సహా భజరంగ్ పూనియాలు పతకాలు తీసుకొస్తారని ఆశించినా..భారత్‌కు నిరాశే ఎదురైంది. శనివారంతో రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్ ముగిసినా, భారత్‌కు ఒక్కటంటే ఒక్క మెడల్ కూడా దక్కలేదు. ఆఖరి రోజు భజరంగ్ పూనియా 65 కేజీల విభాగంలో రిపిచేజ్ బౌట్‌లో కాంస్యం తలపడినా.. పతకం తీసుకురాలేకపోయాడు. టర్కీ రెజ్లర్ ముస్తాఫా కయా చేతిలో 3-8తో భజరంగ్ ఓటమిపాలయ్యాడు. 24 మందితో కూడిన బలమైన రెజ్లర్ల బృందం పారిస్‌కు వెళ్లినా.. ఒక్క మెడల్ కూడా సాధించకుండానే వెనక్కి వచ్చింది. మహిళల విభాగంలో సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్‌లు నిరాశపరిచారు. నిరుడు బుధాపెస్ట్‌లో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లోనూ భారత్‌కు పతకాలేమీ దక్కలేదు.



సాక్షి మాలిక్

అద్భుత ప్రదర్శనల నడుమ ముగిసిన రెండో వన్డేలో నెగ్గిన టీమ్ ఇండియా.. పల్లెకెలెలోనే వన్డే సిరీస్‌ను సొంతం చేసుకోవాలని చూస్తోంది. కోహ్లిసేన 2-0తో సిరీస్‌లో ఆధిక్యంలో కొనసాగుతున్నది. ఆతిథ్య జట్టుకు అవకాశం ఇవ్వకుండా మూడో వన్డేలో ముగుస్తుందేమో చూడాలి!.

మూడులోనే ముగిస్తారా?

- వన్డే సిరీస్‌పై కన్నేసిన కోహ్లిసేన
- నెగ్గాలనే తపనతో కనిపిస్తోన్న శ్రీలంక
- పల్లెకెలెలో నేడు మూడో వన్డే



విరాట్ కోహ్లి

మధ్యాహ్నం 2.30 నుంచి సోనీసిక్స్‌లో ప్రసారం..

నవతెలంగాణ-పల్లెకెలె

చప్పగా సాగుతున్న వన్డే సిరీస్‌ను రెండో వన్డే రసవత్తరంగా మార్చివేసింది!. పోటీ లేదనుకుంటున్న తరుణంలో శ్రీలంక శిబిరం నుంచి దూసుకొచ్చాడు యువ స్పిన్నర్ అఖిల ధనంజయ. అద్భుత ప్రదర్శనతో రెండో వన్డేలో గెల్చినంత పనిచేసిన శ్రీలంక.. మొత్తానికి కోహ్లిసేనకు పోటీ ఇవ్వగల స్థాయికి చేరుకున్నది. ఇప్పటికే టీమ్ ఇండియా 2-0తో ఆధిక్యంలో ఉండటం, మూడో వన్డేలోనూ నెగ్గితే సిరీస్ సొంతం కావటం లాంఛనమే. కానీ సిరీస్‌పై ఆశలు సజీవంగా నిలవాలంటే పల్లెకెలె పోరులో శ్రీలంక తప్పకుండా గెలవాలి. అప్పుడే ఆతిథ్య జట్టు కొలంబో ఆశలతో బరిలోకి దిగే అవకాశం ఉంటుంది. నేటి వన్డేలో అఖిల ధనంజయ మిస్టరీ మాయాజాలాన్ని కోహ్లిసేన ఏ విధంగా ఎదుర్కొంటుదనేది ఆసక్తికరం. మూడో వన్డేలోనూ బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు ఉండటంతో శ్రీలంక బౌలర్లకు అవకాశాలు తెరిచే ఉన్నాయని చెప్పవచ్చు!.

ప్రయోగాలు ఉంటాయ్ : రెండో వన్డేలో బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు కుదిపేసినా.. ప్రయోగాలు ఆపేది లేదని ఫీల్డింగ్ కోచ్ ఆర్. శ్రీధర్ మాట. దీంతో నేటి మ్యాచ్‌లోనూ కేదార్ జాదవ్, లోకేశ్ రాహుల్‌లు ముందు వరుసలో బ్యాటింగ్‌కు రానున్నారు. తొలి ప్రయత్నంలో విఫలమైనా నేడు మంచి ప్రదర్శనతో జట్టు నమ్మకాన్ని నిలబెట్టాలనే కృతనిశ్చయంతో ఉన్నారు వీరిద్దరు. విరాట్ కోహ్లి మరోసారి ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు రానున్నాడు. ఫిట్‌నెస్ సాధించిన హార్దిక్ పాండ్య తుది జట్టులో ఉండటం ఖాయమే. హార్దిక్ హిట్టింగ్ సామర్థ్యంపై ప్రపంచానికి ఎలాంటి అనుమానాలు లేకపోయినా, సందర్భానుసారం అతడు ఆడగలడా? అనేది ఇప్పటికీ ప్రశ్నార్థకమే. రెండో వన్డేలో అతడి దుందుడుకు బ్యాటింగ్ శైలి ఈ సందేహాలను మరింత బలపరుస్తోంది. దీంతో హార్దిక్ దూకుడుగానే కాదు, సమయోచితంగా ఆడాల్సిన సమయం ఆసన్నమైంది. స్పిన్ విభాగంలో కుల్‌దీప్ యాదవ్ మళ్లీ బెంచ్‌కే పరిమితమయ్యేలా కనిస్తున్నాడు.

అంతా అఖిలమయం! : శ్రీలంక శిబిరంలో ఉన్నట్టుండి ఓ మ్యాచ్ విన్నర్ ఎదిగాడు!. కండ్లుచెదిరే ప్రదర్శనతో భారత బ్యాటింగ్ లైనప్‌ను అతలాకుతలం చేసిన మిస్టరీ స్పిన్నర్ అఖిల ధనంజయ.. నేటి మ్యాచ్‌లోనూ ప్రత్యేక ఆకర్షణ. సంప్రదాయ ఆఫ్ స్పిన్నరే అయినా గూగ్లీలతో ధనంజయ సృష్టించిన కల్లోలం మరువరానిది. భారత బ్యాట్స్‌మెన్‌ను అఖిల ఏ విధంగా మళ్లీ పడగొడతాడని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బ్యాటింగ్ లైనప్‌లో నిరోశన్ డిక్‌వెల్లాకు తోడు చండిమాల్, తిరిమానెలు తోడయ్యారు. లోయర్ ఆర్డర్‌లో సిరివర్ధన, కపుగెదరలు ఆశలు కల్పిస్తున్నారు. సీనియర్ సీమర్ లసిత్ మలింగ బౌలింగ్ సారథ్యం వహించాలని జట్టు మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది.

తుది జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, విరాట్ కోహ్లి, లోకేశ్ రాహుల్, కేదార్ జాదవ్, ఎం.ఎస్ ధోని, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, యుజ్వేందర్ చాహల్, జశ్‌ప్రీత్ బుమ్రా.

శ్రీలంక : నిరోశన్ డిక్‌వెల్లా, లహిరు తిరిమానె, కుశాల్ మెండిస్, దినేశ్ చండిమాల్, ఏంజెలో మాథ్యూస్, చమర కపుగెదర (కెప్టెన్), మిలింద సిరివర్ధన, అఖిల ధనంజయ, దుష్మంత చమీరా, విశ్వ ఫెర్నాండో, లసిత్ మలింగ.

వరుణుడు వస్తాడు!

పల్లెకెలెలో మరోసారి వరుణుడు రంగ ప్రవేశం చేసే ప్రమాదం పొంచి ఉన్నది. రెండో వన్డేలో సుమారు రెండు గంటల పాటు అంతరాయం కలిగించిన వరుణుడు.. మూడో వన్డేనూ వదిలేలా లేడు. ఆదివారం సైతం వర్ష సూచన ఉండటంతో ఆటకు అంతరాయం కలిగే అవకాశం కనిపిస్తోంది.

తరంగ అవుట్



శ్రీలంక వన్డే కెప్టెన్ ఉపుల్ తరంగపై వేటు పడింది. స్లో ఓవర్‌రేట్ కారణంగా తరంపై ఐసీసీ రెండు మ్యాచుల నిషేధం విధించింది. పల్లెకెలె పోరులో నిర్ణీత సమయానికి లంక మూడు ఓవర్ల వెనుకంజలో కొనసాగింది. చాంపియన్స్ ట్రోఫీ సందర్భంలోనూ స్లో ఓవర్ రేట్ కారణంగా తరంగ రెండు మ్యాచులకు దూరమయ్యాడు. తరంగపై వేటుతో కపుగెదర తర్వాతి రెండు వన్డేల్లో సారథ్య బాధ్యతలు తీసుకోనున్నాడు. టెస్టు కెప్టెన్ దినేశ్ చండిమాల్ జట్టులోకి వచ్చినా, తొలుత తరంగకు డిప్యూటీగా ఉన్న కపుగెదరకే కెప్టెన్సీ ఇవ్వటం సబబని శ్రీలంక నిర్ణయించింది.

బ్రాత్‌వైట్, హోప్ సెంచరీలు

- ఇంగ్లాండ్‌తో విండీస్ రెండో టెస్టు



లీడ్స్ : ఇంగ్లాండ్‌తో రెండో టెస్టులో వెస్టిండీస్ పట్టు సాధిస్తోంది. తొలుత ఇంగ్లాండ్‌ను 258 పరుగులకే కుప్పకూల్చిన కరీబీయన్ బౌలర్లు.. బ్యాట్‌తోనూ రాణిస్తున్నారు. క్రెగ్ బ్రాత్‌వైట్ (134, 249 బంతుల్లో 17 ఫోర్లు, 2 సిక్స్‌లు) సహా షాయ్ హోప్ (147 నాటౌట్, 252 బంతుల్లో 23 ఫోర్లు) భారీ సెంచరీలతో నాల్గో వికెట్‌కు 245 పరుగులు జోడించారు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 102 ఓవర్లలో 329/5 వద్ద నిలిచిన విండీస్.. 71 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. హోప్‌కు తోడు బ్లాక్‌వుడ్ (21) అజేయంగా క్రీజులో కొనసాగుతున్నాడు. బ్రాత్‌వైట్, హోప్ మినహా మిగతా బ్యాట్స్‌మెన్ విఫలమయ్యారు. పావెల్ (5), బిషూ (1), రోస్టన్ ఛేజ్ (5)లు స్వల్ప స్కోర్లకే వికెట్లు కోల్పోయారు. ఇంగ్లాండ్ బౌలర్లలో అండర్సన్ (3/46) మూడు వికెట్లతో మెరిశాడు. వెస్టిండీస్ బౌలర్లు గాబ్రియెల్ (4/51), రోచ్ (4/71) విజృంభించటంతో ఇంగ్లాండ్ స్వల్ప స్కోరుకే పరిమితమైంది. ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ (100, 124 బంతుల్లో 17 ఫోర్లు), కెప్టెన్ జోయ్ రూట్ (59, 98 బంతుల్లో 9 ఫోర్లు) రాణించటంతో ఆ మాత్రం పరుగులైనా సాధించింది. నేడు మూడో రోజు ఆటలో వెస్టిండీస్‌ను వీలైనంత త్వరగా ఆలౌట్ చేయటంపై ఇంగ్లీష్ బౌలర్లు దృష్టి పెట్టారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.